



# బోల్షివిక్

సంపుటి: 6 సంచిక: 2 సి.పి.ఐ (మావోయిస్టు) ఎ.ఒ.బి. సమాచార పత్రిక జులై-డిసెంబర్ 2018

## లోపలి పేజీల్లో...

రాంగూడ సంఘటన తదనంతర పరిస్థితి .......... 03

ఇంటర్వ్యూ .......... 06

పార్లమెంటరీ పంథాపై విమర్శ .......... 12

సి.ఆర్.బి పత్రికా ప్రకటన .......... 21

నేను గెరిల్లానెందుకయ్యానంటే? .......... 24

అమరుల జీవిత చరిత్ర

- కామ్రేడ్ మీనా .......... 29
- కామ్రేడ్ కీర్తి .......... 32
- కామ్రేడ్ రుప్ని .......... 33
- కామ్రేడ్ అడ్మాల్ .......... 34
- కామ్రేడ్ సున్ని .......... 35

పోరాట స్రవంతి .......... 36

## అమరులకు నివాళి

# మీ త్యాగాల వెలుగులో ప్రజాయుద్ధ మార్గం ప్రకాశవంతమైంది!

# లక్ష్యం చేరేదాక మీరు చూపిన మార్గాన్ని వదలం!!



భారత దేశంలో ప్రస్తుతం నెలకొని వున్న అర్ధ భూస్వామ్య, అర్ధవలస సమాజాన్ని కూకటివేళ్లతో పెళ్లగించి, నూతన ప్రజాస్వామిక వ్యవస్థనూ, ఈ క్రమంలో సోషలిజాన్ని, అంతిమంగా కమ్యూనిజాన్ని స్థాపించే లక్ష్యంతో సి.పి.ఐ మావోయిస్టు పార్టీ నేతృత్వంలో ప్రజలు వీరోచితంగా ఉద్యమిస్తున్నారు. ఈ ఉద్యమాన్ని అణచి వేసి, తమ అధికారాన్ని సుస్థిరం చేసుకొనేందుకూ, దోపిడీ పీడనలను కొనసాగించేందుకు ఈ దేశ దోపిడీ పాలక వర్గాలైన దళారీ, నిరంకుశ బూర్జువా, భూస్వామ్య వర్గాలు, వారి యజమానులైన సామ్రాజ్యవాదులు తమ రాజ్యాంగ యంత్రం ద్వారా పార్టీపైన, పి.ఎల్.జి.ఎ.పైన, ప్రజలపైన తీవ్రమైన సాయుధ అణిచివేతను కొనసాగిస్తున్నారు. ఈ అణచివేత 2009 సెప్టెంబర్ నుండి గ్రీన్‌హంట్ బహుముఖ, సైనిక దాడి రూపంలో మరింత తీవ్రతరం అయింది. ఈ దాడి అత్యంత పాశవికంగా, క్రూరంగా, మోసపూరితంగా కొనసాగుతున్నది. విరుద్ధ ప్రయోజనాల  కోసం జరుగుతున్న ఈ యుద్ధంలో ప్రజల రాజ్యాధికారాన్ని నెలకొల్పే లక్ష్యంతో దోపిడి వర్గాల రాజ్యంతో వీరోచితంగా పోరాడుతూ అనేక మంది ప్రజల ఉత్తమ పుత్రులు, పుత్రికలు తమ అమూల్యమైన ప్రాణాలను తృణప్రాయంగా అర్పిస్తున్నారు. చరిత్ర పురోగమనానికి తమ వంతు కర్తవ్యంగా వీరోచితమైన త్యాగాలను చేస్తూ గొప్ప విప్లవ సాంప్రదాయాలను నెలకొల్పుతున్నారు. 2018 జులై నుండి డిసెంబర్ వరకు దేశవ్యాప్తంగా పదుల సంఖ్యలోనే పార్టీ, పి.ఎల్.జి.ఎ, ప్రజాసంఘాల సభ్యుల నాయకత్వంతో పాటు, సాధారణ ప్రజలు నేలకొరిగారు. ఎ.ఒ.బిలో కామ్రేడ్ మీనా (డి.వి.సి.ఎమ్), కామ్రేడ్ కీర్తి (ఎ.సి.ఎమ్),  కామ్రేడ్ రుప్పి (ఎ.సి.ఎమ్), కామ్రేడ్ అడ్మాల్ (ఎ.సి.ఎమ్), కామ్రేడ్ సున్ని (పి.ఎమ్) ఈ కామ్రేడ్స్‌తో పాటు, దేశ వ్యాపితంగా అనేక మంది కామ్రేడ్స్ శత్రువుతో విరోచితంగా పోరాడుతూ అమరులైనారు. మన ఈ కామ్రేడ్స్ అమరత్వం పార్టీకి, ఉద్యమానికి ఎనలేని నష్టాన్ని కల్పించింది. వారి కుటుంబాలకు, శ్రేయోభిలాషులకు తీవ్రమైన దుఃఖాన్ని నింపింది. ఈ పరిస్థితులలో అమరుల కుటుంబాల, శ్రేయోభిలాషుల దు:ఖంలో పాల్పంచుకుంటూ, వారికి ఎస్.జడ్.సి ప్రగాఢ సంతాపాన్ని తెలియ జేస్తున్నది. అలాగే అమరుల ఆశయాలను సఫలీకృతం చేస్తామని ప్రతిజ్ఞ చేస్తూ, వారికి తలవంచి వినమ్రంగా శ్రద్ధాంజలి ఘటిస్తున్నది.

మన అమరుల త్యాగాలు మన వెంటనే వున్నాయి. వారి త్యాగాలతో మన మార్గం ప్రకాశవంతమైంది. మన పురోగమనంలో వారిస్తున్న ఉత్తేజం మనకు నూతన శక్తినీ, చైతన్యాన్ని అందిస్తున్నది. అందుకే వారు సదా చిరస్మరణీయులు.

వ్యాసం

# రాంగూడ సంఘటన తదనంతర పరిస్థితి

సి.పి.ఐ మావోయిస్టు పార్టీ చరిత్రలో, ఎక్కువ (31) మంది కామ్రేడ్స్‌ను కోల్పోయిన మొదటి ఘటనగా, కటాఫ్ ఏరియాలోని రాంగూడ సంఘటన నిలిచిపోయింది. ఈ ఘటనలో స్పెషల్ జోనల్ కమిటీ సభ్యులు ఇద్దరు, డివిజనల్ కమిటీ సభ్యులు ఇద్దరు, ఏరియా కమిటీ సభ్యులు 11 మంది, పార్టీ సభ్యులు 7గురు, ప్రజా నిర్మాణాలకూ, మిలీషియాకు చెందిన 9 మంది చనిపోయారు. వీరు తమను మట్టుపెట్టేందుకు చుట్టుముట్టిన ప్రభుత్వ కిరాయి సాయుధ మూకలతో వీరోచితంగా పోరాడుతూ అమరులైనారు.

ఈ సంఘటన మొత్తం పార్టీకీ, ప్రత్యేకంగా ఎ.ఒ.బి జోన్ ఉద్యమానికి తీవ్రమైన నష్టాన్ని కలిగించింది. ఇది అంతకు ముందెన్నడూ జరగనంత పెద్ద నష్టం కావడంతో, విప్లవ, ప్రజాస్వామిక సంస్థలు, వ్యక్తులు, పీడిత ప్రజలు అత్యంత తీవ్రంగా కలత చెందారు. దీంతో వారు ఒకవైపున తమ ఆందోళనను వ్యక్తం చేస్తూనే, మరోవైపు తమ సామాజిక బాధ్యతగా రాంగూడ ప్రాంతంలోని ఆదివాసీ రైతాంగానికీ, వారి న్యాయమైన ఉద్యమానికి అండగా నిలిచారు. వారు దఫదఫాలుగా ఎన్‌కౌంటర్ జరిగిన ప్రాంతాన్ని సందర్శించి, నిజనిర్ధారణ కార్యక్రమాన్ని చేపట్టి, వాస్తవాలను బహిర్గతపర్చారు. ఆ సంఘటనలో ప్రభుత్వ సాయుధ బలగాలు ఏకపక్షంగా కాల్పులు ప్రారంభించడంతో పాటు, నిరాయుధంగా వున్న 9 మంది మిలీషియా సభ్యులనూ, గాయపడి కదలలేని పరిస్థితిలో వున్న మరికొంత మంది పి.ఎల్.జి.ఎ సభ్యులను పట్టుకొని, అత్యంత అమానుషంగా కాల్చి చంపిన వాస్తవాలను బహిర్గతపర్చారు. అంతేకాకుండా, ఆ ప్రాంతంలో పార్టీని, పి.ఎల్.జి.ఎను సమూలంగా నిర్మూలించి, అక్కడ పురోగమిస్తున్న వ్యవసాయక విప్లవాన్ని అడ్డుకునేందుకూ, అంతర్జాతీయ, దేశీయ కార్పొరేట్ సంస్థలకు లాభాలు చేకూర్చి పెట్టే, బాక్సైట్ గనుల తవ్వకాలకు పరిస్థితిని సానుకూలం చేసేందుకు ఈ దాడి జరిగిందనే సత్యాన్ని ప్రజలముందుంచారు. బుద్ధిజీవులు చేపట్టిన ఈ నిజనిర్ధారణ కార్యక్రమంలో, ఆ ప్రాంత ప్రజలు ధైర్యంగా ముందుకు వచ్చి, సంపూర్ణంగా సహకరించారు. ఈ సందర్భంగా ఆదివాసీ రైతాంగానికి, మధ్య తరగతి బుద్ధిజీవులు అందించిన సహకారం, ఇచ్చిన మద్ధతు వారికి గొప్ప ఊరటను, ధైర్యాన్ని ఇస్తే, అంతటి నరమేధం జరిగిన తర్వాత కూడా, ఆదివాసీ రైతాంగం తమ న్యాయమైన పోరాటంపై విశ్వాసం ఉంచుతూ, ప్రభుత్వ నిరంకుశ దాడిని వ్యతిరేకిస్తూ, ధైర్యంగా, దృఢంగా నిలబడి, నిజాలు వెలికితీయడంలో వారు చూపిన చొరవ, బుద్ధిజీవులలో భవిష్యత్ ఉద్యమ పురోగమనం ఎడల ఎనలేని విశ్వాసాన్ని కలిగించింది.

శత్రువు మాత్రం ఎ.ఒ.బి ఉద్యమం పూర్తిగా తుడిచి పెట్టుకుపోయిందని ప్రచారం చేస్తూ, పార్టీ, పి.ఎల్.జి.ఎ, ప్రజా నిర్మాణాలలో గందరగోళం సృష్టించి, ఉద్యమ పురోగమనం ఎడల విశ్వాసం సడలింప చేసి, లొంగుబాట్లను ప్రోత్సహించాడు. అయితే ఈ సంఘటన పార్టీ, పి.ఎల్.జి.ఎ, ప్రజా నిర్మాణాలలో ఏ మాత్రం



**రాంగూడ సంఘటన తదనంతరం మరింతగా సంఘటితపడిన కటాఫ్ ఏరియా విప్లవ ప్రజానీకం**

నిరాశ, నిస్పృహలనుగానీ, ఊగిసలాటను గాని కలిగించలేదు. వారు అమరుల నెత్తుటి బాకీని తీర్చుకునేందుకు తమ కర్తవ్య నిర్వహణకు మరింత పదును పెట్టడం ప్రారంభించారు. రాంగూడ సంఘటన జరిగిన మరుసటి దినం నుండే పార్టీ, పి.ఎల్.జి.ఎ శ్రేణులు, అమరుల కుటుంబాలతో కలిసి, వారితో బాధను పంచుకుంటూ, వారికి ధైర్యాన్ని అందించారు. మరోవైపు అమరుల ఆశయ సాధన కోసమూ, తమ న్యాయమైన రాజకీయ హక్కుల సాధన కోసం ఉద్యమానికి పునరంకితం కావాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ పిలుపునందుకున్న స్థానిక పార్టీ, ప్రజా నిర్మాణాలు, మిలీషియా ఉబుకుతున్న తమ దుఃఖాన్ని పంటి బిగువున దిగమింగుతూనే, కర్తవ్య నిర్వహణకు సిద్ధమైనారు. అప్పటికే ఆపరేషన్ గ్రీన్‌హంట్ సైనిక దాడి 3వ దశ తీవ్రతరం కావడంతో, ఆ దాడిని ఎదుర్కొనే విధంగా పార్టీ, వ్యవసాయక విప్లవ గెరిల్లా యుద్ధం తీవ్రతరం చేసేందుకు, ప్రజలను మరింత సిద్ధం చేయడం ప్రారంభించింది. రాజ్యాధికారం లక్ష్యంగా, గెరిల్లా బేస్ నిర్మాణం దిశగా, ప్రజలను సంఘటిత పరిచే కృషిని తీవ్రతరం చేసింది.

ఈ క్రమంలోనే వర్గపోరాటం మరింతగా ఊపందుకుంటూ, ప్రజల చైతన్యం క్రమక్రమంగా పెరుగుతూ వచ్చింది. రాంగూడ సంఘటన తదనంతరం, జనవరి 2017లో జరిగిన స్థానిక పంచాయితీ, సమితీ, జిల్లా పరిషత్ ఎన్నికలను ఆ ప్రాంత ప్రజలు సంపూర్ణంగా బహిష్కరించి, ఈ దేశ దోపిడీ పాలక వర్గాల ఎడల, వారి బూటకపు పార్లమెంటరీ ప్రజాస్వామ్యం ఎడల తీవ్రమైన నిరసనను వ్యక్తం చేశారు. 18 పంచాయితీలలో ఎన్నికలను పూర్తిగా బహిష్కరించారు. ఇదే క్రమంలో రాంగూడ సంఘటనలో పోలీసులకు సహకరించి, సమాచారం ఇచ్చిన ఇన్‌ఫార్మర్లను కొద్దికాలంలోనే ప్రజలు గుర్తించి, పార్టీ, పి.ఎల్.జి.ఎల నేతృత్వంలో శిక్షించారు. ఈ సంఘటనలో చురుగ్గా పని చేసిన స్థానిక పోలీస్ ఇన్‌ఫార్మర్ నెట్‌వర్క్‌ను, దాదాపుగా ప్రక్షాళనం చేశారు. ఈ కార్యక్రమాన్నంతా 6 నెలల్లోనే పూర్తి చేశారు.

శత్రువు ఏర్పర్చుకున్న ముఖ్యమైన సమాచార యంత్రాంగం దెబ్బతినటంతో, పోలీసు దాడులు తాత్కాలికంగా ఆగాయి. అయితే మిగిలిన పార్టీ, పి.ఎల్.జి.ఎల నాయకత్వాన్ని పూర్తిగా నిర్మూలించే పథకంతో, తిరిగి మరో పెద్ద దాడి చేపట్టేందుకు, పోలీస్ ఇంటలిజెన్సీ వ్యవస్థ సన్నాహాలు చేపట్టింది. ఇటువంటి పరిస్థితులలోనే వచ్చిన కొద్దిపాటి వెసులుబాటును ఉపయోగించుకొని ప్రజలు, పార్టీ రూపొందించిన కర్తవ్యాలను సొంతం చేసుకోవడమే కాకుండా, కార్యాచరణలోకి దిగారు. 2017 జులై, 28 అమరుల వారోత్సవాలను ఎప్పుడూ జరపనంత ఘనంగా జరిపారు. అనేక గ్రామాలలో అమరుల స్థూపాలను నిర్మించారు. గురుశెట్టి, దర్లబెడ, తోటగూడ గ్రామాలలో అమరుల స్మారక భవనాలు నిర్మించారు. ఈ నిర్మాణ పనులలో అనేక గ్రామాల ప్రజలు స్వచ్ఛందంగా, సమిష్టిగా పాల్గొన్నారు. ఆ నిర్మాణాలకు అయ్యే ఖర్చును కూడా వారే సమిష్టిగా భరించారు. ఈ సందర్భంగా గురుశెట్టి గ్రామం వద్ద జరిగిన అమరుల సంస్మరణ సభను ఘనంగా జరిపారు. సభకు సంబంధించిన సమాచారం శత్రువుకు చేరకుండా, ముందునుండే తగిన రహస్య పద్ధతులు పాటించారు. సభకు రెండు రోజుల ముందునుండే ఆ ప్రాంతంలో ప్రజల వద్ద వున్న మొబైల్ ఫోన్స్ అన్నింటిని స్వచ్ఛందంగా బందు పెట్టారు. మొబైల్ ఫోన్స్ పని చేసే కొన్ని సెంటర్లలో, శత్రు ఏజెంట్లపై, మిలీషియా నిఘాను ఏర్పాటు చేశారు. సభ నిర్వహణకు ఒక్క రోజు ముందు మాత్రమే చుట్టుపక్కల గ్రామాలకు సమాచారం పంపారు. అయినప్పటికీ, ఆంధ్రా ఒడిశా గ్రామాల నుండి 10 వేల మంది దాకా ప్రజలు హాజరైనారు. వారు ఎవరికి చేతనైనంత మేర వారు బట్టలు, వంటపాత్రలు, డబ్బులు తెచ్చి, అమరుల కుటుంబాలకు అందించి, తమ సంఘీభావాన్ని తెలిపారు. ఈ సభను పోలీసు దాడుల నుండి రక్షించుకునేందుకు, 200 మంది మిలీషియా సభ్యులు, పోలీసులు వచ్చే మార్గాలన్నింటా కాపలా విధులు నిర్వహిస్తూ, రక్షణ కవచంలా ఏర్పడ్డారు. ఈ సభ ముగింపులో ప్రజలు తాము నిర్మించిన అమరుల స్మారక భవనాలను స్కూల్, లైబ్రరీ, రేషన్ నిల్వ వంటి ప్రజల అవసరాలకు, ఒక్కొక్క చోట, ఒక్కొక్క రకంగా ఉపయోగించుకోవాలని నిర్ణయం తీసుకోవడంతో పాటు, అమరుల జ్ఞాపకార్థం నిర్మించుకున్న స్థూపాలను, స్మారక భవనాలను శత్రు దాడుల నుండి రక్షించుకోవాలని ప్రతిజ్ఞ చేశారు. అమరుల ఆశయ సాధనలో భాగంగా, శత్రువుకు వ్యతిరేకంగా ఒక గొప్ప రాజకీయ సంకల్పంతో నిర్వహించిన ఈ అమరుల సంస్మరణ సభ, ప్రజలలోని వర్గ చైతన్యానికి మరింతగా పదును పెట్టింది.

ఇదే కాలంలో పార్టీ నేతృత్వంలో ప్రజలు వ్యవసాయక విప్లవ వర్గపోరాటాన్ని తీవ్రతరం చేశారు. ఉద్యమ ప్రాంతంలోని దాదాపు గ్రామాలన్నింటా 'దున్నేవారికే భూమి' దక్కాలని జరిగిన పోరాటంలో ఆదివాసీ, ఆదివాసేతర పెత్తందారుల నుండి భూమి గుంజుకోవడమే కాకుండా, వారి ఆధిపత్యాన్ని దెబ్బతీశారు. ఈ సందర్భంగా వ్యవసాయ కూలీ, పేద రైతాంగానికి భూమి పంపకం జరగడంతో పాటు, రైతుకూలీ సంఘాల రూపంలో ప్రజల ఆధికారం మరింత బలపడింది. ప్రజలు మహిళా, యువజన, సాంస్కృతిక సంఘాలతో పాటు, మిలీషియాలోకి విస్తృతంగా సమీకరించబడ్డారు. వ్యవసాయక విప్లవ పోరాటాన్ని పురోగమింపజేయడంలో భాగంగా, రైతుకూలీ సంఘాలు అనేక గ్రామాలలో భూమి చదును కార్యక్రమం చేపట్టి, భూమిలేని రైతాంగానికి భూమిని పంచాయి. గతంలో భూ పంపకాల్లో జరిగిన కొన్ని అవకతవకలను సరి చేశాయి. దాదాపుగా అన్ని గ్రామాలలో 5 నుండి 10 కుటుంబాల వరకు కలిసి, ఒక్కొక్క శ్రమ సహకార టీంగా, అనేక టీంలు ఏర్పడి, పంట వేయడం, పంట కోయడం, నూర్పిళ్ళు వంటి పనులను సకాలంలో చేశారు. ఈ సహకార పద్ధతిలో, వ్యవసాయ ఉపకరణాలు ఉన్నవారు, అవి లేనివాళ్ళ భూములను కూడా సాగు చేశారు. అందరు కలిసి, ఎక్కువ గంటలు పని చేసి, మొత్తం భూములను సాగులోకి తెచ్చి, సకాలంలో పంటలు వేశారు. దీంతో గ్రామాలలో పంట దిగుబడి, గతం కన్నా

పెరిగింది. భూమిలేని వారికి కూడా పని కల్పించబడింది. భూమిలేనివారికి కూడా పండిన పంటలో న్యాయమైన వాటా దక్కటంతో, వలసలు వెళ్ళే సమస్య, అర్ధాకలి సమస్య చాలా వరకు పరిష్కారమయింది. గతంలో కొంత ఎక్కువగా భూములున్న కుటుంబాలలో తగినంత మంది శ్రమ చేసేవారు లేక, అవసరమైనన్ని వ్యవసాయ ఉపకరణాలు లేక భూమినంతా సాగు చేయలేకపోయేవారు. ఈ సహకార పద్ధతి వలన, గ్రామంలో ఒక్క సెంటు కూడా భూమి మిగలకుండా సాగు చేయడం వలన ఉత్పత్తి పెరిగి, భూములున్న కుటుంబాలకు గతం కన్నా కూడా ఎక్కువే ఈ పద్ధతిలో రాబడి వచ్చింది. దీంతో వారు కూడా సంతృప్తిపడి, ఈ పద్ధతిని కొనసాగించేందుకు మన:స్ఫూర్తిగా దోహదపడుతున్నారు. ఈక్రమంలోనే సుమారు 20 గ్రామాలలో మొత్తం భూములను సమిష్టి వ్యవసాయ క్షేత్రాలుగా మార్చివేశారు. ఆ భూములలో ప్రజలంతా సమిష్టిగానే శ్రమ చేయడం, పండిన పంటను ప్రతి కుటుంబానికి (జనాభా ప్రాతిపదికన) సమానంగా పంపిణీ చేయడం జరుగుతున్నది. అయితే ఈ గ్రామాలన్నీ, పూర్తిగా ఆదివాసీ గ్రామాలూ, వర్గ, భూ అసమానతలు సాపేక్షికంగా తక్కువ స్థాయిలో ఉన్న గ్రామాలూ, సహకార వ్యవసాయన్ని సమర్థవంతంగా నడపడంలో అనుభవం వున్న గ్రామాలే. మొత్తంగా ఈ ప్రాంతంలో జరుగుతున్న వర్గ పోరాటం వల్ల, ప్రజలలో సమిష్టి, సహకార దృక్పథం అభివృద్ధి అయి, ఒకరినొకరు ఆదుకోవడం పెరిగింది. ఇదే క్రమంలో గతం నుండి సాగు చేస్తున్న గంజాయి పంటపై స్వచ్ఛందంగా నియంత్రణ విధించుకొని, సాగును తగ్గించుకున్నారు. తమ వాడుక అవసరాల కోసం మార్కెట్‌పై ఆధారపడకుండా కూరగాయలు, పండ్ల మొక్కలు పెంచారు. కొన్ని గ్రామాలలో పోడు చేయడాన్ని తగ్గించుకొని, కొండలపై జీడి తోటలు వేయడం ద్వారా ఆదాయాన్ని పెంచుకున్నారు.

పైన చెప్పుకున్నట్లుగా ఒక వైపున భూమి, అధికారం సమస్యలను పరిష్కరించుకుంటునే మరోవైపు విద్యా, వైద్యం, తాగునీరు, సాగునీరు, రవాణా వంటి సమస్యలను 'స్వావలంబనతో కూడిన అభివృద్ధి' నమూనాలో సమిష్టిగా, స్వచ్ఛందంగా పాల్గొంటూ పరిష్కరించుకుంటున్నారు. వైద్యం విషయంలో పార్టీ, స్థానిక యువతను సమీకరించి, వారికి డాక్టర్లుగా ప్రాథమికమైన తర్ఫీదు నివ్వడంతో పాటు, ప్రతి గ్రామంలో మందులు తెచ్చుకోవడానికి ప్రజా సంక్షేమ నిధి నుండి కొంత డబ్బును కేటాయించింది. ప్రజలు కూడా తమ వంతు పాత్రగా, ప్రతి కుటుంబం వద్ద 50 రూ॥ల నుండి 100 రూ॥ల వరకు సేకరించి వాటికి కలిపారు. 8 గ్రామాలలో స్కూల్స్‌ను ఏర్పాటు చేసి, స్థానిక యువతనే ఉపాధ్యాయులుగా నియమించి, వారికి 2 వేల రూపాయల దాకా జీతం ఇస్తున్నారు. 2017, 2018 వేసవి సీజన్లలో అనేక గ్రామాల ప్రజలు, పిల్లల నుండి ముసలివాళ్ళ వరకు మండుటెండలను సైతం లెక్కచేయకుండా, 2 నెలల పాటు శ్రమించి, అనేక గ్రామాలను కలుపుతూ, 50 నుండి 60 కిలోమీటర్ల రోడ్డును నిర్మించారు. ఇంకా ఊటనీటి చెలిమెలకు కుండీలు కట్టి, పైపులు ఏర్పాటు చేయడమూ, సాగు నీటి కోసం చెక్‌డ్యాంలు నిర్మించుకోవడమూ వంటి పనులను సమిష్టిగా చేపట్టారు. ఈ విప్లవ సంస్కరణలు ప్రజల అవసరాలను తీర్చడమే కాకుండా, దోపిడీ పాలక వర్గాలకు వ్యతిరేకంగా రాజ్యాధికారాన్ని సంపాదించుకోవడం ద్వారానే తమ మౌలిక సమస్యలను పరిష్కరించుకోగలమనే నమ్మకాన్ని ఏర్పర్చాయి.

ఇటువంటి పరిస్థితులలోనే రాంగూడ సంఘటన తదనంతరం ఎ.పి. గ్రేహౌండ్స్ పోలీసులు తిరిగి ఒక సంవత్సరం తర్వాత, అంటే నవంబర్ 2017లో పోలీస్ ఇన్ఫార్మర్లు ఇచ్చిన పక్కా సమాచారంతో, పకడ్బందీ పథకంతో నాయకత్వాన్ని నిర్మూలించేందుకు రాత్రికి రాత్రి గొనబెడ గ్రామంపై దాడి చేశారు. ఈ సందర్భంగా వందలాది మంది ప్రజలు జమై, శతృవు కన్నుగప్పి నాయకత్వాన్నీ, దళాన్ని తమ మధ్యలో పెట్టుకుని సురక్షితంగా తప్పించారు. అయితే గ్రేహౌండ్స్ పోలీసులు తిరుగు ప్రయాణంలో ఇద్దరు మిలీషియా సభ్యులను ఎవరికి తెలియకుండా అరెస్టు చేసి, తమ వెంట తీసుకెళ్ళారు. ఈ విషయం అర్థమైన ప్రజలు, అరెస్టు చేసిన మిలీషియా సభ్యులను విడిపించుకునేందుకు, కుంతురిపోదర్ గ్రామ సమీపంలోని ఐ.ఆర్.బి (భారత రిజర్వ్ పోలీస్ బెటాలియన్) క్యాంపుపైకి వేలాది మంది తరలివెళ్ళి, పోలీసులతో ఘర్షణ పడ్డారు. వారికి సప్లైలు ఆపారు. అయితే అరెస్టయిన మిలీషియా సభ్యులను ఆంధ్రా పోలీసులు తీసుకెళ్ళారనీ, అందులో తమ ప్రమేయమేమి లేదని ఐ.ఆర్.బి పోలీసులు చెప్పడంతో, ప్రజలు తాత్కాలికంగా తమ ప్రతిఘటన కార్యక్రమాన్ని విరమించుకున్నారు. మరల 2018 మే, 16న ఎ.పి గ్రేహౌండ్స్ పోలీసులు అత్యంత రహస్యంగా రాత్రిపూట ఏరియాలోకి ప్రవేశించగానే, ఈ విషయాన్ని గమనించిన ప్రజలు వెంటనే పార్టీకి తెలియజేయాలని ప్రయత్నించినప్పుడు, పోలీసులు అడ్డుకున్నారు. అయినప్పటికీ, ప్రజలు, పోలీసు సమాచారాన్ని పార్టీ నాయకత్వానికి అందించడానికి, ఆ రాత్రంతా వివిధ రూపాలలో, ఎడతెగని ప్రయత్నాలు చేశారు. చివరికి ప్రజలు మన బలగాలున్నటువంటి మకాంను చేరుకుంటున్న సమయంలో, పోలీసులు ముందుగానే మన మకాం పరిసరాలకు చేరారు. దీంతో మన పి.ఎల్.జి.ఎ బలగాలే ముందుగా శతృవును చూసి, కాల్పులు ప్రారంభించారు. తర్వాత ఇరువైపుల కాల్పులు జరిగి, మన పి.ఎల్.జి.ఎ బలగాలు ఆడవిలోకి క్షేమంగా తప్పుకున్నాయి. ఇది అర్థమైన ప్రజలు పి.ఎల్.జి.ఎ బలగాలకు ఆహారం అందించేందుకు అంబలి, భోజనం తీసుకొని టీంలు, టీంలుగా అడవిలోకి ప్రవేశించి వారికి అందించారు. ఈ సందర్భంగా కూడా పోలీసులు తమ తిరుగు ప్రయాణంలో అరెస్ట్ చేసి, తీసుకెలుతున్న మిలీషియా సభ్యులను విడిపించుకునేందుకు 3 వేల మంది ప్రజలు జమై, పోలీసులు కాల్పులు జరుపుతున్నప్పటికీ, వాళ్ళపై రాళ్ళతో దాడి చేస్తూ, మిలీషియాను విడిపించుకున్నారు. మరో సందర్భం అక్టోబర్ 2018లో గ్రేహౌండ్స్ పోలీసులు, దళంపై దాడి చేసినప్పుడు

**తరువాయి భాగం 6వ పేజీలో...**

# ఎమ్.ఎల్.ఎ కిడారి సర్వేశ్వరరావు, మాజీ ఎమ్.ఎల్.ఎ సివేరి సోమలను పి.ఎల్.జి.ఎ హతమార్చడంపై ఎ.ఒ.బి, ఎస్.జడ్.సి సభ్యురాలు కామ్రేడ్ రుప్పి ఇచ్చిన ఇంటర్వ్యూ

(సెప్టెంబర్ 23, 2018)

*(ప్రజా ద్రోహులు కిడారి, సోమలపై చర్య జరిగిన తర్వాత, వాస్తవాలను వక్రీకరిస్తూ, పలు పత్రికలలో వచ్చిన వార్తలనూ, దుష్ప్రచారాన్ని పూర్వపక్షం చేసేందుకు ఎ.ఒ.బి.ఎస్.జడ్.సి.ఎమ్ కామ్రేడ్ రుప్పి ప్రింట్ మీడియాకూ, ఎలక్ట్రానిక్ మీడియాకు ఇచ్చిన రాత పూర్వక ఇంటర్వ్యూ పలు దినపత్రికలలోనూ, టి.వి ఛానల్స్‌లోను వచ్చింది)*

**1. ప్రశ్న :– ఎమ్.ఎల్.ఎ కిడారి సర్వేశ్వరరావు, మాజీ ఎమ్.ఎల్.ఎ సివేరి సోమల హత్యకు దారితీసిన కారణాలను తెలియజేయండి?**

**జవాబు :–** పై ఇద్దరినీ ఎందుకు టార్గెట్ చేసి చంపాల్సి వచ్చిందో సెప్టెంబర్ 23వ తేదీన, యాక్షన్ జరిగిన రోజు మా పి.ఎల్.జి.ఎ యూనిట్, ఘటనా స్థలంలో సుమారు గంటసేపు మీటింగ్ నిర్వహించి చాలా స్పష్టంగా ప్రజలకు, తెలుగుదేశం పార్టీ కార్యకర్తలకు తెలియజేసింది. కానీ ప్రభుత్వం, పోలీసులు కుమ్మక్కై కావాలనే విషయం బయటకు రాకుండా చేసి, మా పార్టీ, పి.ఎల్.జి.ఎపై తప్పుడు ప్రచారానికి పూనుకున్నాయి. ఈ సందర్భంగా మీడియా కూడా పై వర్గాలకు వంతపాడుతూ, మాపై దుష్ప్రచారానికి పూనుకొన్నది. పై విషయంలో మా నిరసనను తెలియజేస్తూనే, మరొకమారు మీడియా ద్వారా వారిద్దరూ కొనసాగించిన దుర్మార్గమైన విషయాలను ప్రజలకు తెలియజేయాలని అనుకుంటున్నాం.

2014లో జరిగిన ఎన్నికల్లో సివేరి సోమపై వై.ఎస్.ఆర్.సి.పి తరపున పోటీ చేసి గెలిచిన సర్వేశ్వరరావు కొద్ది రోజుల్లోనే పార్టీని ఫిరాయించి టి.డి.పిలో చేరిపోయాడు. ఈ ఫిరాయింపుల వెనుక కోట్ల రూపాయల డబ్బులు ముట్టాయనే విషయాన్ని ప్రతిపక్షాలు, మీడియా మొత్తం కోడై కూసాయి. చంద్రబాబు వెంటనే సర్వేశ్వరరావుకు పార్టీ విప్ పదవిని కట్టబెట్టి, మిగతా ప్రతిపక్ష సభ్యులను కూడా ఎరవేసే కార్యక్రమాన్ని కొనసాగిస్తూ వచ్చాడు. సివేరి సోమను బుజ్జగించడంలో భాగంగానే, ఆయనకు కూడా పార్టీ పదవిని అట్టిపెట్టి తన గూటి నుండి ఎవరూ బయటకు పోకుండా జాగ్రత్తలు తీసుకున్నాడు. అప్పటి వరకు బద్ధ శత్రువులుగా కొనసాగిన వీరిద్దరూ ఒకే గూటికి చేరి, ప్రజలను దోపిడీ చేయడంలో చేయి చేయి కలిపారు. అరుకు, పాడేరు, విశాఖపట్నం... ఇంకా అనేక ప్రాంతాల్లో రియల్‌ఎస్టేట్ వ్యాపారాన్ని కొనసాగిస్తూ ప్రజల ఆస్తులను స్వాహా చేస్తున్నారు. పాడేరులో ఆర్.టి.సి కాంప్లెక్స్ భూములను సర్వేశ్వరరావు తన అధికార బలంతో స్వాహా చేసినట్టు మీడియా కోడై కూసింది. అరకులో సర్వేశ్వరరావు నిర్మాణం చేసిన బహుళ అంతస్తుల లాడ్జింగ్‌లు అన్నీ, స్థానిక ప్రజల యొక్క భూములను కాజేసి కట్టినవే. ఈ విషయం స్థానిక ప్రజలు అనేక సందర్భాల్లో మీడియా ముందుకు తీసుకువచ్చి తమ నిరసనను తెలియచేశారు. తమ నియోజకవర్గం పరిధిలో జరిగే ప్రతి పనిలోనూ వీరిద్దరికి 10 నుండి 15% డబ్బులు ముడుతున్నాయనేది అందరికీ తెలిసిన విషయమే.

ఈ ప్రాంతంలో వీరిద్దరూ ప్రజా అభీష్టానికి వ్యతిరేకంగా అనేక క్వారీలు నడుపుతున్నారు. గతంలో డుంబ్రిగూడ మండలం, కంద్రుం పంచాయితీలో చైనాక్లే వెలికితీతకు వ్యతిరేకంగా ప్రజలు సివేరి సోమను తన్ని తరిమారు. హుకుంపేట మండలం, గూడ గ్రామంలో సర్వేశ్వరరావు అక్రమంగా కొనసాగిస్తున్న క్వారీని మూసివేయాలని స్థానిక ప్రజలు అనేక నెలలుగా వివిధ పద్ధతుల్లో ఆందోళనలు

---

5వ పేజీ తరువాయి భాగం...

గాయపడి, కదలలేని పరిస్థితులలో వున్న డివిజనల్ కమిటీ సభ్యురాలు కామ్రేడ్ మీనాను పట్టుకొని, అత్యంత పాశవికంగా హత్య చేశారు. అంతేకాకుండా, గ్రామంలో వున్న మిలీషియా సభ్యులను అరెస్టు చేసేందుకు ప్రయత్నిస్తున్నప్పుడు, ప్రజలు తీవ్రంగా ప్రతిఘటించారు. ఈ సందర్భంగా పోలీసులు కాల్పులు జరిపినప్పటికీ, ప్రజలు లెక్కచేయకుండా ప్రతిఘటిస్తూ, 11 మంది గ్రేహౌండ్స్ పోలీసులను గాయపర్చారు. ఈ సంఘటనలన్నింటిలో తిరిగి రాంగూడ సంఘటనలో జరిగినట్లుగా నష్టం జరగకూడదనే పట్టుదలతోనే ప్రజలు అత్యంత బాధ్యాతాయుతంగా, సమరశీలంగా పోరాడారు.

శత్రువు రాంగూడ దాడితోనే ఉద్యమం అంతమైందని భావిస్తే, అది గతం కన్న బలంగా, విస్తృతంగా పురోగమిస్తుండటంతో తన దాడిని మరింత తీవ్రతరం చేశాడు. 2018 మే నుండి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా చేపట్టిన 'సమాధాన్' దాడిలో భాగంగా, కటాఫ్ ఏరియాపై శతృ సాయుధ బలగాల దాడి కేంద్రీకరణ మరింతగా పెరిగింది. కటాఫ్ ఏరియాను అన్ని వైపుల నుండి చుట్టుముట్టే విధంగా, కార్పెట్ సెక్యూరిటీని పెంచుతున్నాడు. రోజురోజుకు తీవ్రతరమవుతున్న ఈ భీషణ ప్రతీఘాతుక దాడిలో, విప్లవోద్యమాన్ని రక్షించుకుంటూ, పురోగమింపజేసేందుకు పార్టీ, నిర్దిష్ట పరిస్థితులకనుగుణంగా తగిన ఎత్తుగడలను రూపొందించి, వాటిని అమలు చేసే రాజకీయ, ఆచరణాత్మక కృషిని చేపడుతున్నది. ●

కొనసాగిస్తున్నా, వాటిని ఏ మాత్రం లెక్క చేయకుండా తమ ప్రజా వ్యతిరేక విధానాలను కొనసాగిస్తూ వచ్చాడు. ఈ విషయంలో బూర్జువా, వామపక్షాలు పార్టీలు తమ స్వార్థ ప్రయోజనాల కోసమైనా కొంత ఆందోళనలు చేసినప్పటికీ, ఎటువంటి ప్రయోజనం పొందలేకపోయారు.

మరోవైపు మన్యం ప్రజల జీవన్మరణ సమస్య అయిన బాక్సైట్ తవ్వకాలకు వ్యతిరేకంగా జరిగిన ఉద్యమంలో ఏనాడు వీరిద్దరు క్రియాశీలకమైన పాత్ర పోషించకపోగా, లోపాయికారిగా దళారీ వర్గాలతో కుమ్మక్కై, బాక్సైట్‌కు అనుకూలమైన వైఖరి కొనసాగిస్తూ వచ్చారు. ఇప్పటికీ, మన్యం ప్రాంతంలో వున్న బాక్సైట్‌ను వివిధ పద్ధతుల్లో తరలించుకుపోవటంలో ప్రజా ప్రతినిధులుగా వీరి పాత్ర క్రియాశీలకంగా వుంది.

ఇకపోతే తమ స్వంత పార్టీలోనే వీళ్ళకు వ్యతిరేకంగా ఆందోళనలు, ధర్నాలు చేస్తున్నారు. 'పడకగదిలో సహకరించేవాళ్ళకే' వాళ్ళ పార్టీ పదవులు ఇస్తారని వాళ్ళ పార్టీ కార్యకర్తలే బహిరంగంగా మాట్లాడుకుంటున్నారు. ఇలా వీళ్ళిద్దరి గురించి చెప్పుకుంటూపోతే పెద్ద చిట్టా తయారవుతుంది.

వీళ్ళిద్దరికి చెందిన ప్రజావ్యతిరేక విధానాలను మా పార్టీ వివిధ సందర్భాల్లో బహిరంగంగానే ప్రకటిస్తూ వస్తున్నది. నూటికి 90% మంది ప్రజలు వీళ్ళ ప్రజా వ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తూ వున్నారు. నిత్యం ప్రజల మధ్య పని చేస్తున్న మా పార్టీకి, ఏ గ్రామానికి పోయినా వీళ్ళ అక్రమాలను మా దృష్టికి తీసుకువస్తున్నారు. ఒక్క మాటలో చెప్పలంటే రాజకీయ నాయకుల ముసుగులో వీళ్ళిద్దరూ ప్రజా శత్రువులుగా, ప్రజా పీడకులుగా, దళారీలుగా తయారైనందునే వీళ్ళను మా పి.ఎల్.జి.ఎ శిక్షించింది. ప్రజా ద్రోహులెవరైనా ప్రజల చేతిలో శిక్షకు గురికాక తప్పదని మరోమారు హెచ్చరిస్తున్నాం.

**2. ప్రశ్న :– కిడారి సర్వేశ్వరరావు, సోమ ఘటనల్ని మావోయిస్టులు తమ ఉనికిని చాటుకోవటం కోసమే చేశారని మాజీ డి.జి.పి మాలకొండయ్య, రాజకీయ కక్షలతోనే వారి హత్యలు జరిగాయని ఎమ్.ఎల్.ఎ వాసుపల్లి గణేష్‌కుమార్, చర్చల కోసం పిలిచి చంపారనీ, ఎటువంటి హెచ్చరికలు లేకుండా చేశారనీ ... ఇలా అనేక వాదనలు వినిపిస్తున్నాయి. ఇందులో నిజానిజాలు ఏమిటి?**

**జవాబు :–** ఇవన్నీ సత్య దూరాలే. ఉనికిని చాటుకోవడానికే చేశారనటంలో అర్థమే లేదు. మావోయిస్టులకు ఒక స్పష్టమైన రాజకీయ లక్ష్యం వుంది. దీర్ఘకాల ప్రజాయుద్ధం ద్వారా భారత నూతన ప్రజాస్వామిక విప్లవాన్ని మొదటగా పరిపూర్తి చేసి, తదుపరి సమాజాన్ని సోషలిజం వైపుకు, అంతిమంగా కమ్యూనిజాన్ని నెలకొల్పే లక్ష్యంతో మా పార్టీ పని చేస్తున్నది. అలాగే మార్క్సిజం–లెనినిజం–మావోయిజం అనే శాస్త్రీయమైన సిద్ధాంతాన్ని మార్గదర్శకంగా తీసుకుని పని చేస్తున్నది. భారతదేశంలో విప్లవకర పార్టీ, పంథా సృష్టికర్తలయిన మహానేతలు కా॥ చారుమజుందార్, కా॥ కన్హయ్‌ఛటర్జీల దిశానిర్దేశంతో ప్రారంభించబడిన మహత్తర చారిత్రక నక్సల్బరీ పోరాటంతో మొదలుపెట్టి, నేటివరకూ గత 5 దశాబ్దాలుగా 'దున్నేవారికే భూమి, పీడిత ప్రజలకే రాజ్యాధికారం' నినాదంతో భారత దోపిడీ పాలకవర్గాలకు వ్యతిరేకంగా అసమాన త్యాగాలతో ఎన్ని ఆటంకాలు, ఒడిదుడుకులు ఎదురైనా, మొక్కవోని దీక్షతో ప్రజాయుద్ధం తన ప్రస్థానం వైపుగా ఒక్కొక్క అడుగువేస్తూ, చిన్న శక్తి నుండి దేశవ్యాపిత పార్టీగానూ, ఒంటరి ప్రాంతాల నుండి విశాల ప్రాంతాలకు అభివృద్ధి చెందింది. ఒక్కమాటలో సోకాల్డ్ భారత పార్లమెంటరీ ప్రజాస్వామ్యానికి ఒక బలమైన ప్రత్యామ్నాయమైన పీడిత ప్రజల రాజ్యాధికార అంగాలను గ్రామ, ఏరియా, జిల్లాస్థాయిల వరకూ నెలకొల్పి స్థావర ప్రాంత నిర్మాణాల దిశగా సాగుతున్నది.

భాతర విప్లవ లక్ష్యాలైన బడా భూస్వాములు, దళారీ నిరంకుశ బూర్జువాలు, వారి యజమానులైన సామ్రాజ్యవాదులకు వ్యతిరేకంగా కార్మిక, కర్షక ఐక్యత పునాదిగా మధ్య తరగతి, జాతీయ బూర్జువా వర్గాలతో ఐక్యసంఘటనగా వర్గపోరాటాన్ని మెట్టుమెట్టుగా పెంపొందించే క్రమంలో అనేక పోరాట రూపాలను పార్టీ అవలంభిస్తున్నది. ఇందులో ప్రజా పోరాటాలకు, ఉద్యమాలకు వ్యతిరేకంగా చివరి వరకూ అడ్డునిలిచి, విప్లవ ప్రతిఘాతుక వైఖరిని కొనసాగించే ప్రజా పీడకుల్ని అంతమొందించటం అనేది కూడా ఒక భాగమే. ఈ కోవలో జరిగినవే పై ఘటనలు. అంతేగానీ, ఈ ఘటనలు ఉనికి కోసం చేసినవి కావు. ఎ.పి పోలీసులు మావైపు నుండి ప్రతిఘటన జరిగినప్పుడల్లా ఉనికికోసం చేసామనే ప్రకటనలివ్వడం గతం నుండి జరుగుతున్నదే. ఇప్పుడు ఈ విషయం కొత్తకాదు.

చర్చల కోసం పిలిచి చంపటం అనేది మా విధానం కాదు. అలాంటి అవసరమూ లేదు. మేము అలా చేస్తే మరెవ్వరూ ఎప్పుడూ పార్టీ పిలుపును విశ్వసించని పరిస్థితి ఏర్పడుతుంది. అది మా పార్టీపై తీవ్ర ప్రతికూల ప్రభావాన్ని వేస్తుంది. కనుక అటువంటి విధానాన్ని మా పార్టీ ఎన్నడూ అవంభించదు.

రాజకీయ కక్షతోనే జరిగాయనీ, దీని వెనుక ప్రత్యర్థుల రాజకీయ కుట్ర వుందనే వాదనలో నిజం లేదు. మావోయిస్టు పార్టీ ప్రత్యర్థులు, ఆశచూపే ప్రలోభాలకు లోబడి హత్యలు చేసే రౌడీల గుంపో, గూండాల గ్యాంగో కాదు. మా పార్టీకి అలాంటి అఘాయిత్యానికి పాల్పడాల్సిన అవసరం ఎంత మాత్రమూ లేదు.

ఎటువంటి హెచ్చరికలు లేకుండా చేశారనటం పచ్చి అబద్ధం. వీరిద్దరి మైనింగ్ మాఫియా కార్యకలాపాలకు వ్యతిరేకంగా ప్రజలు ఎంత పోరాటాలు చేశారో పత్రికలే బోల్డంత రాశాయి. వీరి చావుతో ప్రజలు పండుగ చేసుకున్నరనటం అతిశయోక్తి కాదు. వీరి ఘోర నేర చరిత్రే వీరి చావును డిమాండ్ చేస్తూ, ప్రజల్ని పార్టీకి అన్ని విధాలా సహకరించేలా చేసింది.

**3. ప్రశ్న :– డుంబ్రిగూడ మండల కేంద్రంలో పోలీస్‌స్టేషన్ లేకపోవటం రీత్యాను, గ్రామదర్శిని కార్యక్రమానికి కిడారి, సోమల వెంట పోలీసు ఎస్కార్టులేని కారణంగాను ఈ దుర్ఘటన జరిగిందని అనేక మంది అంటున్నారు. నిజమేనా?**

**జవాబు :–** ఎంత మాత్రం కాదు. అవి వున్నా మా చర్యలకు ఆటంకం కాబోవనేది గతంలోని అనేక ఘటనలు ఋజువు చేస్తున్నాయి. ఛతీస్‌ఘఢ్ రాష్ట్రంలో అడుగడుగునా కార్పెట్ సెక్యూరిటీ వున్న పరిస్థితుల్లో కూడా, కాంగ్రెస్ కాన్వాయ్‌కు రక్షణగా ఒక ప్లటూన్ సంఖ్యలో పోలీసు బలగాలు వున్నా కూడా, మా పి.ఎల్.జి.ఎ పథకం ప్రకారం మాటుగాసి దెబ్బతీసింది. సల్వాజుడుం నాయకుడిగా ప్రభుత్వ అండతో విర్రవీగిన మహేంద్రఖర్మ ఈ విధంగానే మట్టిగరిచాడు. పైగా వాడికి రక్షణగా వచ్చిన పోలీసుల్ని కూడా దెబ్బతీసి, వాళ్ళ ఆయుధాలను సైతం మా పి.ఎల్.జి.ఎ స్వాధీనం చేసుకుంది. కాబట్టి ప్రజా శత్రువులు, ద్రోహులు, పీడకులు తామెన్ని

జాగ్రత్తలు పాటించినా, ఎంత రక్షణ బలగాలను కాపలా వుంచుకున్నా, ఏదో ఒకనాడు ప్రజల చేతుల్లో వాళ్ళ చావు తప్పదు. దేశాన్ని ఏలిన నేతలు ఇందిరాగాంధీ, రాజీవ్‌గాంధీ లాంటి వాళ్ళ దౌర్భగ్యపు చావులు పై విషయాన్నే నొక్కి వక్కాణిస్తున్నాయి.

**4. ప్రశ్న :– బాక్సైట్ తవ్వకాలను చేపట్టబోమని టి.డి.పి ప్రభుత్వం ప్రకటించాక, బాక్సైటు తవ్వకాలకు తాము అనుకూలం కామని కిడారి, సోమలు చెప్పినప్పటికీ ఇలా చేయడం సరైనదేనా?**

**జవాబు :–** కొంగ కళ్ళు మూసుకుని ఒంటికాలిపై జపం చేసిన చందంగా వున్నాయి వీరి ప్రకటనలు. అవన్నీ ఎన్నికల స్టంట్లు తప్ప మరొకటి కాదు. ఎవరిని మభ్య పెట్టాలనుకుంటున్నారు? ఇప్పటికీ టి.డి.పి ప్రభుత్వం ఏ ఎండకాగొడుగు చందంగా అనేకమార్లు మాట మార్చింది. వై.ఎస్.ఆర్.సి.పి జెండాతో 'బాక్సైట్ తవ్వకాలను ప్రాణాలొడ్డి అడ్డుకుంటాం' అంటూ స్టేజిలెక్కి శపథం చేసిన కిడారి, గిడ్డి ఈశ్వరిలు తెలుగుదేశం చంకలోకి ఎందుకు దూరారు? నేడు అదే వై.ఎస్.ఆర్.సి.పి మాకవరపాలెం ఆన్‌రాక్ కర్మాగారాన్ని తెరవాలంటూ, విశాఖ లేటరైట్ ఖనిజాన్ని ఆన్‌రాక్‌కు ఇవ్వాలని మాట్లాడుతుంది. కనుక వాళ్ళ ప్రకటనల్లో చిత్తశుద్ధి లేదు. ఓట్ల పార్టీలన్నీ గోముఖ వ్యాఘ్రాలే.

**5. ప్రశ్న :– మీ వద్ద 200 మంది ప్రజా ప్రతినిధుల, మాజీ మావోయిస్టుల, పోలీసు ఆఫీసర్ల పేర్లు హిట్ లిస్టుల్లో వున్నాయని అంటున్నారు నిజమేనా?**

**జవాబు :–** అటువంటి హిట్‌లిస్టు లేవీ మా వద్ద లేదు. అసలు ఈ హిట్ లిస్టుల సృష్టి, సాంప్రదాయం అంతా పోలీసు అధికారులదే తప్ప, మాకు అటువంటిదేమి లేదు. జీవించే హక్కు కోసం, జల్, జంగల్, జమీన్‌పై ఆదివాసీల, పీడిత ప్రజల హక్కుల కోసం పోరాడుతున్న ప్రజలపై తీవ్రమైన దమనకాండను, నిర్బంధాన్ని ప్రయోగిస్తూ, ప్రజలను సరెండర్ కావాల్సిందిగా, లేదంటే ఎన్‌కౌంటర్ చేస్తామని బెదిరింపులతో ప్రజలకు నోటీసులను, ప్రజల పేర్లతో హిట్‌లిస్టులను ప్రకటిస్తున్నారు. మన్యంలో కాఫీ ప్లాంటేషన్ ఆక్రమణలో పాల్గొన్న వందలాది మంది ప్రజల పేర్లను ప్రకటించి, తీవ్ర చిత్రహింసలకు గురి చేస్తున్నారు. 2017లో నిర్బంధానికి వ్యతిరేకంగా మా పి.ఎల్.జి.ఎ దారకొండ సెల్‌టవర్‌ను దహనం చేసినందుకు సీలేరు, గూడెం పోలీసులు 200 మంది ప్రజలపై హిట్‌లిస్టు ప్రకటించి అనేక మందిని నిర్బంధించి జైళ్ళకు పంపారు. ఇక మా పార్టీ నాయకత్వంపైన, పి.ఎల్.జి.ఎ కామ్రేడ్స్‌పైన తలలకు వెలలు ప్రకటించి, మోస్ట్ వాంటెడ్ పేరుతో పట్టిస్తే లక్షలాది రూపాయల రివార్డులను ప్రకటిస్తున్నది పాలకవర్గాలు, వారికి సేవ చేసే పోలీసులే. పైగా మా పార్టీపై దుష్ప్రచారానికి పూనుకుంటున్నారు. పోలీసుల నిర్బంధాన్ని, దుష్ప్రచారాన్ని తీవ్రంగా ఖండించాల్సిందిగా ప్రజలకూ, ప్రజాస్వామిక వాదులందరికీ ఈ సందర్భంగా మరోమారు విజ్ఞప్తి చేస్తున్నాం.

**6. ప్రశ్న:– అరకు ఎమ్.పి.పి అరుణకుమారి, తన భర్త అప్పాజీలు రక్షణ కల్పించాలని వాళ్ళు ప్రభుత్వాన్ని వేడుకున్నారు. వాళ్ళు మీ టార్గెట్‌లో వున్నారా?**

**జవాబు :–** గుమ్మడికాయ దొంగ అంటే భూజాలు తడుముకున్నట్టుంది వీళ్ళ వ్యవహారం. మా పార్టీకి ఒక స్పష్టమైన రాజకీయ అవగాహన వుంది. పీడిత ప్రజలకు ఎవరైతే వ్యతిరేకులుగా వుంటారో వారినే మేము టార్గెట్ చేస్తాం. అయితే వాళ్ళను కూడా అనేక సందర్భాల్లో హెచ్చరించిన తరువాతనే ప్రజల ఆమోదంతోనే చర్య తీసుకుంటాం తప్ప, తొందరపడి ఎలాంటి నిర్ణయాలు తీసుకోం. పై ఇద్దరూ కూడా ప్రజా వ్యతిరేక కార్యక్రమాలు కొనసాగించని పక్షంలో భయపడాల్సిన అవసరం లేదని తెలియజేస్తున్నాం.

**7. ప్రశ్న :– కిడారి, సోమ కుటుంబ సభ్యులు ఈ ఘటనను తీవ్రంగా ఖండించారు. అలాగే సోమ భార్య ఈ హత్యలకు కారకులను వదలకూడదని, కఠినంగా శిక్షించాలని కోరారు. దీనికి మీరు ఏమనుకుంటున్నారు?**

**జవాబు :–** కుటుంబ సభ్యులను కోల్పోయినవారు ఎవరైనా తీవ్రమైన దుఃఖానికి గురికావడం సహజమే. అయితే కిడారి భార్య పరమేశ్వరి, కుమారులు శ్రావణ్, సందీప్, సివేరి సోమ భార్య బిచ్చావతి, కుమారుడు అబ్రహంలకు ఈ సందర్భంగా మా పార్టీ వైఖరిని తెలియజేయాలనుకుంటున్నాం. మార్క్సిజం– లెనినిజం– మావోయిజం వెలుగులో దీర్ఘకాలిక ప్రజాయుద్ధాన్ని నడుపుతున్న మా పార్టీకి కుల, మత, ప్రాంత, లింగ బేధాలు లేవు. కుటుంబ, స్వంతస్తి, వ్యక్తిగత ప్రయోజనాలు అంతకన్నా లేవు. దోపిడీ వర్గాలకు వ్యతిరేకంగా, పీడిత ప్రజల ప్రయోజనాలకు, ఆకాంక్షలకు అనుగుణంగా పని చేసే మా పార్టీలో పీడిత ప్రజలకు వ్యతిరేకంగా పని చేసే వారెవరినైనా, ఏ స్థానంలో వున్నవారినైనా క్షమించిన చరిత్ర ఇప్పటివరకూ లేదు. ఇక మీదటా వుండదు. గతంలో 25 సం॥ల కాలం ఎ.ఒ.బి.ఎస్.జడ్.సిలో పని చేసి, అరెస్టయి, పోలీసులకు లొంగిపోయి, ద్రోహిగా మారిన ఎస్.జడ్.సి మెంబర్ అనిల్‌కుమార్ అలియాస్ చందును ఎటువంటి శషబిషలు లేకుండా పార్టీ శిక్షించింది. కిడారి, సివేరి సోమలు దోపిడీ పాలకవర్గంలో భాగమయ్యి, ప్రజా వ్యతిరేకులుగా మారినందుకే ప్రజల డిమాండ్ మేరకే మా పార్టీ శిక్షించింది. అంతే గానీ వారి కుటుంబ సభ్యులు, బంధు మిత్రులను పార్టీ వ్యతిరేకించదు. అయితే అదే సందర్భంగా సివేరి సోమ భార్య బిచ్చావతి, డి.జి.పి ఆర్.పి ఠాకూర్ కాళ్ళమీద పడి, ఈ హత్యకు కారకులను వదలవద్దని, శిక్షించాలని కోరడాన్ని మేం వ్యతిరేకిస్తున్నాం. విశాఖ మన్యం పోరాటానికి వీరోచిత చరిత్ర వుంది. అటువంటి మన్యం గడ్డపై జన్మించిన వీరు ఆదివాసీల అస్థిత్వాన్ని, ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే చర్యలకు పాల్పడవద్దని కోరుతున్నాం. ఘటనకు కారకులను శిక్షించమని కోరటం అంటే పీడిత ప్రజల ప్రయోజనాల కోసం పోరాడుతున్న పార్టీపై, సాధారణ ప్రజలపై మరింత నిర్బంధాన్ని అమలు చేయమని కోరటమే. దీనిద్వారా వాకపల్లి, బల్లుగూడ లాంటి ఘటనలు పునరావృతమవుతాయి. ఇదే గనుక జరిగితే మీ కుటుంబాలు పేద ప్రజల నుండి మరింత దూరమై, వారి ఆగ్రహానికి, అసహ్యానికి గురికాక తప్పదు. ఆప్తులను కోల్పోయిన మీ దుఃఖాన్ని పార్టీ అర్థం చేసుకోగలదు. అదే సందర్భంగా మన్యం ఆదివాసీల జీవించే హక్కుకై చేస్తున్న పోరాటాన్ని, పోలీసు నిర్బంధంలో వారి బిడ్డలనూ, ఆప్తులను కోల్పోయిన నేపథ్యంలో వారిదుఃఖాన్ని అర్థం చేసుకుని, వారి ఆకాంక్షలకు అనుగుణంగా నడుచుకోవాలని కోరుతున్నాం.

**8. ప్రశ్న :– గిరిజనుల కోసం పోరాటం మావో నినాదమని అంటూ, ఆదివాసీ నేతలను అన్యాయంగా చంపివేశారని, కిడారి, సోమలను హెచ్చరించి వదిలి వుంటే మావోయిస్టులపై గౌరవం పెరిగి వుండేదని మందకృష్ణమాదిగ విమర్శించారు. దీనిపై మీ స్పందన ఏమిటి?**

**జవాబు :–** ఆదివాసీలు, దళితులు ఈ దేశంలో ప్రధానంగా పీడితులే. అయితే ఆ సమూహాలలో కూడా వర్గాలు ఏర్పడ్డాయి. అంటే ఆదివాసీలలోనూ, దళితులలోను 90%పైగా పీడితులున్నప్పటికీ, 10% పీడకులుగా మారారు. వీరు దేశ సంపదలోనూ,

అధికారంలోను వాటాలు దక్కించుకొని ఈ దేశంలో సామ్రాజ్యవాదానికి ఊడిగం చేసే కులాధారిత, బ్రాహ్మణవాద భ్యూడలిజాన్ని కాపాడేందుకూ, తమ ప్రయోజనాలు నేరవేర్చుకొనేందుకు అగ్రకుల పీడకుల చెంతన చేరారు. ఈ వాస్తవాన్ని కృష్ణమాదిగ మరుగు పరిచి ఆదివాసీలు, దళితులు విభజనలేని ఏకీకృత సమూహాలన్నట్లు అవకాశవాదంతో మాట్లాడుతున్నాడు. వాస్తవంగా కిడారి, సోమలు ఆదివాసీలైనప్పటికీ, పాలకవర్గాల చెంతన చేరి, పీడితులైన ఆదివాసీలకు శతృవులుగా మారారు. అందువలన కృష్ణమాదిగగారు క్షేత్రస్థాయిలో పర్యటించి, ప్రజల నుండి వాస్తవాలను తెలుసుకొని మాట్లాడాల్సిందిగా కోరుతున్నాం.

**9. ప్రశ్న :– "మావోయిస్టులపై ప్రతీకారం తీర్చుకుంటాం" అని పోలీసు అధికారులు సవాల్ విసురుతున్నారు కదా! దీనిని మీరు ఎలా ఎదుర్కోగలమనుకుంటున్నారు?**

**జవాబు :** – కిడారి, సోమల ఘటన జరిగిన వెంటనే అమెరికా పర్యటనలో వున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకే డి.జి.పి పి.ఆర్ ఠాకూర్ హుటా హుటిన విశాఖకు వచ్చి, రేంజి డి.ఐ.జి శ్రీకాంత్, జిల్లా ఎస్.పి రాహుల్‌దేవ్ శర్మ, నగర కమిషనర్ ఆఫ్ పోలీస్ మహేష్ చంద్ర లడ్హా, గ్రేహౌండ్స్, సి.ఆర్.పి.ఎఫ్, ఇంటలీజెన్స్ అధికారులు, ఎస్.ఐ.బి అధికారులతో సమావేశం నిర్వహించాడు. ఘటనను సమీక్షించి, మావోయిస్టుల అణచివేతకు వ్యూహ రచనను చర్చించిన అనంతరం 'మావోయిస్టులపై ప్రతీకారం తీర్చుకుంటాం' అని పత్రికలకు స్టేట్‌మెంట్ ఇచ్చాడు. మా పార్టీ నాయకత్వంలో ఇటువంటి ఘటనలు జరిగినప్పుడల్లా 'సవాల్‌గా తీసుకుంటాం, ప్రతీకారం తీర్చుకోకుండా దోషులను వదలం' అంటూ పోలీసు ఉన్నతాధికారులు నిగ్రహం కోల్పోయి, ఇటువంటి ప్రకటనలు ఇవ్వడం కొత్తేమి కాదు. భారత రాజ్యంగంలోని ప్రజాస్వామిక హక్కుల కోసం, దేశభక్తి గురించి గొప్పగా మాట్లాడే వీరు, అసలు మావోయిస్టు గెరిల్లాల దాడి వెనుకగల కారణాలను లోతుల్లోకి వెళ్ళకుండా, దాడిని సవాల్‌గా తీసుకుంటామని, ప్రతీకారం తీర్చుకుంటామని విర్రవీగటాన్ని ప్రజలు, ప్రజాస్వామికవాదులంతా ముక్తకంఠంతో ఖండించాల్సిన విషయం. ఈ దాడిని సవాల్‌గా తీసుకుని వీరు ఏం చేస్తారు? ఎవరి మీద వీరి ప్రతీకారం తీర్చుకుంటారు? దేశ ప్రజలు, ముఖ్యంగా నేడు ఆదివాసీ ప్రజల సవాలక్ష ప్రశ్నలను, సమస్యలను కాలరాచి దోపిడీ పాలకవర్గాలకు సేవ చేస్తూ, ఆదివాసీ ప్రాంతాల్లో జీవించే హక్కుకై పోరాడుతున్న ప్రజలపైకి అత్యాధునిక ఆయుధాలు, అదనపు బలగాలను, కమ్యూనికేషన్ టవర్లను, అభివృద్ధి పేరుతో రోడ్లను, హెలికాప్టర్లను, డ్రోన్‌లను పంపించి, మరింతగా నిర్బంధాన్ని, అణచివేతను, ప్రజలపై దాడిని తీవ్రతరం చేస్తున్నారు. మన్యంలో ఆదివాసీల అస్థిత్వానికే ప్రమాదంగా మారిన విస్తాపన సమస్య, బాక్సైట్ సమస్య, భూమి సమస్య, నిరుద్యోగ సమస్య, తదితర అనేక సమస్యలతో పరిష్కారం కోసం ప్రజలు తెగించిపోరాడుతున్నారు. కానీ ప్రజల ఓట్లతో అధికారంలోకి వచ్చిన కిడారి, సోమ వంటి ఎమ్.ఎల్.ఎల నుండి మొదలుకుని, ముఖ్యమంత్రి వరకూ సామ్రాజ్యవాదులకు, విదేశీ కంపెనీలకు దళారీలుగా మారి, ఆదివాసీ ప్రజల సంపదను అప్పనంగా దోచుకుంటున్నందుకే ఈ ప్రజా పోరాటాలు బ్రద్దలవుతున్నాయి. ఆదివాసీ నేతలమని చెప్పుకుంటూ, ఆదివాసీలకు ద్రోహం చేస్తున్నందుకు కిడారి, సోమల అక్రమాలకూ, అరాచకాలకు వ్యతిరేకంగా ప్రజలు ఇచ్చిన తీర్పునే మా పార్టీ, పి.ఎల్.జి.ఎ అమలు చేసింది. పీడిత ప్రజల మౌలిక సమస్య పరిష్కారం కానంత వరకూ, ప్రజా పోరాటాన్ని ఆపటం ఎవరితరం కాదు. ప్రతీకారం తీర్చుకుంటామని పోలీసు ఉన్నతాధికారులు ఎన్ని సవాళ్ళను విసిరినా, నిర్బంధం ప్రతిఘటనకు దారి తీస్తుందన్నట్టుగానే, ప్రజలు ప్రజాయుద్ధం ద్వారా తగిన సమాధానం చెబుతారు. దేశ అంతర్గత భద్రతకు మావోయిజం ప్రధాన సమస్య అనీ, ఇది దేశ ప్రజల సమస్య అని పాలకవర్గాలు ఎంతగా ప్రచారం చేస్తున్నప్పటికీ, 'మావోయిజం సమస్య కాదు, అది పీడిత ప్రజల సమస్యలకు ఏకైక సమాధానం, పరిష్కారం' అని ప్రజలు రుజువు చేస్తున్నారు. రాజ్యం పెద్ద ఎత్తున సాయుధ బలగాలను దింపి, ప్రజల మనోస్థైర్యాన్ని దెబ్బతీసేందుకు ఎంత తీవ్రంగా ప్రయత్నించినప్పటికీ, కోట్లాది మంది పీడిత ప్రజలు చేసే యుద్ధం న్యాయమైనదీ, అజేయమైనది. ఏ యుద్ధంలోనైనా ప్రజల క్రియాశీలక పాత్ర నిర్ణయాత్మకమైనది. శతృవుకు ఎంతటి అధునాతన ఆయుధాలు వున్నా, బలమైన సైన్యం వున్నా ప్రజల చేతిలో ఓడిపోక తప్పదని చరిత్ర రుజువు చేసింది. ఇప్పటికే వియత్నం, కొరియా వంటి దేశాలు మొదలుకొని, నేటి మధ్య ప్రాచ్య దేశాల వరకూ, బలమైన శతృవుతో తలపడుతూ సామ్రాజ్యవాదాన్ని కాగితపు పులిగా తేల్చేశారు. భారతదేశంలో మావోయిస్టు ఉద్యమం కూడా న్యాయమైన యుద్ధం, పీడిత ప్రజల యుద్ధం. కనుక పాలక వర్గాలు, రాజ్యం ఎన్ని ప్రగల్భాలు పలికినా, ఎన్ని సవాళ్ళు విసిరినా ప్రజలు ప్రజాయుద్ధం ద్వారా ఓడిస్తారు.

**10. ప్రశ్న :– పోలీసుల వైఫల్యమే ఈ ఘటనకు కారణమంటూ అరకు, డుంబ్రిగూడ స్టేషన్లపై గిరిజనులు దాడికి దిగారు. పరిస్థితిని అదుపు చేయడంలో వైఫల్యం చెందారని డుంబ్రిగూడ ఎస్.ఐపై ప్రభుత్వం సస్పెన్షన్ చర్య తీసుకుంది కదా! దీనిపై మీ స్పందన ఏమిటి?**

**జవాబు :**– అసలు ఈ ఘటన జరిగిన తర్వాత ఆదివాసీ నేతలను చంపటాన్ని ఆదివాసీ ప్రజలు వ్యతిరేకిస్తున్నారంటూ మీడియాలో పెద్ద ఎత్తున ప్రచారం జరుగుతోంది. కానీ వాస్తవంగా మెజారిటీ ఆదివాసీ, పీడిత ప్రజానీకం అంతా వీరి పీడ విరగడవటంతో పండగ చేసుకున్నారు. ఎందుకంటే అంతగా వీరి అక్రమాలు, దోపిడీ దౌర్జన్యాలతో విసిగిపోయి వున్నారు. హుకుంపేట మండలం, గూడ గ్రామస్తులు కిడారికి వ్యతిరేకంగా, మైనింగ్‌ను ఆపాలని ఎందుకు ఆందోళనలు చేశారు? గతంలో కంద్రుం పంచాయితీ ప్రజలంతా సివేరి సోమను ఎందుకు తన్ని తరిమారు? మరి వీరంతా ఆదివాసీ ప్రజలే కదా? ఇవన్నీ పరిశీలించే వారికి ఎవరికైనా వీరు ఎంతటి 'ఆదివాసీ అభిమాన నేతలో' అర్థం చేసుకోగలుగుతారు. అందుకనే వీరు ఆదివాసీ ప్రజల అభిమాన నేతలు కాదు, ఆదివాసీ ప్రజలకు ద్రోహం చేసిన దళారులు. అరుకు, డుంబ్రిగూడ స్టేషన్లపై దాడికి దిగటంలో కిడారి, సోమల కుటుంబీకులు, వారి కార్యకర్తలు, తొత్తులు ప్రధానంగా వున్నారు తప్ప, ఆదివాసీ పీడిత ప్రజలు ఎంత మాత్రమూ కాదు. అయితే స్టేషన్ల ధ్వంసం, దాడి వెనుక మరో కోణం కూడా వుంది. డుంబ్రిగూడ ఎస్.ఐ అమ్మనరావు అరకు సర్కిల్‌లో చేస్తున్న దుర్మార్గాలు, దౌర్జన్యాలు చెప్పనలవి కావు. ఈ ప్రాంతంలోని స్థానిక ప్రజలు వీడి చేతిలో అరాచకాలకు, వేధింపులకు గురికాని వారు ఒక్కరూ లేరంటే అతిశయోక్తి కాదు. వీడొక పెద్ద గంజాయి మాఫియా. అక్రమంగా డబ్బుల సంపాదనకు ఎంతటి దుర్మార్గానికైనా

పాల్పడతాడు. వీడు పై అధికారుల, బడా రాజకీయ నాయకుల అండతోనే ఈ ప్రాంతంలో యదేచ్ఛగా దందాలు నడుపుతూ, ప్రజా పీడకుడిగా తయారయ్యాడు. అసలు ప్రభుత్వం, పోలీసు అధికారులు, అరకు సర్కిల్‌లో వీడు చేస్తున్న అరాచకాలపై విచారణ జరిపిస్తే, చిన్న పిల్లల నుండి ముసలివారి వరకు, ఏ ఒక్కరిని అడిగినా వీడి నేరాల చిట్టా చెబుతారు. అప్పుడు అర్థమవుతుంది స్టేషన్లు ధ్వంసం చేయడం వెనుక అసలు కారణమేమిటనేది. అమ్మనరావుపై ప్రజలు తీవ్ర ఆగ్రహావేశాలతో వున్నారు. వీడి పీడ ఎప్పుడు విరగడ అవుతుందా అని ఎదురు చూస్తున్నారు. అందుకే ఈ ఘటన జరిగిన వెంటనే స్టేషన్లపై దాడికి పాల్పడ్డవారిలో ఆదివాసులెవరైనా వున్నారంటే వారు ఖచ్చితంగా అమ్మనరావు అరాచకాలకు వ్యతిరేకంగా ధ్వంసానికి పాల్పడ్డవారే. వీరు ఈ సందర్భంగా వాడిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారే తప్ప కిడారి, సోమలను చంపినందుకో, మావోయస్టుల చర్యకు వ్యతిరేకంగానో తమ నిరసనను తెలియజేయలేదు. అసలు ప్రభుత్వం ఈ ఘటన తర్వాత అమ్మనరావుపై సస్పెన్షన్ చర్య తీసుకుని, చేతులు దులుపుకోవటం హాస్యాస్పదంగా వుంది. అమ్మనరావు తన విధులను ఎలా నిర్వర్తిస్తున్నాడో ప్రభుత్వ యంత్రాంగానికి, పోలీసు అధికార్లకు ఈ రోజే తెలిసిందా? అమ్మనరావు దందాల్లో వారికి వాటా వుంది కనుకనే, వాడు ప్రజలపై ఎంత అరాచకాలకు పాల్పడుతున్నా, చూసి చూడనట్లు వ్యవహరిస్తూ, ఈ రోజు తప్పనిసరి పరిస్థితుల్లో ప్రజల ఆగ్రహావేశాలకు జడిసి, చర్య తీసుకున్నారు తప్ప, ఆ సస్పెన్షన్ చర్య కేవలం వారంతా ఆడుతున్న నాటకం మాత్రమే. అందులో ఎలాంటి చిత్తశుద్ధి లేదు. ఈ సందర్భంగా ఎస్.ఐ అమ్మనరావు ఇప్పటికైనా తన వైఖరిని మార్చుకోవాలి. లేదంటే ప్రజల ఆగ్రహజ్వాలల్లో మాడి మసైపోక తప్పదని హెచ్చరిస్తున్నాం.

11. ప్రశ్న :- **లివిటిపుట్ గ్రామం వద్ద ఈ ఘటన జరిగటం వలన వారికి దీంతో సంబంధముందని, పోలీసులు గ్రామస్తులను విచారణ పేరుతో తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారు. గ్రామస్తులు మాత్రం మాకేమీ తెలియదంటున్నారు. ఇందులో వాస్తవాలేమిటి?**

**జవాబు:-** నిజానికి లివిటిపుట్ గ్రామస్తులకు, ఈ ఘటనకు ఎటువంటి సంబంధమూ లేదు. జరిగిన ఘటనతో గంగవెర్రులెత్తిన ప్రభుత్వం పోలీసులను గ్రామాలమీదకు ఉసిగొల్పింది. పోలీసు బలగాలు తమ చేతగానితనంతో అమాయక ఆదివాసీ ప్రజలపై తమ ప్రతాపాన్ని చూపిస్తున్నారు. ఒక లివిటిపుట్ గ్రామస్తుల మీద మాత్రమే కాదు. మావోయిస్టుల వేట పేరిట, కుంబింగ్‌ల పేరుతో ఆంధ్ర, ఒడిశా పోలీసు బలగాల సమన్వయంతో, జాయింట్ ఆపరేషన్స్ జరుపుతున్నారు. వందల మంది పోలీసు బలగాలు గ్రామాలపై పడి, ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారు. ప్రజల పంటలను, ఆస్తులను ధ్వంసం చేస్తున్నారు. అనుమానితుల పేరిట, అమాయకులను నిర్బంధించి, చిత్రహింసలు పెడుతున్నారు. రంగేలసింగి పంచాయితీ, కుట్టి గ్రామంలో ఒక మహిళకు పాము కరిచి, హాస్పిటల్‌కు వెలుతుంటే ఆమె ఆదివాసి మహిళలాగ లేదనే అనుమానంతో అదుపులోకి తీసుకుని నిర్బంధించారు. ప్రజలు తమ నిత్య జీవితావసరాల కోసం అడవికే కాదు, గడప దాటి కాలు బయట పెట్టడానికి భయపడుతున్నారు. వ్యవసాయ పనులు చేసుకోలేకపోతున్నారు. ఇక లివిటిపుట్‌లో 20 మంది యువకులను అర్థరాత్రి పోలీసు బలగాలు నిర్బంధించి, తీసుకెళ్ళిపోవటంతో వారి కుటుంబ సభ్యులు, గ్రామస్తులు తీవ్ర భయాందోళనతో ఆ రాత్రంతా బిక్కుబిక్కుమంటూ నిద్రాహారాలు మాని, తీవ్ర ఆవేదనతో మాకు రక్షణ కల్పించండి మహా ప్రభో అని కన్నీళ్ళతో ప్రభుత్వానికి విన్నవించుకుంటున్నా, పట్టించుకున్న నాధుడే లేడు. విచారణ జరపాలంటే అర్థరాత్రుళ్ళు గ్రామలపై దాడులు చేసి, గ్రామస్తులను నిర్బంధించి, ఎత్తుకెళ్ళాలని ఏ రాజ్యాంగంలో వుంది? కూంబింగ్‌ల పేరుతో ఆదివాసీ గ్రామాలపై, ప్రజలపై జరుగుతున్న పోలీసుల నిర్బంధాన్ని మేము తీవ్రంగా ఖండిస్తున్నాం. ప్రజలు, ప్రజాస్వామికవాదులంతా ప్రజలపై రాజ్య నిర్బంధాన్ని తీవ్రంగా ఖండించాల్సిందిగా, నిర్బంధానికి గురవుతున్న ప్రజలకు మద్దతు ఇవ్వాల్సిందిగా కోరుతున్నాం. ఇప్పటికే అరెస్టులు చేసిన వారిని వెంటనే విడుదల చేయాల్సిందిగా, ప్రజలపై దాడులకు పాల్పడుతున్న పోలీసు బలగాలను వెనక్కు తీసుకోవాల్సిందిగా, లేనిచో తగిన మూల్యం చెల్లించక తప్పదని హెచ్చరిస్తున్నాం.

12. ప్రశ్న :- **మావోయిస్టు పార్టీలో రవి, గణేష్‌ల మరణాలతో స్థానిక గిరిజన నాయకత్వం లేకుండా పోయిందని, వీరు వుండివుంటే కిడారి, సోమలాంటి ఆదివాసీ నేతలను చంపకుండా అడ్డుకునేవారని, కిడారి రవికి బంధువని .... ఇలా రకరకాల కథనాలు వినిపిస్తున్నాయి. ఇందులో వాస్తవమెంత?**

**జవాబు:-** పై కథనాలు కుట్రపూరితంగా రచించినవి. ఇలాంటి అసత్య ప్రచారం చేయడం వెనుక దోపిడీ వర్గాల ప్రయోజనం ఉంది. ముందుగా రవి, గణేష్‌ల మరణంతో పార్టీలో స్థానిక గిరిజన నాయకత్వం లేకుండా పోయింది అనడంలో వాస్తవం లేదు. మా పార్టీలో క్రింది నుండి పై వరకూ, అంటే ఎ.సి నుండి కేంద్రకమిటీ వరకూ అన్ని స్థాయిల్లోనూ ఆదివాసీ నాయకత్వం వుంది. ఎందుకంటే భారతదేశంలో ప్రస్తుతం వ్యూహాత్మక ప్రాంతాలుగా వున్న మెజారిటీ ఆదివాసీ ప్రాంతాల్లోనే మా పార్టీ ప్రధానంగా చేస్తున్నది. ఆదివాసీ ప్రాంతాల నుండే ప్రధానంగా రిక్రూట్‌మెంట్ కూడా వుంది. అలా రిక్రూట్ అయిన ఆదివాసీ కామ్రేడ్స్ పార్టీ సిద్ధాతంతో, రాజకీయాలతో మెట్టుమెట్టుగా ఎదుగుతూ, వివిధ స్థాయిల్లో బాధ్యతలు నిర్వహిస్తున్నారు. నాయకత్వంగా ఎదుగుతున్నారు. ఇకపోతే రవి, గణేష్‌లు వుండి వుంటే ఈ ఘటన జరిగేది కాదనీ, తప్పులు దిద్దుకునే అవకాశం ఇచ్చేవారనీ, రవి వున్నంత వరకూ కిడారితో మంచి సంబంధాలు వుండేవనీ, ఆ భరోసాతోనే కిడారి కోరుకొండ, జెర్రెల ప్రాంతంలో బాక్సైట్ ప్రభావిత ప్రాంతాల్లోకి నేరుగా వెళ్ళి, సమావేశాలు జరిపేవారనీ, కేవలం ఈ 2 సం॥ల్లోనే అంటే రవి, గణేష్‌ల మరణం తర్వాతనే సర్వేశ్వరరావుపై పార్టీ వ్యతిరేకత పెరిగిందని రకరకాల ప్రచారం జరుగుతోంది. ఇందులో ఎటువంటి వాస్తవం లేదు. ఇదంతా మా పార్టీలో ఆదివాసీ, ఆదివాసేతరుల మధ్య వైరుధ్యం వుందనీ, ఆదివాసీల పట్ల చిన్న చూపు వుందనీ, అగ్రకుల ఆధిపత్యం వుందని అవకాశం దొరికినప్పుడల్లా దోపిడీ వర్గాలు దుష్ప్రచారం చేయడం దాన్ని మీడియాలో కథలు, కథలుగా రాయడం పరిపాటైంది.

పీడిత ప్రజలను దోపిడీ చేస్తూ, కోట్లకు పడగలెత్తాలనుకునే, రంగులు మార్చే బూర్జువా రాజకీయ పార్టీలలోనే డబ్బులతో ఓట్లను, సీట్లను కొనుక్కోవడం, చిత్తశుద్ధి లేకుండా నోట్ల కట్టల కోసం పార్టీలను, జెండాలను మార్చడం జరుగుతుంటాయి. బూర్జువా సైన్యంలోనే అధికారులకు, క్రింది సాధారణ పోలీసులకు, జవాన్లకు మధ్య నక్కకు, నాగలోకానికున్నంత అంతరాలు వుంటాయి. కానీ

భారతదేశంలో నూతన ప్రజాస్వామిక విప్లవ లక్ష్యంతో పని చేస్తున్న మా మావోయిస్టు పార్టీ నిస్వార్థంగా, అంతర్జాతీయ తత్వంతో, 'ప్రపంచ కార్మికులారా ఏకం కండి' అనే నినాదంతో సమసమాజాన్ని, వర్గ రహిత కమ్యూనిస్టు సమాజాన్ని స్థాపించాలనే గొప్ప లక్ష్యంతో విశాల ప్రజానీకంలో పని చేస్తున్నది. మాది రక్త సంబంధం కన్న, వర్గ సంబంధం గొప్పదని చాటి చెప్పే కార్మికవర్గ పార్టీ. కుల, మత, లింగ, ప్రాంతీయ బేధాలులేని పీడిత ప్రజల ఐక్యతను కోరుకునే విశాల దృక్పథంగల పార్టీ. మా పార్టీకి అంతర్జాతీయ కార్మికవర్గ సిద్ధాంతం ఎమ్.ఎల్.ఎమ్ మార్గదర్శకంగా వుంది. మా పార్టీ కేంద్రీకృత ప్రాజాస్వామ్య నిర్మాణ సూత్రానికి కట్టుబడి పని చేస్తుంది. కనుక పాలక వర్గాలు దుష్ప్రచారం చేస్తున్నట్లు మా పార్టీలో ఆదివాసీలకు, ఆదివాసేతరులకూ; నాయకత్వానికి, క్యాడర్‌కు మధ్య; పై కమిటీకి, క్రింది కమిటీకి మధ్య ఎటువంటి వైరుధ్యాలు, విభేదాలు లేవు. వున్నా వాటిని సైద్ధాంతిక వెలుగులో ప్రజాస్వామ్య పద్ధతిలో పరిష్కరించుకుంటుంది. మా పార్టీలో పునాది వర్గాల నుండి నాయకత్వం ఎదుగుతుండటం వలనే ప్రజాయుద్ధం అజేయంగా ముందుకు సాగుతుంది. కనుక రవి, గణేష్‌లు వుంటే ఇది జరిగి వుండదు అనుకోవడం సరైనది కాదు. వాస్తవంగా గణేష్, రవిల నేతృత్వంలోనే కిడారి, సోమల మాదిరిగా ఆదివాసీ లేబుల్ తగిలించుకొని, ఆదివాసీ ప్రయోజనాలకు విఘాతం కలిగించిన కొద్దిమందిని గతంలో మట్టుపెట్టడం జరిగింది. కిడారి, సోమలకు కూడా హెచ్చరికలు జారీ చేయడం జరిగింది.

**13. ప్రశ్న :– పోలీసులకు – నక్సలైట్లకు మధ్య ఘర్షణల్లో గిరిజనులు నలిగిపోతున్నారనేది బాగా ప్రచారంలో ఉంది కదా! మీరేమనుకుంటున్నారు?**

**జవాబు :–** వాస్తవానికి ఇది పోలీసులకు – నక్సలైట్లకు నడుమ జరుగుతున్న ఘర్షణ కానేకాదు. అర్ధవలస, అర్ధభూస్వామ్య స్థితిలో ఉన్న నేటి భారతదేశంలో, అత్యధిక శాతం ప్రజలు కటిక దారిద్రాన్ని అనుభవిస్తున్నారు. దీనికి ప్రధాన కారణం భారతదేశ సహజ వనరులన్నింటినీ తమ కబ్జాకింద ఉంచుకున్న బడా భూస్వామ్య వర్గం, దళారీ నిరంకుశ బూర్జువా వర్గం అనుసరిస్తున్న దోపిడీ పీడనలే. దీని కారణంగానే శ్రమ జీవులకు వారి శ్రమ ఫలితం దక్కడం లేదు. దోపిడీ పీడనలకు గురి చేయబడుతున్న కార్మికులు, కర్షకులు, మధ్య తరగతి, జాతీయ బూర్జువా వర్గాలు, తమ దైన్యస్థితి నుంచి బాగుపడాలంటే భాతరదేశ సంపదపై అధికారం చేజిక్కించుకోవాల్సిందే. నేటి దోపిడీ పాలకుల అధికారాన్ని కూలదోయాల్సిందే. ఇది ప్రజలందరూ ప్రజాసైన్యంలో సంఘటితం కాబడి, దీర్ఘకాలిక ప్రజాయుద్ధం ద్వారా సాధించాల్సిందే. ఎన్నికలనేవి దోపిడీ పాలనకు మునుగులేతప్ప, ప్రజల జీవితాల్ని మెరుగుపర్చలేవు. కాబట్టి నేడు మావోయిస్టు పార్టీ ఆధ్వర్యంలో పి.ఎల్.జి.ఎ సేన అండదండలతో ప్రజలు ప్రజాయుద్ధాన్ని సాగిస్తున్నారు. మరోవైపు ఈ దేశ రాజ్యాంగయంత్రం, ఇందులో ముఖ్యంగా సాయుధ బలగాలు దోపిడీ పాలకవర్గాలకు సేవ చేస్తున్నాయి. వారి సంపదనూ, అధికారాన్ని కాపాడేందుకు మాత్రమే పని చేస్తున్నాయి. సాయుధ బలగాలలో చేరేవాళ్ళేవరూ దోపిడీ వర్గాల పిల్లలు కారనేది అందరూ ఎరిగినదే. ప్రజలకున్న పేదరికం నుంచి పేద ప్రజలే వాటి రిక్రూట్ వనరుగా ఉన్నారు. ప్రజాయుద్ధంలో వాళ్ళే బలి పశువులు కాబడుతున్నారు. దీన్ని నేడు పోలీసులు, సైనిక బలగాలంతా గ్రహించాలి.

ఇది పోలీసులకు వ్యతిరేకంగా జరుగుతున్న యుద్ధం కాదు. దోపిడీ వర్గాల కాపలాగా కిరాయికి పని చేస్తుండటం కారణంగానే పోలీసులు ఇందులో పావులు అవుతున్నారు. నిజానికి పోలీసుల్ని శతృవులుగా మా పార్టీ, పి.ఎల్.జి.ఎ భావించేటట్లయితే మొన్నటి కిడారి ఆపరేషన్‌లో సర్వేశ్వరరావు, సోమ గార్డులుగా ఉన్న పోలీసుల పట్ల మా వైఖరి అలా వుండేది కాదు.

ఇక ఇందులో గిరిజనులు నలిగిపోతున్నారనేది ప్రభుత్వానుకూల మీడియా చేస్తున్న తప్పుడు ప్రచారం మాత్రమే. నేడు జరుగుతున్న పోరాటాలు, ఉద్యమాలన్ని ప్రజల ఆకాంక్షల, సమస్యల పునాదిగా, వాటి పరిష్కారానికై జరుగుతున్నట్టివే. ఇందులో ప్రజలు స్వచ్ఛందంగానే భాగస్వాములవుతున్నారు. వాస్తవానికి నేడు గ్రామస్థాయి నుంచి కేంద్రకమిటీ వరకూ పార్టీలో పని చేస్తున్నవారంతా పీడిత ప్రజల నుంచి పోరాటాలనడుమ నుంచే అభివృద్ధి చెందుతూ, ప్రజలకు నాయకత్వాన్ని నెరుపుతున్నారు. ఇక ప్రజాసైన్యంలోని అత్యధిక శాతం మంది వ్యవసాయ కూలీ, పేద రైతాంగం, పీడిత ప్రజలైన ఆదివాసీలు, మహిళలు, దళితులు, మైనార్టీలకు చెందినవారే. ఉద్యమాలపై ప్రభుత్వం తీసుకువస్తున్న అణచివేత, నిర్బంధాలను సైతం ప్రజలు ఎంతో దృఢ దీక్షతో ఆఖరికి అన్నిరకాల నిర్బంధాలకు సిద్ధం అవుతూ, ప్రాణాలకు తెగించి మరీ పోరాడుతున్నారు.

ఎందుకంటే తరతరాలుగా ప్రజలు పోరాటాల ద్వారానే తమ సమస్యలకు పరిష్కారాలను పొందుతూ సంఘటితులవుతున్నారు. నేడు రాజ్యాంగంలో పొందుపరచబడిన ప్రజా హక్కులు, ప్రజా అనుకూల చట్టాలు అన్ని ప్రజల వీరోచిత పోరాట ఫలితాలే. నేడు ప్రజాయుద్ధం బలంగా సాగుతున్న దండకారణ్యం, బీహార్, ఝార్ఖండ్, ఎ.ఒ.బిలాంటి ప్రాంతాల్లో ప్రజలు అత్యంత చైతన్యవంతులై, స్వావలంబన దిశగా విప్లవ రాజ్యాధికార అంగాల్ని స్థాపించుకొని (ఆర్.పి.సిలు) 'తమ ఊర్లో తమ రాజ్యాన్ని' సాగిస్తున్నారు.

కాబట్టి జరుగుతున్న ప్రజాయుద్ధంలో గిరిజనులు నలిగిపోతున్నారనేది పచ్చి అవాస్తవం. దానికి మారుగా ప్రజలే ప్రజాయుద్ధానికి తమ సర్వస్వాన్ని ధారపోస్తూ సాగిస్తున్నారనేది ఒక వాస్తవం. ఇంకా నిర్దిష్టంగా చెప్పాలంటే ఈ యుద్ధం అభివృద్ధి నిరోధక దోపిడీ ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య జరుగుతున్న యుద్ధం మాత్రమే.

**14. ప్రశ్న :– ఆపరేషన్ కిడారి పూర్వపరాలపై పార్టీ ప్రజలకిచ్చే సందేశం ఏమిటి?**

**జవాబు :–** నేడు కేంద్రంలో అధికారాన్ని చలాయిస్తున్న బి.జె.పి పార్టీగానీ, రాష్ట్రంలో అధికారాన్ని నడుపుతున్న టి.డి.పి పార్టీ గానీ సామ్రాజ్యవాదులకు నెంబర్-1 దళారీలుగా ఉంటూ, భాతర ప్రజల సంపదను కొల్లగొట్టుకుపోయేలా రాజకీయ, ఆర్థిక విధానాలను అవలంబిస్తున్నాయి. వీటికి వ్యతిరేకంగా నేడు ప్రజల్లో ఉద్యమించని సెక్షన్ లేదు. ఉద్యమిస్తున్న ప్రజల్ని రాజ్యం తమ కిరాయి సాయుధ బలగాలపై ఆధారపడుతూ, ఉక్కుపాదంతో అణచివేయ ప్రయత్నిస్తున్నాయి. మరింత ఫాసిస్టు పద్ధతులకు పూనుకుంటున్నాయి.

నేడున్న రాజకీయ వాతావరణంలో టి.డి.పి, బి.జె.పి పార్టీలను అన్ని విధాలుగా టార్గెట్ చేయాలని ఎ.ఒ.బి.ఎస్.జడ్.సి సమావేశం

**తరువాయి భాగం 23వ పేజీలో...**

# "పార్లమెంటరీ పంథా" పై విమర్శ

***కామ్రేడ్ మావో రాసిన 'కార్మికవర్గ విప్లవం – కృశ్చేవ్ రివిజనిజం' వ్యాసం నుండి "పార్లమెంటరీ పంథా" అనే ఈ భాగాన్ని తీసి ఇక్కడ ముద్రించాము. ఇది "పార్లమెంటరీ ప్రజాస్వామ్యం"పై సరైన విప్లవకర అవగాహనను ఏర్పర్చుకొనేందుకు దోహదపడ్తుంది. –ప్రధానంగా భారతదేశంలో మరో పర్యాయం పార్లమెంటరీ, అసెంబ్లీ (ఆంధ్రప్రదేశ్, ఒడిశా, అరుణాచల్ ప్రదేశ్, సిక్కిం) ఎన్నికలు జరగబోతున్న నేటి తరుణంలో ఈ వ్యాసం ప్రజలను "పార్లమెంటరీ ప్రజాస్వామ్యా"నికి వ్యతిరేకంగా విప్లవంలోకి సమీకృతుల్ని చేసేందుకు ఎంతగానో దోహదపడ్తుంది.***

సెకండ్ ఇంటర్నేషల్‌కు చెందిన రివిజనిస్టులు ప్రచారంలో పెట్టిన "పార్లమెంటరీ పంథా"ను లెనిన్ బట్టబయలు చేశాడు. ఆ పంథా పూర్తిగా పనికిరాదని తేలిపోయింది. కానీ, కృశ్చేవ్ దృష్టిలో రెండవ ప్రపంచ యుద్ధానంతరం పార్లమెంటరీ పంథాకు అకస్మాకత్తుగా ఆచరణయుతమైన విలువ వచ్చింది.

ఇది నిజమా? ఎంతమాత్రము కాదు.

బూర్జువా రాజ్యాంగయంత్రంలో ముఖ్యమైన అంగం సాయుధ బలాలేననీ, పార్లమెంటు కాదని రెండవ ప్రపంచ యుద్ధం తర్వాత జరిగిన ఘటనలు కూడా స్పష్టపరిచాయి. అది (పార్లమెంటు–సం॥) బూర్జువావర్గ పరిపాలనకు మేలిముసుగు మాత్రమే. అందువల్ల పార్లమెంటరీ వ్యవస్థను నిలబెట్టడమా లేక రద్దుచేయడమా, పార్లమెంటుకు ఎక్కువ అధికారాలివ్వడమా లేక తక్కువ అధికారాలివ్వడమా, ఏ రకమైన ఎన్నికల పద్ధతిని అనుసరించాలి– అనే సమస్యల మధ్య దేన్ని బూర్జువావర్గం ఎన్నుకుంటుందనేదాన్ని ఆ వర్గ పరిపాలనా అవసరాలు, ప్రయోజనాలు నిర్ణయించుతాయి. సైనిక–నిరంకుశాధికార యంత్రాంగాన్ని బూర్జువావర్గం కంట్రోలు చేస్తున్నంతకాలమూ కార్మికవర్గం "పార్లమెంటులో స్థిరమైన మెజారిటీ" సంపాదించలేకుండానైనా పోతుంది లేదా ఆ "స్థిరమైన మెజారిటీ'' ఆధారపడ వీలులేనిదిగానైనా తయారౌతుంది. పార్లమెంటరీ పంథా ద్వారా సోషలిజాన్ని సాధించడం పూర్తిగా అసంభవం. అవి కేవలం మోసపు మాటలు.

పెట్టుబడిదారీ దేశాల్లోని కమ్యూనిస్టుపార్టీల్లో దాదాపు సగంపైన నిషేదం ఉంది. ఈ పార్టీలు చట్టబద్ధమైనవిగా ఆయా దేశాల ప్రభుత్వాలు గుర్తించడం లేదు గనుక అవి పార్లమెంటులో మెజారిటీ సంపాదించే ప్రశ్నే ఉత్పన్నం కాదు.

ఉదాహరణకు స్పెయిన్. అక్కడ పార్టీ క్రూర నిర్బంధ విధానాన్ని ఎదుర్కొంటోంది. కనుక ఎన్నికల్లో పోటీ చేసే అవకాశమే ఆ పార్టీకి లేదు. అలాంటి పరిస్థితుల్లో ఇబ్రరూరీవంటి స్పెయిన్ కమ్యూనిస్టు నాయకులు స్పెయిన్‌లో "శాంతియుత పరివర్తన" సాధ్యం అంటూ కృశ్చేవ్‌ను అనుసరించడం చాలా విషాదకరమైంది.

పెట్టుబడిదారీ దేశాల్లోని ఎన్నికల పద్ధతులు అనేక అక్రమ ఆంక్షలతో కూడుకుని వున్నాయి. అందువల్ల చట్టబద్ధంకాని పార్టీలూ, ఎన్నికల్లో పాల్గొనగలిగే పార్టీలు బూర్జువా చట్టాల కింద మెజారిటీ ఓట్లు తెచ్చుకొనడం చాలా కష్టం. మెజారిటీ ఓట్లు ఒకవేళ తెచ్చుకొన్నప్పటికీ, ఎన్నికల రూల్సును మార్చడం ద్వారాగానీ, తదితర పద్ధతుల ద్వారాగానీ, కమ్యూనిస్టుపార్టీకి పార్లమెంటులో మెజారిటీ సీట్లు రాకుండా బూర్జువావర్గం చేయగలుగుతుంది.

ఉదాహరణకు రెండవ ప్రపంచ యుద్ధానంతరం ఫ్రెంచి గుత్తపెట్టుబడిదార్లు ఎన్నికల చట్టాన్ని రెండుసార్లు మార్చారు. ప్రతి మార్పు ఫలితంగా కమ్యూనిస్టుపార్టీకి పార్లమెంటులో ఉండే సీట్ల సంఖ్య పడిపోతూ వచ్చింది. 1946లో జరిగిన పార్లమెంటు ఎన్నికలలో ఫ్రెంచ్ కమ్యూనిస్టుపార్టీ 182 సీట్లను గెలుచుకొన్నది. 1951లో మళ్ళీ ఎన్నికలు జరిగాయి. ఈ సారి ఎన్నికలు చట్టాన్ని గుత్తపెట్టుబడిదార్లు మార్చారు. ఫలితంగా కమ్యూనిస్టుపార్టీ సీట్లసంఖ్య పెద్దఎత్తున పడిపోయింది. 182 నుండి 103కు వచ్చాయి. అంటే 79 సీట్లు పోయాయి. 1956 ఎన్నికలలో ఫ్రెంచి కమ్యూనిస్టుపార్టీ 140 సీట్లు గెల్చుకొన్నది. కాని, 1958 పార్లమెంటు ఎన్నికలకు ముందు ఎన్నికల చట్టాన్ని గుత్తపెట్టుబడిదార్లు మళ్ళీ మార్చారు. దీని ఫలితంగా కమ్యూనిస్టుపార్టీ సీట్లు దారుణంగా పడిపోయాయి. 10 సీట్లు మాత్రమే గెల్చుకోగలిగింది. అంటే 140 సీట్లు పోయాయి.

కొన్ని పరిస్థితులలో పార్లమెంటులో మెజారిటీ స్థానాలు సంపాదించుకొన్నప్పటికీ, ఎన్నికల విజయంద్వారా ప్రభుత్వంలో పాల్గొన్నప్పటికీ దానివల్ల పార్లమెంటు యొక్క, లేక ప్రభుత్వం యొక్క బూర్జువా స్వభావం మారదు. అది పాత రాజ్యాంగయంత్రాన్ని ధ్వంసం చేసినట్లూ కాదు. నూతన రాజ్యాంగయంత్రాన్ని స్థాపించినట్లూ కాదు. బూర్జవా పార్లమెంట్లు ప్రభుత్వాల మీద ఆధారపడడం ద్వారా సమూలమైన సామాజిక మార్పులు తీసుకురావడం అసంభవం. రాజ్యాంగయంత్రం చేతిలో పెట్టుకొని ఉన్న అభివృద్ధి నిరోధక బూర్జువా వర్గం ఎన్నికలనే పూర్తిగా రద్దు చేయగలదు. పార్లమెంటును రద్దు చేయగలదు. ప్రభుత్వం నుండి కమ్యూనిస్టులను తొలగించివేయగలదు. కమ్యూనిస్టుపార్టీని నిషేధించగలదు. ప్రజలనూ, అభ్యుదయ శక్తులనూ అణచివేయడానికి క్రూర నిర్బంధాన్ని ప్రయోగించగలదు.

ఉదాహరణకు 1946లో చిలీ కమ్యూనిస్టుపార్టీ బూర్జువావర్గ రాడికల్ పార్టీని బలపరచి ఎన్నికల్లో విజయం సాధించడం జరిగింది. కమ్యూనిస్టులతో కూడిన మిశ్రమ మంత్రివర్గం ఏర్పాటైంది. ఆ

రోజుల్లో చిలీ కమ్యూనిస్టుపార్టీ నాయకులు బూర్జువావర్గం కంట్రోలు కిందనున్న ఆ ప్రభుత్వాన్ని "ప్రజా ప్రజాతంత్ర ప్రభుత్వం" అని వర్ణించేంతవరకూ వెళ్ళారు. కాని, సంవత్సరం తిరక్కముందే కమ్యూనిస్టులు ప్రభుత్వం నుండి బయటకి వెళ్ళిపోయేలా వత్తిడి తెచ్చింది. కమ్యూనిస్టులను మూకుమ్మడిగా అరెస్టులు చేసింది. 1948 కల్లా పార్టీనే నిషేధించింది.

కార్మికవర్గపార్టీ దిగజారిపోయి, బూర్జువార్గ తోకగా తయారైతే అప్పుడు ఆ పార్టీకి పార్లమెంటులో మెజారిటీ రావడానికీ, ప్రభుత్వంలో పాల్గొనడానికి బూర్జువావర్గం అనుమతించవచ్చును. కొన్ని దేశాలలోని బూర్జువా సోషల్ డెమొక్రాటిక్ పార్టీల పరిస్థితి ఇదే. ఇది బూర్జువావర్గ నియంతృత్వాన్ని పరిరక్షించడానికీ, బలపరచడానికీ మాత్రమే తోడ్పడుతుంది. దోపిడీ, నిర్బంధాలకు గురౌతున్న కార్మికవర్గం యొక్క పరిస్థితిని ఇదెంత మాత్రమూ మార్చదు, మార్చజాలదు. ఈ వాస్తవాలన్నీ పార్లమెంటరీ పంథాయొక్క దివాళాకోరు తనాన్ని మరింత చక్కగా ధృవపరుస్తున్నాయి.

కమ్యూనిస్టుపార్టీ నాయకులేగనుక పార్లమెంటరీ పంథాపైన విశ్వాసం పెట్టి, నయంచేయవీల్లేని పార్లమెంటరీ జబ్బుకే గురైనట్లయితే వారికిక భవిష్యత్తు ఉండకపోవడమేగాక, రివిజనిస్టు ఊబిలో వారు దిగిపోతారనేది ఖాయమనీ, కార్మికవర్గ లక్ష్యమైన విప్లవాన్ని వారు వమ్ముచేసి తీరుతారనీ రెండో ప్రపంచ యుద్ధానంతరం జరిగిన ఘటనలు రుజువు చేస్తున్నాయి.

బూర్జువా పార్లమెంట్ల యెడల సరైన దృక్పథమేది అనే సమస్యపైన మార్క్సిస్టు-లెనినిస్టులకూ, అవకాశవాద, రివిజనిస్టులకూ మధ్య ప్రాథమికమైన భేదాభిప్రాయాలున్నాయి.

కొన్ని పరిస్థితులలో కార్మికవర్గ పార్టీలు పార్లమెంటు పోరాటంలో పాల్గొనాలి. బూర్జువావర్గ అభివృద్ధి నిరోధక స్వభావాన్ని బట్టబయలు చేయడానికి పార్లమెంటరీ వేదికను ఉపయోగించుకోవాలి. ప్రజలను చైతన్యవంతులను చేసి, విప్లవకర శక్తిని వారు పెంపు చేసుకొనేట్లు కృషి చేయాలి. అవసరమైనప్పుడు ఈ చట్టబద్ధమైన పోరాట రూపాన్ని వినియోగించుకో నిరాకరించడం తప్పు. అయితే, కార్మికవర్గ విప్లవం స్థానంలో పార్లమెంటరీ పోరాటాన్ని చొప్పించే స్థితికి కార్మికవర్గపార్టీ దిగజారరాదు. అలాగే పార్లమెంటరీ పంథా ద్వారానే సోషలిస్టు పరివర్తనను సాధించవచ్చుననే భ్రమలో పడిపోరాదు. ఎల్లప్పుడూ ప్రజాపోరాటాలపైనే కేంద్రీకరించాలి.

**లెనిన్ ఇలా అన్నారు–**

"బూర్జువా పార్లమెంటరిజంలోనూ, పార్లమెంటులోని పార్టీల మధ్య జరిగే పోరాటంలోనూ, విప్లవకర కార్మికవర్గ పార్టీ పాల్గొనాలి. ఆ విధంగా ఎన్నికల సమయంలో ప్రజలను చైతన్యవంతులను చేసే అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. కాని, వర్గపోరాటాన్ని పార్లమెంటరీ పోరాటం వరకే పరిమితం చేస్తే, పార్లమెంటరీ పద్ధతే అత్యున్నతమైనదనిగానీ, నిర్ణయాత్మకమైనదనిగానీ, భావించితే, మిగతా పోరాట రూపాలన్నీ పార్లమెంటరీ పద్ధతికి లోబడి ఉండాలని తలంచితే అది బూర్జువావర్గ పక్షానికి వెళ్ళిపోయినట్లే, కార్మికవర్గానికి వ్యతిరేకంగా వెళ్ళిపోయినట్లే.

పార్లమెంటు నీడ వెంటబడిపోతూ, రాజ్యాధికారాన్ని స్వాధీనపరచుకొనే విప్లవ కర్తవ్యాన్ని వదిలి వేసినందుకు సెకండ్ ఇంటర్నేషనల్ రివిజనిస్టులను లెనిన్ నిరసించాడు. వారు కార్మికవర్గ పార్టీని ఎన్నికల పార్టీగానూ, పార్లమెంటరీ పార్టీగానూ, బూర్జువావర్గ తోకగానూ, బూర్జువావర్గ నియంతృత్వానికి ఊడిగం చేసే సాధనంగానూ మార్చి వేశారు. పార్లమెంటరీ పంథాను ప్రచారం చేస్తున్న కృశ్చేవ్, ఆయన తరహా మనుషులను సెకండ్ ఇంటర్నేషనల్ రివిజనిస్టులకు పట్టిన గతే పడుతుంది.

కార్మికవర్గ విప్లవం సమస్యను పరిశీలించుతూ సోవియట్ పార్టీ కేంద్రకమిటీ బహిరంగలేఖ ఒక అబద్ధాల పుట్టను తయారు చేసింది. విప్లవకర పరిస్థితులు లేకపోయినా, "పెట్టుబడిదారీ దేశాల్లో తక్షణమే కార్మికవర్గ విప్లవ నినాదమివ్వాల"ని చైనాపార్టీ అనుకొంటున్నదని సోవియట్ పార్టీలేఖ ఆరోపించుతున్నది. చైనాపార్టీ "ప్రజాతంత్ర హక్కులు, కార్మికవర్గ ప్రజలు కీలకమైన కోర్కెల కొరకై సాగే పోరాటాన్ని నిరాకరించుతున్న"దని ప్రచారం చేస్తున్నారు. (బహిరంగ లేఖ.) సాయుధ పోరాటం "అఖండమైనద"ని చైనాపార్టీ చెబుతున్నదనీ తదితర ప్రచారాలను చేస్తున్నారు. చైనా కమ్యూనిస్టు పార్టీకి "అతివాద అవకాశవాదం" "అతివాద దుందుడుకువాదం", "ట్రాట్స్కీయిజం" మొదలైన ముద్రలు తగిలిస్తున్నారు.

## "అతివాద అవకాశవాదానికి వ్యతిరేకత" అనే సాకు

కానీ వాస్తవమేమంటే, విప్లవాన్ని వ్యతిరేకించే, నిరాకరించే తమ రివిజనిస్టు పంథాను కప్పిపుచ్చుకొనడానికే సోవియట్ నాయకులు ఈ హంగామా అంతా చేస్తున్నారు. "అతివాద అవకాశవాదం" అని పేరుబెట్టి వారు వ్యతిరేకిస్తున్నది మార్క్సిస్టు-లెనినిస్టు విప్లవపంథానే తప్ప మరొక దానిని కాదు.

అనుకున్నప్పుడే విప్లవాన్ని లేవదీయడం సాధ్యం కాదు. విప్లవకరమైన భౌతిక పరిస్థితి లేకపోతే విప్లవం అసంభవమని మేము ఎల్లప్పుడూ చెబుతూనే వస్తున్నాము. విప్లవం రావడం భౌతిక పరిస్థితులు ఏర్పడడం పైనేగాక, విప్లవాన్ని పూర్తి చేయవలసిన కర్తవ్యాలు, అందుకై సన్నద్ధంగా ఉండి అందుకై సన్నాహాలు చేసుకొని ఉండడంగూడా అవసరం.

భౌతిక పరిస్థితులూ, విప్లవకర శక్తులు సంసిద్ధత ఈ రెంటినీ సరిగా అంచనా వేయకుండా పరిస్థితులు పరిపక్వం కాకమునుపే త్వరపడి కార్మికవర్గ పార్టీ విప్లవాన్ని ప్రారంభించితే అది "అతివాద" దుందుడుకుతనమౌతుంది. పరిస్థితులు పరిపక్వం అయ్యేనాటికి ముందుగానే విప్లవానికి అవసరమైన సన్నాహాలు చేసుకొనడానికి చురుకుగా కృషి చేయకపోతే, విప్లవకర పరిస్థితి ఏర్పడి, పరిస్థితులు పరిపక్వదశకు చేరుకొన్నప్పుడు కార్మికవర్గ పార్టీ విప్లవాన్ని నడిపి, రాజ్యాధికారాన్ని స్వాధీనం చేసుకొనకపోతే మితవాద అవకాశవాదం లేక రివిజనిజం అవుతుంది.

రాజ్యాధికారాన్ని స్వాధీనపరచుకొనే సమయం ఆసన్నమయ్యే వరకూ కార్మికకర్గపార్టీ చేయవలసిన అత్యంత ప్రాథమికమైన, ప్రాముఖ్యమైన కర్తవ్యమేమిటంటే కష్టతరమైనదే అయినప్పటికీ విప్లవశక్తిని సమకూర్చుకొనడంపై కేంద్రీకరించడం, దైనందిన పోరాటాల్లో నుండి వచ్చిన నాయకత్వం విప్లవకర శక్తిని నిర్మించుకొనడం. పరిస్థితులు పరిపక్వమైనప్పుడు రాజ్యాధికారాన్ని స్వాధీనం చేసుకొనేందుకు సన్నాహాలు చేయడం తన ప్రధాన లక్ష్యంగా ఎంచుకోవాలి. కార్మికవర్గం యొక్క, ప్రజల యొక్క రాజకీయ చైతన్యాన్ని పెంచడానికి, తన సొంతవర్గ శక్తులకు తర్ఫీదు

ఇచ్చుకొనడానికీ, తన పోరాట శక్తిని పదునుబెట్టుకొనడానికీ సిద్ధాంత రాజకీయ, నిర్మాణ, సైనికరంగాల్లో విప్లవానికై సన్నద్ధం చేయడానికీ కార్మికవర్గ పార్టీ దైనందిన పోరాట రూపాలను పెక్కింటిని ఉపయోగించుకోవాలి. ఈ పద్ధతి అనుసరించడం ద్వారానే విప్లవ పరిస్థితులు పరిపక్వమైనప్పుడు రాజ్యాధికారాన్ని స్వాధీనపరచుకొనే అవకాశాన్ని జారవిడుచుకోకుండా ఉండగలుగుతుంది. లేకపోతే విప్లవకర భౌతిక పరిస్థితులు ఏర్పడినప్పటికీ, విప్లవాన్ని జయప్రదం చేసే అవకాశాన్ని పార్టీ జారవిడుచుకొంటుంది.

విప్లవకర పరిస్థితి ఏర్పడకముందే విప్లవానికై ప్రయత్నించరాదన్న విషయాన్ని సోవియట్ పార్టీ నాయకులు విసుగు, విరామం లేకుండా చెబుతున్నారు. గానీ, విప్లవకర పరిస్థితి ఏర్పడకముందు కార్మికవర్గపార్టీ దైనందిన విప్లవకర పోరాటాలను ఎలా నడపాలి. విప్లవశక్తిని ఎలా సమీకరించుకోవాలి అన్న ప్రశ్నను వారు దాటవేస్తున్నారు. విప్లవకర పరిస్థితి లేదు అనే సాకు తీసుకొని, వాస్తవంలో వారు విప్లవశక్తిని సమకూర్చుకొనే కర్తవ్యాన్ని వదులుకుంటున్నారు. విప్లవానికి సన్నాహాలు చేయడమే మానుకొంటున్నారు. విప్లవకర పరిస్థితి అనే సమస్యపైన ద్రోహి కాట్స్కీ వైఖరిని గూర్చి లెనిన్ చక్కగా వర్ణించాడు. లెనిన్ ఇలా అన్నాడు. విప్లవకర సంక్షోభ పరిస్థితే ఏర్పడితే అప్పుడు అతడు కూడా విప్లవకారుణ్ణే అంటాడు. కాని, అలాంటప్పుడు ప్రతిద్రోహి తాను విప్లవకారుణ్ణేనని ప్రకటించుకొంటాడు. అది మనం గమనించాలి. ఆ పరిస్థితి రాకపోతే కాట్స్కీ విప్లవానికే ఎదురు తిరుగుతాడు". లెనిన్ చెప్పిన విధంగా కాట్స్కీ ఒక (ఫిలిస్టయిన్) సంస్కారహీనుడికీ, మార్క్సిస్టు విప్లవకారుడికీ తేడా ఏమంటే "కార్మికవర్గాన్ని, శ్రామిక ప్రజలనూ, పీడిత ప్రజలనూ విప్లవానికై సన్నద్ధం చేసే" ధైర్యం మార్క్సిస్టుకుంటుంది. కృశ్చేవ్, ఆయన అనుయాయులు లెనిన్ నిరసించిన కాట్స్కీవంటి ఫిలిస్టయిన్లను పోలివున్నారో లేదో ప్రజలే తీర్పు చెప్పవలసి ఉంటుంది. గుత్త పెట్టుబడికి వ్యతిరేకంగానూ, ప్రజాతంత్ర హక్కులు పరిరక్షించుకొనడానికీ, జీవన పరిస్థితులు మెరుగుపరచుకొనడానికి, సామ్రాజ్యవాదుల విస్తరణ, యుద్ధ సన్నాహాలను వ్యతిరేకించడానికి, ప్రపంచ శాంతిని పరిరక్షించడానికి, పీడిత జాతుల విప్లవ పోరాటాలను బలపరచడానికీ జరిగే పోరాటాల్లో పెట్టుబడిదారీ దేశాల్లోని కార్మికవర్గానికి, శ్రామిక ప్రజలకూ ఆ దేశాల్లోని కార్మికవర్గపార్టీలు చురుకుగా నాయకత్వం వహించాలని మేము ఎల్లప్పుడూ భావిస్తున్నాము.

అమెరికా సామ్రాజ్యవాదుల బెదిరింపులకూ, పెత్తనానికీ, జోక్యానికీ, దురాక్రమణలకు గురౌతున్న పెట్టుబడిదారీ దేశాల్లోని కార్మికవర్గ పార్టీలు ఆ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా జాతీయ ప్రతిఘటనా పతాకాన్ని ఎగురవేయాలి. అమెరికా సామ్రాజ్యవాదంపైన ప్రధానంగా పోరాటాన్ని కేంద్రీకరించాలి. అలాగే జాతీయ ప్రయోజనాలకే ద్రోహం చేస్తున్న దేశీయ శక్తులైన గుత్తపెట్టుబడిదారులు, ఇతర అభివృద్ధి నిరోధకులకు వ్యతిరేకంగా గూడా ప్రధాన పోరాటం సాగించాలి. ఐక్యపరచగలిగిన అన్ని శక్తులనూ ఐక్యపరచి, అమెరికా సామ్రాజ్యవాదానికి, దాని గులాములకూ వ్యతిరేకంగా ఐక్యసంఘటనను ఏర్పరచాలి.

ఇటీవలి కాలంలో అనేక పెట్టుబడిదారీ దేశాల్లోని కార్మికవర్గమూ, శ్రామిక ప్రజలూ విశాలమైన ప్రజా పోరాటాలు సాగిస్తున్నారు. అవి దేశంలోని గుత్తపెట్టుబడిదారులనూ, ఇతర అభివృద్ధి నిరోధక శక్తులను దెబ్బతీయడమేగాక, ఆసియా, ఆఫ్రికా, దక్షిణ అమెరికా ప్రజల విప్లవ పోరాటాలకు గట్టి ఊతం ఇస్తున్నాయి. సోషలిస్టు శిబిరానికి బాగా సహాయపడుతున్నాయి. ఈ తోడ్పాటును మేము ఎల్లప్పుడూ మనస్ఫూర్తిగా హర్షించుతున్నాము.

కమ్యూనిస్టులు తక్షణ పోరాటాలను చురుకుగా నడుపుతూనే సమయం వచ్చినప్పుడు విప్లవ విజయాన్ని సాధించేందుకై ఆ పోరాటాలను దీర్ఘకాల పోరాటాలతోనూ, సాధారణ (జనరల్) ప్రయోజనాలతోనూ జత చేయాలి. కార్మికవర్గ విప్లవతత్వాన్ని ప్రజలకు నేర్పాలి. వారి రాజకీయ చైతన్యాన్ని నిర్విరామంగా పెంచుకొంటూ పోవాలి. ఆ విధంగా విప్లవశక్తిని సమకూర్చుకోవాలి. ఈ మా అభిప్రాయం మార్క్సిజం–లెనినిజానికి పూర్తిగా అనుగుణమైంది.

మార్క్సిస్టు–లెనినిస్టుల భావాలకు వ్యతిరేకంగా సోవియట్ పార్టీ నాయకులు "బాగా అభివృద్ధి చెందిన పెట్టుబడిదారీ దేశాల్లో ప్రజాతంత్ర – సోషలిస్టు కర్తవ్యాలెంత సన్నిహితంగా పెనవేసుకొని వున్నాయంటే వాటి మధ్య గిరి గీయడం అసాధ్యమైపోతున్నది" అన్న వాదనను వ్యాప్తి చేస్తున్నారు. ఇది దీర్ఘకాలిక పోరాటాల స్థానంలో తక్షణ పోరాటాలను చొప్పించడం. కార్మికవర్గ విప్లవానికి బదులు సంస్కరణవాదాన్ని ప్రవేశపెట్టడం.

"ప్రజా పోరాటాల, విప్లవ పద్ధతుల సహకారంలేని ఏ సంస్కరణ గూడా శాశ్వతంగా ఉండజాలదు. వాస్తవమైనది కాజాలదు. ప్రాధాన్యతగలది కాజాలదు" అని లెనిన్ చెప్పాడు. కార్మికవర్గ పార్టీ "సంస్కరణల కోసమై జరిగే పోరాటాన్ని కార్మికోద్యమ విప్లవ పద్ధతులతో జతచేయకపోతే అలాంటి పార్టీ ఒక ముఠాగా తయారౌతుంది. ప్రజలనుండి దూరమైపోతుంది. విప్లవ సోషలిజం విజయానికిది తీవ్ర ప్రమాదం.

"వర్గచైతన్యంగల కార్మికుడికి ఏ ప్రజాతంత్ర కోర్కె అయినా సోషలిజానికి సంబంధించిన ఉన్నతమైన ప్రయోజనాలకన్నా తక్కువైనదే"నని లెనిన్ అన్నాడు. "రాజ్యాంగయంత్రం–విప్లవం" అన్న తన గ్రంథంలో ఎంగెల్స్ రాసిన దాన్ని అలా ఉదాహరించాడు. "ఒక్కనాటి తాత్కాలిక ప్రయోజనాలకొరకై ప్రధానమైన విధానాన్ని మర్చిపోవడం, తర్వాత వచ్చే ఫలితాలేమిటో ఆలోచించకుండా తాత్కాలిక ప్రయోజనాల కొరకై సతమతమవడం, ప్రస్తుత ప్రయోజనాల కొరకై భవిష్యత్తును వదలుకొనడం అవకాశవాదం. అందులోనూ ప్రమాదకరమైన అవకాశవాదం".

విప్లవంలో కార్మికవర్గానికీ, శ్రామిక జనబాహుళ్యానికీ నాయకత్వం వహించాలంటే కార్మికవర్గపార్టీ అన్ని పోరాట రూపాలను ఉపయోగించుకోవడంలో ఆరితేరి ఉండాలి. విభిన్న రూపాలను మేళవించగలిగి ఉండాలి, పోరాట పరిస్థితులు మారిపోయేకొద్దీ ఒక పోరాట రూపం స్థానంలో మరొక పోరాట రూపాన్ని చురుకుగా ప్రవేశపెట్టగలగాలి. శాంతియుత పోరాటం, సాయుధ పోరాటం, బహిరంగ, రహస్య పోరాట రూపాలు, చట్టబద్ధ, చట్ట వ్యతిరేక పోరాట రూపాలు, పార్లమెంటరీ పోరాటం, ప్రజాపోరాటం, జాతీయ, అంతర్జాతీయ పోరాటలు – ఇలాంటి పోరాట రూపాలన్నింటిని కార్మికవర్గ పార్టీ అత్యంత చాకచక్యంగా ఉపయోగించుకోగలిగినప్పుడు మాత్రమే అన్ని పరిస్థితులలోను అది అజేయంగా నిలువగలుగుతుంది.

చైనా కమ్యూనిస్టులు అంతర్జాతీయ కార్మికవర్గ పోరాటాల నుండి ఎన్నో విషయాలు నేర్చుకొన్నారు. చైనా విప్లవ నిర్దిష్ట కోణాలకు అనుగుణంగా వారు పోరాట రూపాలన్నింటిని నైపుణ్యంతోను, అత్యంత చాకచక్యంగాను ఉపయోగించుకోగలిగారు. సరిగ్గా దాని ఫలితమే చైనా విప్లవ విజయం. సాయుధ పోరాటం చైనా విప్లవంతోను ప్రధాన పోరాట రూపం అయితే, ఇతర పోరాట రూపాలను గనుక ఉపయోగించకపోయినట్లయితే విప్లవం విజయవంతమైయుండేది కాదు.

చైనా విప్లవ క్రమంలో చైనా కమ్యూనిస్టుపార్టీ రెండు రంగాలలో పోరాటం సాగించింది. చట్టబద్ధత అనే మితవాద పెడధోరణితోను, చట్ట వ్యతిరేకత అనే "అతివాద" పెడధోరణితోను పోరాడింది. చట్టబద్ధ పోరాటాన్ని చట్టవ్యతిరేక పోరాటంతో సవ్యంగా మేళవించింది. దేశం మొత్తం మీద తాను సాధించిన పోరాటంలో విప్లవ స్థావర ప్రాంతాలలో సాగించిన పోరాటాన్ని కొమింటాంగ్ పాలనలోని ప్రాంతాల్లో రహస్య బహిరంగ కార్యకలాపాలను సవ్యంగా మేళవించింది. చట్టబద్ధ అవకాశాలను సంపూర్ణంగా వినియోగించుకొంది. రహస్య కార్యకలాపాలలో పార్టీ మార్గదర్శక సూత్రాలను గట్టిగా పాటించింది. చైనా విప్లవం తన నిర్దిష్ట పరిస్థితులకు సరిపడిన, సంక్లిష్టమైన, వివిధ పోరాట రూపాలను ముందుకుతెచ్చింది.

చట్టబద్ధ పోరాటాన్ని తిరస్కరించడం, పార్టీ కార్యక్రమాన్ని సంకుచితమైన పరిధికే లోబరచడం, తద్వారా ప్రజల నుండి వేరుపడిపోవడం తప్పు అని తన సుదీర్ఘమైన ఆచరణానుభవం నుండి చైనా కమ్యూనిస్టుపార్టీ పూర్తిగా తెలుసుకొంది. అయితే రివిజనిస్టులు వ్యాపింపచేస్తున్న చట్టబద్ధతను ఎప్పటికీ సహించకూడదు. రివిజనిస్టులు సాయుధ పోరాటాన్ని, తదితర చట్టవ్యతిరేక పోరాటాలను తిరస్కరిస్తారు. కేవలం చట్టబద్ధ పోరాటాలకూ, కార్యకలాపాలకూ మాత్రమే పరిమితమౌతారు. పార్టీ కార్యకలాపాలను, ప్రజా పోరాటాలనూ పాలకవర్గాలు అనుమతించిన చట్టంలోనే కుదించివేయజూస్తారు. వారు పార్టీ మౌలిక కార్యక్రమం నుండి వైదొలుగుతారు. కడకు దాన్ని విసర్జిస్తారు. విప్లవాన్ని గాలికి వదలివేస్తారు. అభివృద్ధి నిరోధక చట్టబద్ధ విధానాలకే పూర్తిగా తగి ఉండేటట్లుగా తమనుతాము మార్చుకుంటారు.

కాట్స్కీలాంటి రివిజనిస్టులు బూర్జువా చట్టబద్ధత వలన దిగజారి పోయారనీ, మొద్దుబారిపోయారనీ లెనిన్ సరిగానే పేర్కొన్నాడు. "ప్రస్తుత పోలీసు చట్టం కొన్ని సంస్థలను గుర్తించి వాటికి కొన్ని ఇహలోక సౌఖ్యాలు ప్రసాదించగానే కార్మికవర్గం యొక్క జన్మహక్కు ఆయిన విప్లవాన్ని తెగనమ్ముకున్నారు."

సో.క.పా. నాయకులూ, వారి అనుయాయులూ కూడా పోరాట రూపాలన్నింటినీ ఉపయోగించుకొనడం గురించి మాట్లాడుతున్నారు. కానీ వాస్తవంలో వారు చట్టబద్ధతకే అర్రులు చాస్తున్నారు. పోరాట రూపాలను మార్చడం అన్న (సాకుతో కార్మికవర్గ విప్లవం అన్న) లక్ష్యానికే తిలోదకాలిస్తున్నారు. ఇది లెనినిజం స్థానంలో కాట్స్కీయిజాన్ని ప్రవేశపెట్టడమే.

సో.క.పా. నాయకులు తమ తప్పుడు పంథాలను సమర్థించుకోడానికి లెనిన్ వ్రాసిన "అతివాద కమ్యూనిజం–ఒక బాలారిష్టం'' అన్న ప్రఖ్యాత రచనకు తరచుగా ఉపయోగించుకొంటున్నారు. చైనా కమ్యూనిస్టు పార్టీపై వారు చేస్తున్న దాడులకు దానిని "ప్రాతిపదిక"గా చేసుకుంటున్నారు.

కానీ దీని వలన ఫలితం శూన్యమే. లెనిన్ ఇతర రచనలన్నింటలాగానే ఇది కూడా వివిధ రకాల అవకాశవాదంతో తాము సాగించవలసిన పోరటంలో మార్క్సిస్టు–లెనినిస్టులకే ఆయుధంగా ఉపయోగపడుతుంది. అంతే తప్ప రివిజనిస్టుల బూకరింపులకు సాధనంగా ఎన్నటికీ ఉపయోగపడదు.

లెనిన్ "అతివాద" బాలారిష్టాన్ని విమర్శించి విప్లవ ఎత్తుగడలను అన్వయించడంలో కార్మికవర్గపార్టీ నైపుణ్యం సంపాదించాలనే విప్లవాలకు సన్నాహాలు చేయడంలో బాగా కృషి చేయాలి అని చెప్పేనాటికే ఆయన రెండవ ఇంటర్నేషనల్ అవకాశవాదులతో తెగదెంపులు చేసుకున్నారు. మూడవ ఇంటర్నేషనల్‌ను స్థాపించారు.

సరిగ్గా ఈ విషయంమీదనే కాట్స్కీని విమర్శిస్తూ లెనిన్ ఇలా అన్నాడు – ''కాట్స్కీ సంస్కరణవాదాన్ని పొగుడుతున్నాడు. సామ్రాజ్యవాద బూర్జువా వర్గానికి లొంగిపోతున్నాడు. విప్లవం పనికిరాదంటున్నాడు. సామ్రాజ్యవాద బూర్జువా వర్గాన్ని విప్లవకర పద్ధతుల్లో కూలదోయడానికై కార్మికవర్గం పోరాడుతుంది. కానీ, కాట్స్కీ సామ్రాజ్యవాదాన్ని సంస్కరించడం ద్వారా ''అభివృద్ధి పరచాలని'' పోరాడుతున్నాడు. అదే సమయంలో దానికి లొంగిపోతున్నాడు.

కాట్స్కీని గూర్చి లెనిన్ చేసిన విమర్శ సోవియట్ పార్టీ నాయకులను చక్కగా చిత్రిస్తున్నది. "అతివాద కమ్యూనిజం అనే గ్రంథంలో ఆనాడు అంతర్జాతీయ కార్మికోద్యమానికి ప్రధాన శతృవు కాట్స్కీ తరహా అవకాశవాదమని లెనిన్ వాస్తవంగా పేర్కొన్నాడు. రివిజనిజంతో తెగతెంపులు చేసుకొనకుండా విప్లవ ఎత్తుగడలను ఎలా కరతలామలకం చేసుకోవాలి అన్నదాన్ని గురించి మాట్లాడలేమని ఆయన పదే పదే నొక్కి చెప్పాడు.

లెనిన్ ఏ కామ్రేడ్సునైతే వారి "అతివాద" బాలారిష్టం గురించి విమర్శించాడో వారందరూ విప్లవాన్ని కాంక్షించినవారే. కాగా ఆ తర్వాత పుట్టుకొచ్చిన ఈ రివిజనిస్టు కృశ్చేవ్ విప్లవాన్ని వ్యతిరేకిస్తున్నాడు. అందువలన శ్రీవారు కూడా కాట్స్కీ తరహాకు చెందినవాడే. కనుక "అతివాద" బాలారిష్టం గురించి మాట్లాడే హక్కు కృశ్చేవ్‌కు ఎంత మాత్రమూ లేదు.

చైనా కమ్యూనిస్టు పార్టీపైన "ట్రాట్స్కీయిజం" ముద్ర సోవియట్ పార్టీ నాయకత్వం తగిలించడం అత్యంత అసంబద్ధం. కాని వాస్తవంలో ట్రాట్స్కీయిజం సింహాసనానికి కృశ్చేవ్ వారసుడుగా వచ్చాడు. కృశ్చేవ్ ఈనాటి ట్రాట్స్కీవాదుల సరసన నిలబడుతున్నాడు.

ట్రాట్స్కీయిజం అనేక సమస్యలపైన అనేక విధాలుగా తలెత్తుతుంటుంది. ''మితిమీరిన అతివాదం''గా అది తరచు ముసుగుతగిలించుకొంటుంది. కాని దాని సారాంశమేమంటే విప్లవనికి వ్యతిరేకత, విప్లవాన్ని నిరాకరించడం.

కర్మికవర్గ విప్లవం, కార్మికవర్గ నియంతృత్వాలను వ్యతిరేకించి కీలకమైన అంశానికి సంబంధించినంతవరకూ ట్రాట్స్కీయిజం, రెండవ ఇంటర్నేషనల్‌కు చెందిన రివిజనిజం రెండూ ఒకటే. అందుకే ట్రాట్స్కీయిజమంటే మరో తరహా మెన్షివిజమూ, కాట్స్కీయిజమూ, సోషల్ డెమోక్రసీ, విప్లవ ప్రతీఘాతుక బూర్జువావర్గ అగ్రగామిదళమూ అని స్టాలిన్ పదే పదే చెప్పాడు.

సారం పిండి చెప్పాలంటే నేటి కృశ్చేవ్ తరహా రివిజనిజం కూడా విప్లవాన్ని వ్యతిరేకిస్తున్నది. విప్లవాన్ని నిరాకరిస్తున్నది. అందువల్ల కృశ్చేవ్ రివిజనిజం, కాట్స్కీయిజం గుడ్డునుండి ఉత్పన్నమయిందేకాక, విప్లవాన్ని వ్యతిరేకించడంలో ట్రాట్స్కీయిజాన్ని కూడా పోలివున్నది. కనుక ట్రాట్స్కీయిజం అనే ముద్రను కృశ్చేవ్ తనకే తగిలించుకొనడం మంచిది.

చరిత్ర అన్నింటికన్నా తిరుగులేని సాక్ష్యం. రెండవ ప్రపంచ యుద్ధానంతరం అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమంలోనూ, ప్రజల విప్లవ పోరాటాల్లోనూ విలువైన అనుభవం వచ్చింది. విజయాలతో నిండిన అనుభవమూ, అపజయాలతో కూడిన అనుభవమూ రెండూ ఉన్నాయి. అన్ని దేశాల కమ్యూనిస్టులూ, విప్లవకాముక ప్రజలూ ఈ చారిత్రకానుభవం నుండి సరైన గుణపాఠాలు తీసుకోవలసి ఉంది.

మార్క్సిస్టు విప్లవ మార్గాన్ని, అక్టోబర్ విప్లవ పంథాను అనుసరించడం వల్లనే తూర్పు యూరపులోని దేశాలూ, ఆసియా, లాటిన్ అమెరికా దేశాలు యుద్ధానంతరం సోషలిస్టు విప్లవంలో విజయం సాధించగలిగాయి. అక్టోబర్ విప్లవానుభవంతో పాటు, ఇప్పుడు చైనా విప్లవవానుభవమూ, తూర్పు యూరపులోని సోషలిస్టు దేశాలు, కొరియా, వియత్నామ్, క్యూబాల విప్లవవానుభవమూ ఉన్నాయి. ఈ దేశాల్లో విజయవంతంగా సాగిన విప్లవాలు మార్క్సిజం-లెనినిజాన్నీ, అక్టోబర్ విప్లవానుభవాన్నీ సంపదత్వం చేసి అభివృద్ధి చేశాయి.

చైనా నుండి క్యూబావరకూ ఎలాంటి మినహాయింపులూ లేకుండా ఈ విప్లవాలన్నీ సాయుధ పోరాటంద్వారా సామ్రాజ్యవాద సాయుధ దురాక్రమణ, జోక్యాలకు వ్యతిరేకంగా పోరాడుతూ సాధించుకొన్నవే.

ప్రజా విముక్తి యుద్ధపు 3 సంవత్సరాల కాలంతో సహా, 22 సంవత్సరాలు విప్లవ యుద్ధాలు చేసి, చైనా ప్రజలు విప్లవాన్ని సాధించుకొన్నారు. ఆ యుద్ధాల్లో అమెరికా సామ్రాజ్యావాదుల సంపూర్ణ సహాయం పొందిన అభివృద్ధి నిరోధక చాంగ్ కై షేక్ ముఠాను సమూలంగా ఓడించారు.

కొరియా ప్రజలు జపాన్ సామ్రాజ్యావాదానికి వ్యతిరేకంగా 1930 ప్రాంతం నుండి 15 సంవత్సరాలపాటు, సాయుధ విప్లవపోరాటాన్ని సాగించారు. తమ సాయుధ విప్లవ శక్తులను నిర్మించుకొని విస్తృతపరచుకొన్నారు. చివరకు సోవియట్ సైన్యం సహాయంతో విజయం సాధించారు. కొరియా ప్రజాతంత్ర రిపబ్లిక్ అవతరించిన తర్వాత, అమెరికా సామ్రాజ్యవాద సాయుధ దురాక్రమణ నుండి తమ విప్లవాన్ని రక్షించుకొని పటిష్టవంతం చేసుకోవడానికి కొరియా ప్రజలకు మరో 3 సంవత్సరాలు పట్టింది.

1945 ఆగస్టులో సాయుధ తిరుగుబాటు ద్వారా వియత్నాం ప్రజలు రాజ్యాధికారం చేజిక్కించుకొన్నారు. ఆ వెన్వెంటనే, జాతి విముక్తికోసం ఎనిమిదేండ్లపాటు, ఫ్రెంచి సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగానూ, అమెరికా సామ్రాజ్యవాద సైనిక జోక్యాన్ని ఓడించడం కోసమూ వారు పోరాటం ప్రారంభించి, ఉత్తర వియత్నాంలో విజయం సాధించారు. అమెరికా సామ్రాజ్యవాద సాయుధ దురాక్రమణకు వ్యతిరేకంగా దక్షిణ వియత్నాం ప్రజలు ఇంకా ఈ నాటికీ వీరోచిత పోరాటం సాగిస్తూనే ఉన్నారు.

క్యూబా ప్రజలు 1955లో సాయుధ తిరుగుబాటు ప్రారంభించారు. అటువిమ్మట అమెరికా సామ్రాజ్యవాద వరిపాలనను, క్యూబాలో దాని కీలుబొమ్మ బాటిస్టాను కూలద్రోయడానికి క్యూబా ప్రజా విప్లవ పోరాటానికి రెండేండ్లకు పైగా పట్టింది. ఈ విప్లవ విజయానంతరం, క్యూబా ప్రజలు తమ దేశంపై అమెరికా సామ్రాజ్యావాద వర్తకదోపిడీ మూఠా జరిపిన సాయుధ దండయాత్రలను తుత్తునియలు చేసి, విప్లవ ఫలితాలను పరిరక్షించుకొన్నారు.

ఇతర సోషలిస్టు దేశాలు కూడా సాయుధ పోరాటాల ద్వారానే నెలకొన్నాయి.

రెండవ ప్రపంచ యుద్ధానంతరం చైనా మొదలు క్యూబా వరకు విజయవంతంగా జరిగిన శ్రామికవర్గ నియంతృత్వ విప్లవాలు నేర్పే ప్రధానమైన గుణపాఠాలేమిటి?

1. శ్రామికవర్గ విప్లవానికి భీకర విప్లవం విశ్వజనీన సూత్రంగా ఉంది. సోషలిజానికి పరివర్తనను సాధించాలంటే, శ్రామికవర్గ సాయుధ పోరాటాన్ని సాగించి, పాత రాజ్యాంగ యంత్రాన్ని తుత్తునియలు చేసి, శ్రామికవర్గ నియంతృత్వాన్ని ఏర్పాటు చేయవలసి ఉంది.

2. శ్రామికవర్గానికి అత్యంత విశ్వసనీయంగా ఆధారపడదగ్గ వ్యక్తులు రైతాంగం. రైతాంగంపై శ్రామికవర్గం అతిసన్నిహితంగా తప్పనిసరిగా ఆధారపడి రైతు-కూలీ ఐక్యత ప్రాతిపదికపై విశాల ఐక్య సంఘటనను ఏర్పాటు చేయాలి. విప్లవంలో కార్మికవర్గ నాయకత్వాన్ని సాధించడానికి పట్టుదలతో కృషి చేయాలి.

3. సకల దేశాల ప్రజా విప్లవాలకు అమెరికా సామ్రాజ్యవాదం బద్ధ శత్రువు. ఏ దేశంలోని శ్రామికవర్గం ఆ దేశంలో అమెరికా సామ్రాజ్యావాదానికి వ్యతిరేకంగా నిలబడి, అమెరికా సామ్రాజ్యవాదానికీ, దాని తొత్తులకూ, వ్యతిరేకంగా దృఢదీక్షతో పోరాడ్డానికి తగిన ధైర్య సాహసాలు కలిగి ఉండాలి.

4. పీడిత దేశాల విప్లవం శ్రామికవర్గ విప్లవానికి అత్యావశ్యకమైన తోడునీడ. సకలదేశాల కార్మికులు ఐక్యం కావాలి. అంతేకాక, వారు పీడిత దేశాలన్నింటిలోనూ, సామ్రాజ్యవాదాన్నీ, దాని తొత్తులనూ వ్యతిరేకించే శక్తులన్నింటితోనూ ఏకమై విశాలమైన అంతర్జాతీయ ఐక్య సంఘటనను ఏర్పాటు చేయవలసి ఉంది.

5. విప్లవం సాగించాలంటే, విప్లవకరపార్టీ తప్పనిసరిగా అవసరం. మార్క్సిజం-లెనినిజం విప్లవకర సిద్ధాంతం. సూత్రానికి అనుగుణంగా ఏర్పాటు చేయబడి, రివిజనిజం, అవకాశవాదాలపట్ల ఏ మాత్రం రాజీపడని, అభివృద్ధి నిరోధక పరిపాలకవర్గాల వారి రాజ్యాధికారాలపట్ల విప్లవకర వైఖరిని అవలంభించే శ్రామికవర్గ పార్టీ లేకుండా శ్రామికవర్గ విప్లవామూ, శ్రామికవర్గ నియంతృత్వమూ విజయవంతం కాజాలవు.

విప్లవకర సాయుధ పోరాటం అనేది శ్రామికవర్గ విప్లవానికి మాత్రమేకాక, పీడితదేశాల జాతీయ, ప్రజాస్వామ్యవిప్లవానికి కూడా ప్రధానంగా అవసరం. ఈ విషయంలో అల్జీరియా జాతీయ విమోచన యుద్ధవిజయం చక్కటి ఉదాహరణగా చూపవచ్చు.

ప్రపంచ యుద్ధానంతరం దగ్గర నుండి శ్రామికవర్గ పార్టీల యావత్తు చరిత్రను పరిశీలించినట్లయితే, విప్లవపంథాను

అంటిపెట్టుకొని సరైన వ్యూహాన్నీ, ఎత్తుగడలనూ అనుసరించి, విప్లవపోరాటంలో ప్రజలను చురుకుగా నడిపించిన పార్టీలు విప్లవాన్ని మెట్టుమెట్టుగా విజయం వైపు నడపగలిగి, బలాధిక్యతను పొందగలిగినట్లు మనం కనుగొనవచ్చు. అందుకు భిన్నంగా, విప్లవేతర, అవకాశవాద వైఖరిని చేపట్టి శాంతియుత పరివర్తన అనే కృశ్చేవ్ సూత్రాన్ని ఆమోదించిన పార్టీలన్నీ విప్లవ ఆశయానికి తీవ్రమైన హాని చేస్తున్నాయి. అంతేగాక తమకుతామే నిర్జీవమైన సంస్కరణవాద పార్టీలుగా మార్చివేసుకొనడమో లేదా అవి పూర్తిగా నైరాశ్యంపొంది, శ్రామికవర్గానికి వ్యతిరేకంగా బూర్జువాలకు దాసోహమని సేవలు చేస్తున్నాయి. అలాంటి ఉదంతాలకు కొదవలేదు.

ఇరాక్ కమ్యూనిస్టుపార్టీ కామ్రేడ్స్ ఒకానొకప్పుడు విప్లవ తేజోమూర్తులుగా ఉండేవారు. అయితే కృశ్చేవ్ రివిజనిస్టు పంథాను వారు బయటివారి ఒత్తిడిపై ఆమోదించడంతో, విప్లవ ప్రతీఘాతుకత్వంపట్ల వారికున్న వ్యతిరేకత వారినుంచే మాయమయ్యింది. విప్లవానికి వ్యతిరేకంగా జరిగిన సాయుధ తిరుగుబాటుతో ప్రముఖ కామ్రేడ్స్ వీరోచితంగా తమ జీవితాలను త్యాగం చేశారు. వేలాది ఇరాక్ కమ్యూనిస్టులు, విప్లవ వీరులు దారుణంగా హత్య చేయబడ్డారు. శక్తివంతమైన ఇరాక్ కమ్యూనిస్టుపార్టీ చిన్నాభిన్నమైంది. ఇరాక్ ప్రజల విప్లవ ఆశయం తీవ్రంగా దెబ్బతిన్నది. శ్రామికవర్గ విప్లవ చరిత్రలో రక్తాక్షరాలతో లిఖించదగిన విషాదకర గుణపాఠం ఇది.

అల్జీరియా కమ్యూనిస్టుపార్టీ నాయకులు, కృశ్చేవ్ మరియు ఫ్రెంచి కమ్యూనిస్టుపార్టీ నాయకుల దండనాయుధం ముందు నృత్యం చేస్తూ, సాయుధ పోరాటానికి వ్యతిరేకంగా రివిజనిస్టుల పంథాను సంపూర్ణంగా ఆమోదించారు. అయితే అల్జీరియా ప్రజలు మాత్రం వారి దుర్బోధలను విననిరాకరించారు. జాతీయ స్వాతంత్ర్యం కోసం సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా, వీరోచితంగా ఏడేండ్లకుపైగా పోరాడి, చివరకు అల్జీరియా స్వాతంత్ర్యాన్ని ఫ్రెంచి ప్రభుత్వంచే గుర్తింపజేశారు. అయితే సోవియట్ కమ్యూనిస్టుపార్టీ యొక్క రివిజనిస్టు పంథాను అనుసరిస్తున్న అల్జీరియా కమ్యూనిస్టుపార్టీ, అల్జీరియా ప్రజలు తమపై నిల్పుకొన్న విశ్వాసాన్ని దేశ రాజకీయ జీవితంలో తనకున్న స్థానాన్నీ పోగొట్టుకొన్నది.

క్యూబా విప్లవకాలంలో, పాప్యులర్ సోషలిస్టుపార్టీకి చెందిన కొందరు నాయకులు విప్లవకర సాయుధ పోరాట సక్రమ పంథాయైన మార్క్సిస్టు–లెనినిస్టు పంథాను అనుసరించడానికి నిరాకరించారు. కృశ్చేవ్ యొక్క రివిజనిస్టు పంథాను స్వీకరించి, ''శాంతియుత పరివర్తన''ను ప్రబోధిస్తూ తీవ్ర విప్లవాన్ని వ్యతిరేకించారు. ఆ పరిస్థితులలో, క్యూబా పార్టీలో అంతర్గతంగానూ, పార్టీకి వెలుపలా కామ్రేడ్ ఫెడల్ కాస్ట్రో నాయకత్వానవున్న మార్క్సిస్టు–లెనినిస్టులు తీవ్ర విప్లవాన్ని వ్యతిరేకించిన నాయకులను సవ్యంగానే వెనక్కు నెట్టివేసి, క్యూబా ప్రజలతో భుజం భుజం కలిపి విప్లవాన్ని సాగించి చిట్టచివరకు అత్యంత చారిత్రక ప్రాధాన్యంగల విజయాన్ని సాధించారు.

థోరే నాయకత్వం క్రింద కొందరు ఫ్రెంచి కమ్యూనిస్టుపార్టీ నాయకులు దీర్ఘకాలంగా రివిజనిస్టు పంథాను అనుసరిస్తూ, కృశ్చేవ్ దండనాయుధానికి తలొగ్గి "పార్లమెంటరీ పంథా"ను గూర్చి ప్రచారం సాగించి, కమ్యూనిస్టుపార్టీని వాస్తవంగా సోషల్ డెమోక్రటిక్ పార్టీ స్థాయికి తీసుకువెళ్ళారు. ప్రజల విప్లవకర ఆశయాలకు చురుకైన మద్ధతునివ్వడం మానుకొని అమెరికా సామ్రాజ్యవాదంపట్లగల జాతీయ వ్యతిరేకతా పతాకాన్ని చుట్టివేశారు. ఈ రివిజనిస్టు పంథాను అనుసరించినందువల్ల ఫలితం ఏమిటీ అంటే, ఒకప్పుడు ప్రజలలో గొప్ప పలుకుబడిగల ఫ్రెంచి కమ్యూనిస్టుపార్టీ, సామాన్య ప్రజల నుంచి నానాటికీ వేరుబడిపోయి మరింత హెచ్చుగా క్షీణించిపోయింది.

డాంగే మొదలైన భారత కమ్యూనిస్టు నాయకులు కొందరు చాలాకాలం నుండీ రివిజనిస్టు పంథాను అనుసరిస్తున్నారు. విప్లవ పతాకాన్ని వారు పారవేశారు. జాతీయ, ప్రజాతంత్ర విప్లవ పోరాటాల్లో ప్రజలకు నాయకత్వం వహించడంలో విఫలమయ్యారు. డాంగే ముఠా రివిజనిస్టు మార్గానపడి చాలా దూరం వెళ్ళిపోయింది. జాతీయ దురహంకారులుగా వారు తయారయ్యారు. భారత బడా భూస్వామ్య, బడా బూర్జువా వర్గ విధానాలను మోసుకువెళ్ళే సాధనాలుగా తయారయ్యారు. కార్మికవర్గ ద్రోహులుగా మారిపోయారు.

మౌలికంగానే భిన్నంగా ఉన్న ఈ రెండు పంథాలు మౌలికంగా విభిన్నంగా ఉండే రెండు ఫలితాలకు దారి తీస్తున్నట్లు చరిత్ర చూపుతోంది. ఈ గుణపాఠాలన్నింటిని అతి శ్రద్ధతో పరిశీలించవలసి ఉంది.

కృశ్చేవ్ లోతైన రివిజనిజం చారిత్రక, సాంఘిక కోణాలతో వేళ్ళూని నేటి కాల పరిస్థితుల ప్రభావంతో కూడుకొని ఉంది. లెనిన్ చెప్పినట్లు "అవకాశవాదం వ్యక్తులవల్ల సంభవించే ప్రమాదంగాని, పాపంగాని, దిగజారుడు గాని, విద్రోహంగాని కాదు. అది యావత్తు చారిత్రక యుగం సృష్టించిన సాంఘిక పరిణామం.

అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమం, రెండవ ప్రపంచ ఉద్యమం నాటి నుంచి గొప్ప పురోగతిని సాధిస్తూనే, తన సభ్యులలోనే సిద్ధాంత వ్యతిరేక భావాలను అంటే సోషలిజం, మార్క్సిజం–లెనినిజం, శ్రామికవర్గ విప్లవాలకు వ్యతిరేకంగా రివిజనిజాన్ని సృష్టించింది. దీనికి ప్రధానంగా మొదట బ్రౌడర్, అటువిమ్మట టిటోల రివిజనిజాన్ని పెంపుదల చేసి కొనసాగించడం తప్ప వేరుకాదు.

బ్రౌడర్ తన రివిజనిస్టు విధానాన్ని 1935 ప్రాంతంలో వెల్లడించడం మొదలుపెట్టాడు. ఆయన బూర్జువా ప్రజాస్వామ్యాన్ని ఆరాధించాడు. బూర్జువా ప్రభుత్వంపై యుక్తమైన విమర్శను చేయడం మానుకొన్నాడు. ''ఇరవయ్యవ శతాబ్దపు అమెరికనిజమే కమ్యూనిజం" అనే నినాదం లేవనెత్తి కమ్యూనిస్టులకు బూర్జువా నియంతృత్వమే మంచిదని భావించాడు.

రెండవ ప్రపంచ యుద్ధకాలంలో అంతర్జాతీయ, జాతీయ ఫాసిస్టు వ్యతిరేక ఐక్య సంఘటనలు ఏర్పడడంతో బూర్జువా "ప్రజాతంత్రం", "అభ్యుదయం", "హేతుబుద్ధి" మొదలైనవాటి ఎడల అతడు బాగా మోజు పడ్డాడు. బూర్జువావర్గం ఎదుట సాష్టాంగ దండ ప్రమాణాలు చేశాడు. బూర్జువా వర్గానికి లొంగిపోయేవాడుగా తయారయ్యాడు.

బూర్జువా వర్గాన్ని ఆనందపరిచే రివిజనిస్టు భావాలను బ్రౌడర్ ప్రచారంలో పెట్టాడు. విప్లవాన్ని వ్యతిరేకించి, నిరాకరించాడు.

సోవియట్ యూనియన్, అమెరికా, బ్రిటన్లు మధ్య జరిగిన టెహరాన్ ఒడంబడికవల్ల పెట్టుబడిదారీ విధానం–సోషలిజం మధ్య

"దీర్ఘకాల పరస్పర విశ్వాసం, సహకారం" కలిగే యుగం ఏర్పడిందని బ్రౌడర్ ప్రకటించాడు. దానివల్ల "స్థిరమైన శాంతి తరాల పర్యంతం గ్యారంటీ అవుతుంద"న్నాడు.

సోవియట్ యూనియన్, అమెరికా, బ్రిటన్ల మధ్య కుదిరిన అంతర్జాతీయ ఒప్పందం "ఎలాంటి మినహాయింపులూ లేకుండా ప్రపంచంలోని అన్ని దేశాల అందరి ప్రజల ముఖ్య ప్రయోజనాలకు ప్రాతినిథ్యం వహిస్తున్నది" అన్న భావాన్ని బ్రౌడర్ ప్రచారంలో పెట్టాడు.

"ఒకదేశంలో సంక్షోభం ఉండడం అంతర్జాతీయ ప్రశాంత పరిస్థితి ఉన్నప్పుడు సాధ్యంకాదు. ఈ రెంటికీ పొత్తుకుదరదు" అన్నాడు. అందువల్ల దేశంలో ''వర్గపోరాట ప్రజ్వలనాన్ని'' వ్యతిరేకించాలనీ, అంతర్గత వర్గపోరాటాన్ని కనీసస్థాయికి తగ్గించి, ఖచ్చితమైన పరిమితుల్లో దాన్ని పెట్టాలి" అని బ్రౌడర్ వాదించాడు.

''యుద్ధమేవస్తే ప్రపంచంలో అత్యధికభాగం సర్వనాశనమైపోతుంది. ప్రపంచంలో అత్యధిక భాగాన్ని 50, 100 సంవత్సరాలకాలం పాటు, ఆటవిక పరిస్థితిలో పడవేస్తుంది. అందువల్ల యుద్ధాన్ని అరికట్టటానికై అన్ని వర్గాలకూ అతీతమైన ఒప్పందం అవసరం అని బ్రౌడర్ నొక్కి చెప్పాడు.

సోషలిజాన్ని సాధించటానికై "ప్రజాతంత్ర యుతమైన నచ్చజెప్పే పద్ధతులపైనే పూర్తిగా ఆధారపడాలి" అని బ్రౌడర్ వాదించాడు. రెండో ప్రపంచ యుద్ధానంతరం కొన్ని దేశాల్లో "శాంతియుత పద్ధతుల ద్వారా సోషలిజం వచ్చే పరిస్థితులు ఏర్పడ్డాయి" అన్నాడు.

''ఆచరణకు సంబంధించినటువంటి కమ్యూనిస్టుల రాజకీయాభిప్రాయాలు కమ్యూనిస్టులు కాని అశేష సంఖ్యాకుల అభిప్రాయాలతో ముఖ్య అంశాల్లో చాలాకాలం వరకూ అంగీకరించుతాయి" అంటూ కార్మికవర్గ పార్టీల స్వతంత్ర ప్రతిపత్తి నిరాకరించాడు.

ఈ అభిప్రాయాలతో, ఆయన అమెరికా కమ్యూనిస్టు పార్టీని రద్దు చేశాడు.

కొంతకాలం బ్రౌడర్ రివిజనిజం అమెరికా శ్రామికవర్గ విప్లవ ఆశయాన్ని అధోగతి పట్టించింది. ఇతర దేశాల శ్రామికవర్గ పార్టీలు సర్వనాశనం కావడానికి విషగుళికవలే పని చేసింది.

బ్రౌడర్ రివిజనిస్టు పంథాను కామ్రేడ్ విలియంజడ్, ఫాస్టర్ నాయకత్వాన అమెరికా కమ్యూనిస్టులు చాలా మంది వ్యతిరేకించారు. అనేక సోదర పార్టీలు కూడా ఈ పంథాను తిరస్కరించాయి. అయినప్పటికీ, బ్రౌడరిజం ప్రవేశపెట్టిన రివిజనిస్టు ధోరణిని అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమం యావత్తూ పూర్తిగా విమర్శించలేదు. దానిని తుద ముట్టించలేదు. యుద్ధనంతరం ఏర్పడిన నూతన పరిస్థితులలో రివిజనిస్టు ధోరణి కొన్ని దేశాలలో కమ్యూనిస్టుల మధ్య కొత్తగా అభివృద్ధి చెందింది.

పెట్టుబడిదారీ దేశాలలో రివిజనిస్టు ధోరణి పెంపొందడం మొదట ఎలా పొడసూపిందంటే, కొన్ని కమ్యూనిస్టు పార్టీల నాయకులు విప్లవ మార్క్సిస్టు–లెనినిస్టు పంథాను వదిలిపెట్టి, "శాంతియుత పరివర్తన" పంథాను చేపట్టారు. టోగ్లియాటీ యొక్క రాజ్యాంగయంత్రంలో నిర్మాణ సంస్కరణల సిద్ధాంతంలో ఈ ధోరణి స్పష్టంగా కనిపిస్తున్నది. బూర్జువా ప్రజాస్వామ్యం కల్పించే చట్టబద్ధ పద్ధతుల ద్వారా శ్రామికవర్గం అధికారంలోకి వస్తుందని, గుత్త పెట్టుబడిదారీ విధానానికి తోడ్పడే ఆర్థికవ్యవస్థను జాతీయీకరణ ద్వారా, ప్రణాళికాబద్ధ విధానం ద్వారా సోషలిస్టు ఆర్థిక వ్యవస్థగా పరివర్తన చెందించవచ్చునని ఆయన సిద్ధాంతం చెబుతుంది. ఈ పంథా ప్రకారం బూర్జువా ప్రభుత్వ యంత్రాంగాన్ని నాశనం చేయకుండానే, నూతన సోషలిస్టు ఉత్పత్తి సంబంధాలను స్థాపించడం, సోషలిజానికి పరివర్తన చెందడం సాధ్యమే. ఆచరణలో, ఇది కమ్యూనిజాన్ని సోషల్ డెమోక్రసీలోకి దిగజార్చుతుంది.

సోషలిస్టు దేశాల్లో, రివిజనిస్టు ధోరణి మొదట యుగోస్లావియాలో తలెత్తింది. అమెరికా సామ్రాజ్యవాదానికి దాసోహం అనడం టిటో రివిజనిజంలో ప్రధానమైన కోణం, టిటో ముఠా అమెరికా సామ్రాజ్యవాదాన్ని తమ శరీరాన్నీ, ఆత్మనూ అమ్ముకున్నారు. వారు యుగోస్లావియాలో పెట్టుబడిదారీ విధానాన్ని పునరుద్ధరించడమే కాకుండా, పైపెచ్చు సోషలిస్టు శిబిరాన్ని అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమాన్ని బలహీనపరచడానికి సామ్రాజ్యవాదుల పనిముట్లుగా తయారైనారు. ప్రపంచ విప్లవాన్ని వెన్నుపోటు పొడవడానికై అమెరికా ప్రత్యేక దళం యొక్క పాత్రను నిర్వహిస్తున్నారు.

అమెరికా సామ్రాజ్యవాదానికి తోడ్పడడం, శ్రామికవర్గ విప్లవాన్ని వ్యతిరేకించడం, రద్దు చేయడం టిటో ముఠా ఉద్దేశం. అందుచేత హింసాయుత విప్లవం "సామాజిక వైరుధ్యాలను పరిష్కరించే సాధనంగా ఇకనెంతమాత్రమూ పనికిరాద"ని, బూర్జువా పార్లమెంటు ద్వారా సోషలిజంవైపు అభివృద్ధి పరిణామ క్రమం సంభవం మాత్రమే కాదు, అదొక వాస్తవ విషయంగా కూడా తయారైంది" అని వారు స్పష్టంగానే వాదించారు. నేటి ప్రపంచం "మొత్తంమీద ఇప్పటికే సోషలిజంలోకి లోతుగా 'దిగబడిపోయింది' సోషలిస్టుగా తయారైంది'' అని నిరాఘాటంగా చెబుతూ, పెట్టుబడిదారీ విధానాన్ని, సోషలిజాన్ని వారు ఒకే గాట కట్టివేస్తున్నారు. "ప్రస్తుతం, సోషలిజమా లేక పెట్టుబడిదారీ విధానమా అనే సమస్య–ప్రపంచ వ్యాప్తంగా పరిష్కారమైపోయింది" అని కూడా వారు చెబుతున్నారు.

బ్రౌడర్ రివిజనిజం, రాజ్యాంగయంత్రంలో నిర్మాణ సంస్కరణల సిద్ధాంతం, టిటో రివిజనిజం–ఇవి ద్వితీయ ప్రపంచ యుద్ధానంతరం పొడసూపిన రివిజనిస్టు ధోరణులలో ప్రధానమైనవి.

సోవియట్ కమ్యూనిస్టు పార్టీ 20, 22వ మహాసభల మధ్య ''శాంతియుత పరివర్తన,'' ''శాంతియుత సహజీవనం,'' "శాంతియుత పోటీ" అనే కృశ్చేవ్ రివిజనిస్టు పంథా ఒక సంపూర్ణ వ్యవస్థగా తయారైంది. ఇది తన "నూతన సృష్టి" అని చెప్పుకుంటూ, దీనిని ఆయన ప్రతిచోటికి తీసుకుపోతున్నారు. ఇది బ్రౌడర్ రివిజనిజాన్ని, రాజ్యాంగయంత్రంలో నిర్మాణ సంస్కరణల సిద్ధాంతాన్ని, టిటో రివిజనిజం కలగలిసి తీర్చిదిద్దిన ఆకృతి మాత్రమే. అంతర్జాతీయ సంబంధాలలో, కృశ్చేవ్ రివిజనిజం అమెరికా సామ్రాజ్యవాదానికి దాసోహం అంటుంది. సామ్రాజ్యవాద పెట్టుబడిదారీ దేశాలలో అభివృద్ధి నిరోధక వర్గాలకు దాసోహం అంటుంది. సోషలిస్టు దేశాలలో పెట్టుబడిదారీ శక్తుల అభివృద్ధిని ప్రోత్సహిస్తుంది.

రెండో ఇంటర్నేషనల్‌కు చెందిన బెరన్‌స్టీన్, కాట్స్కీ తదితర రివిజనిస్టులు ప్రథమ ప్రపంచ యుద్ధకాలంలో ఒకే పంథాలో నడిచారు. ఒకే కుటుంబంలో ఉండిపోయారు. నేడు ద్వితీయ ప్రపంచ

యుద్ధానంతరం బ్రౌడర్, టిటో, కృశ్చేవ్‌ల పరిస్థితి ఇదే.

బ్రౌడర్ ఈ విషయాన్ని స్పష్టం చేశాడు. 'ఏ అప్రాచ్యం' పలికినందుకు 1945లో నన్ను కమ్యూనిస్టు పార్టీ నుండి వెళ్ళగొట్టారో ఇప్పుడు కృశ్చేవ్ అదే "అప్రాచ్యాన్ని" అనుసరించారు అని ఆయన 1960లో వ్రాశాడు. కృశ్చేవ్ నూతన విధానం "పదిహేనేళ్ళక్రితం నేను అనుసరించిన విధానాన్నే దాదాపు మాటకు మాట అనుసరిస్తున్నది. అందుచేత నా దోషమల్లా – కనీసం ఇప్పటికీ – ఏమంటే అది నూతన ఛాందసత్వం" అని కూడా ఆయన వ్రాశాడు.

తానూ, టిటో "ఒకే అభిప్రాయానికి చెందినవారం, ఒకే సిద్ధాంతాన్ని అనుసరిస్తున్నవారం" అని కృశ్చేవ్ స్వయంగా అంగీకరించాడు.

స్వభావాన్ని బట్టిచూస్తే, కృశ్చేవ్ రివిజనిజం బెరన్‌స్టీన్, కాట్‌స్కీ, బ్రౌడర్, టిటోల రివిజనిజంకంటే చాలా హానికరమైనది. ఎందుచేత? ఎందుచేతనంటే, సోవియట్ రష్యా మొట్టమొదటి సోషలిస్టు రాజ్యం. సోషలిస్టు శిబిరంలో పెద్దరాజ్యం, లెనినిజానికి జన్మభూమి, సోవియట్ కమ్యూనిస్టు పార్టీ లెనిన్‌చే సృష్టింపబడిన పార్టీ, అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమంలో చారిత్రకంగా ప్రతిష్టను సంతరించుకొన్నది. కృశ్చేవ్ సోవియట్ కమ్యూనిస్టు పార్టీ, సోవియట్ యూనియన్ నాయకుడిగా వినియోగించుకొంటున్నారు.

ఆయన తన రివిజనిస్టు పంథాను "లెనినిస్టు పంథా" అని చెప్పుకుంటున్నాడు. మహా నాయకుడు లెనిన్ ప్రతిష్టను, గొప్ప పార్టీ అయిన బోల్షివిక్ పార్టీ ప్రతిష్టను, ప్రజల్ని గందరగోళ పరచడానికి, దగా చేయడానికి ఉపయోగించుకొంటున్నారు.

సోవియట్ కమ్యూనిస్టు పార్టీ పొందిన ప్రతిష్టను, పెద్దపార్టీ, పెద్దదేశం యొక్క స్థానాన్ని ఆయన ఉపయోగించుకొంటూ, తమ రివిజనిస్టు పంథాను ఇతరులు అంగీకరించేట్లు వత్తిడి పెట్టడానికై ఆజ్ఞలు జారీ చేస్తున్నారు. రాజకీయంగా, ఆర్థికంగా, దౌత్యరీత్యా అన్ని విధాల చర్యలు తీసుకొంటున్నారు.

సంపన్న కార్మికులను కొనివేసే సామ్రాజ్యవాద విధానానికి అనుగుణంగానే అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమంలో మార్క్సిజం–లెనినిజానికి తిలోదకాలిచ్చి, బూర్జువా మనస్తత్వం అలవరచుకొన్న కొందరు కమ్యూనిస్టులను ఆయన కొనివేస్తున్నారు. సోవియట్ కమ్యూనిస్టుపార్టీ నాయకుల విప్లవ వ్యతిరేక పంథాకు ప్రక్క తాళం వేయవలసిందిగా వారిని ప్రోత్సహిస్తున్నారు.

అందుచేత ఇతర రివిజనిస్టులందరూ, గతంలో కానివ్వండి, ఇప్పుడు కానివ్వండి కృశ్చేవ్ ముందు మరుగుజ్జులు.

1957 ప్రకటన పేర్కొన్నట్లు, ఆధునిక రివిజనిజానికి సామాజికంగా ఊతం ఎలా లభించిందంటే – అంతర్జాతీయంగా సామ్రాజ్యవాదుల వత్తిడికి లొంగిపోవడం వల్ల, జాతీయంగా బూర్జువా వర్గాన్ని స్వీకరించడం వల్ల లభించింది.

పాతకాలపు రివిజనిస్టులవలె, ఆధునిక రివిజనిస్టులు లెనిన్ చేసిన వర్ణనలో ఇముడుతారు. "....భౌతికంగా, వారు బూర్జువావర్గ రాజకీయదళం...వారు దాని ప్రభావానికి ప్రసారకులు, కార్మికోద్యమంలో దాని ఏజెంట్లు.

సామ్రాజ్యవాద, అంతర్జాతీయ గుత్త పెట్టుబడిదారీ విధానాలే ఆధునిక రివిజనిజాన్ని తయారు చేశాయి. ఈ రెంటికీ అమెరికా నాయకత్వం వహిస్తున్నది. అణ్వాయుధ బెదిరింపుల విధానానికి జడిసి, కొనివేసే విధానానికి లొంగిపోయి, ఆధునిక రివిజనిస్టులు అమెరికా సామ్రాజ్యవాదానికి పావులుగానూ, విప్లవాన్ని వ్యతిరేకించడంలో దాని బానిస అనుచరులుగాను ఉపకరిస్తున్నారు.

రివిజనిస్టు కృశ్చేవ్ అమెరికా సామ్రాజ్యవాదులు పెట్టే యుద్ధపు పెడబొబ్బలకు భీతిల్లిపోతారు కూడా. "ప్రాణికోటితో నిండిన ఈ నౌక", ఈ పృథ్వి ఏ కోణంలోనైనా నాశనమయ్యే ప్రమాదం ఏర్పడిందని ఆయన భావిస్తారు. మానవజాతి భవిష్యత్‌లో ఆయనకు విశ్వాసం పూర్తిగా పోయింది. ఆయన జాతీయ అహంభావంతో బయలుదేరి, పీడితవర్గాలు, పీడితజాతులు లేవదీసే విప్లవాలు తనకు ఇబ్బంది కలిగించవచ్చునని, తాను అందులో ఇరుక్కుపోవలసి వస్తుందని భయపడతారు. అందుచేత ఆయన ప్రతి విప్లవాన్ని అన్ని విధాల వ్యతిరేకించడానికి ప్రయత్నిస్తారు. కాంగో వ్యవహారంలోవలే ప్రజావిప్లవాన్ని అణయివేయడంలో అమెరికా సామ్రాజ్యవాదంతో కలిసి సంయుక్తచర్య తీసుకొనడానికి వెనుదీయడం లేదు. ఈ విధంగా చేయడం ద్వారా తాను ప్రమాదాల నుండి తప్పించుకోగలనని ఆయన భావిస్తారు. ఇదే సందర్భంలో ప్రపంచాన్ని విభజించి, పెత్తనం చెలాయించడానికై అమెరికా సామ్రాజ్యవాదంతో కలిసి కుట్ర చేస్తారు. ఈ విధంగా ఒక్కదెబ్బతోనే రెండు పిట్టలను పడగొడుతున్నారు. చరిత్రలో కృశ్చేవ్‌ను మించిన లొంగుబాటుదారుడు మరొకరు లేరనే ఇదంతా నిరూపిస్తున్నది. కృశ్చేవ్ హానికరమైన విధానం అమలు జరగడమంటే, అది మహా సోవియట్ యూనియన్‌కే తప్పనిసరిగా తీరని నష్టం కలిగిస్తుంది.

దశాబ్దాల చరిత్రగల సోవియట్ యూనియన్‌లో, ఒక సోషలిస్టు దేశంలో కృశ్చేవ్ రివిజనిజం ఎందుకు అవతరించింది? వాస్తవంలో ఇది వింత ఏమీ కాదు. ప్రతి సోషలిస్టు దేశంలోను, సోషలిజమూ, పెట్టుబడిదారీ విధానమూ–ఇందులో ఏది దేనిని జయిస్తుందనే సమస్య సుదీర్ఘ చారిత్రక దశలో మాత్రమే క్రమేణా పరిష్కారం కాగలదు. పెట్టుబడిదారీ శక్తులు ఉన్నంతకాలం, సమాజంలో వర్గాలు ఉన్నంతకాలం రివిజనిజం పెంపొందటానికి అవకాశం ఉంది.

సోవియట్ యూనియన్‌లో వర్గాలు రద్దు అయినాయని, పెట్టుబడిదారీ పునరుద్ధరణ ప్రమాదమనేది ఏ మాత్రమూ లేదని, కమ్యూనిజం నిర్మాణం అమలు జరుగుతున్నదని కృశ్చేవ్ ఘంటాపథంగా చెబుతారు. ఈ ఘంటా పథాలన్నీ అబద్ధాలు.

వాస్తవంలో, కృశ్చేవ్ రివిజనిస్టు పాలననుబట్టి, సోవియట్ ప్రభుత్వం తన స్వభావాన్ని మార్చుకొన్నదని, అది ఇక శ్రామికవర్గ నియంతృత్వంగా ఉండబోదని బహిరంగంగా చేసిన ప్రకటననుబట్టి జాతీయంగా, అంతర్జాతీయంగా అనేక తప్పుడు విధానాలను అమలు జరపడాన్నిబట్టి సోవియట్ సమాజంలో పెట్టుబడిదారి శక్తులు, రాజకీయ, ఆర్థిక, సంస్కృతిక, సిద్ధాంత రంగాలతో సహా, సోవియట్ యూనియన్‌లో అన్ని జీవిత రంగాలను ముంచెత్తే స్థితిలో ఉన్నాయని స్పష్టమౌతుంది. కృశ్చేవ్ రివిజనిజానికి సామాజికంగా ఊతం ఎలా లభించిందంటే సోవియట్ యూనియన్‌లో నిరంతరాయంగా వ్యాపిస్తున్న పెట్టుబడిదారీ శక్తులనుండే అది లభించింది.

కృశ్చేవ్ రివిజనిజం ఈ పెట్టుబడిదారీ శక్తులకు ప్రాతినిధ్యం వహిస్తుంది. వీటికి తోడ్పడుతుంది. అందుచేత ఇది సోవియట్ ప్రజలకు కమ్యూనిజాన్ని ఎన్నటికీ తీసుకురాదు. పై పెచ్చు సోషలిజం ఫలితాలు దక్కకుండా ఇది తీవ్రంగా అడ్డుకొంటున్నది. పెట్టుబడిదారీ విధాన పునరుద్ధరణకు తలుపులు తెరుస్తున్నది. అమెరికా సామ్రాజ్యవాదం కోరిన "శాంతియుత పరిణామ"పంథా ఇదే.

పెట్టుబడిదారీ విధానం నుండి సోషలిజానికి పరివర్తన అసంభవమని శ్రామికవర్గ నియంతృత్వ చరిత్ర యావత్తూ ఉద్ఘోషిస్తున్నది. అయినప్పటికీ పెట్టుబడిదారీ విధానంలోకి సోషలిజం "శాంతియుతంగా పరిణామం" చెందడానికి యుగోస్లావ్ దృష్టాంతం మన ముందు ఉంది. ఇప్పుడు కృశ్చేవ్ రివిజనిజం సోవియట్ యూనియన్‌ను ఈ పంథాలో నడిపిస్తున్నది.

శ్రామికవర్గ నియంతృత్వ చరిత్రలో ఇది తీవ్రాతి తీవ్రమైన గుణపాఠం. మార్క్సిస్టు -లెనినిస్టులందరూ, విప్లవకారులందరూ, భవిష్యత్‌లో వచ్చే తరాల వారందరు ఈ గొప్ప గుణపాఠాన్ని ఏ పరిస్థితుల్లోను విస్మరించకూడదు.

## మా విశ్వాసం

సోవియట్ కమ్యూనిస్టుపార్టీ 20వ మహాసభ జరిగి ఎనిమిదేళ్ళ గడిచింది. ఈ అతి స్వల్పకాలంలో కృశ్చేవ్ రివిజనిజం సోవియట్ యూనియన్‌కు, అంతర్జాతీయ శ్రామికవర్గ విప్లవాశయానికి చాలా పెద్ద, తీవ్రమైన నష్టం కలిగించింది.

కృశ్చేవ్ రివిజనిజాన్ని తిరస్కరించడానికి, రూపుమాపడానికి, ఇది తరుణం, ఇప్పటికే కాలాతీతమైంది.

ఇక్కడ, మేము సోవియట్ కమ్యూనిస్టుపార్టీలో నాయకత్వం వహిస్తున్న కామ్రేడ్స్‌కు ఒక చిన్న సలహా ఇస్తాం. ఎంతోమంది అవకాశవాదులు, రివిజనిస్టులు చరిత్రయొక్క చెత్తపోగులోకి త్రోసివేయబడ్డారు. వారి ఆదర్శాన్నే అనుసరించాలనే పట్టుదల మీకెందుకు?

ఇక్కడ రివిజనిస్టు తప్పులు చేసిన ఇతర సోదరపార్టీలలోని ముఖ్య కామ్రేడ్స్ ఈ క్రింది విషయాన్ని గూర్చి ఆలోచించగలరని కూడా మేము ఆశిస్తున్నాం. సోవియట్ కమ్యూనిస్టు నాయకుల పంథాను అనుసరించడం ద్వారా వారు ఏమి లాభం పొందారు? రివిజనిస్టు ఊబిలోకి బాగా కూరుకుపోయినవారు మినహా, చాలా మంది కామ్రేడ్స్ గందరగోళపడ్డారని, మోసగించబడ్డారని లేదా గత్యంతరంలేక తప్పుమార్గం తొక్కారని మేము అర్థం చేసుకొంటున్నాం. శ్రామికవర్గ విప్లవకారులైన వారందరూ తుదకు విప్లవపంథాను ఎన్నుకొని, విప్లవ వ్యతిరేక పంథాను నిరాకరిస్తారని, తుదకు మార్క్సిజం-లెనినిజాన్ని ఎన్నుకొని రివిజనిజాన్ని నిరాకరిస్తారని మా నమ్మకం. ఈ విషయంలో మేము చాలా పెద్ద ఆశలు పెట్టుకున్నాం.

రివిజనిజం ఎన్నటికీ చరిత్ర భ్రమణాన్ని, విప్లవ భ్రమణాన్ని ఆపివేయజాలదు. వారెలాగూ విప్లవం లేవదీయని రివిజనిస్టు నాయకులు, నిజమైన మార్క్సిస్టులు, విప్లవ ప్రజలను విప్లవం లేవదీయకుండా ఎన్నటికీ అడ్డుకోజాలరు. 'శ్రామికవర్గ విప్లవం-విద్రోహి కాట్స్కీ'లో లెనిన్ ఇలా అన్నాడు. "కాట్స్కీ విద్రోహిగా తయారయిన తర్వాత జర్మన్ మార్క్సిస్టు లేట్‌నెట్ శ్రామికవర్గానికి ఈ దిగువ విధంగా మాత్రమే విజ్ఞప్తి చేయగలిగాడు. 'ఇలాంటి నాయకులను' ప్రక్కకు నెట్టివేయండి. నిష్ప్రయోజనమైన, నిరర్థకమైన వారి ప్రచారం నుండి విముక్తి పొందండి. "వారు ఉన్నా సరే, లేకపోయినా సరే" విప్లవం లేవదీయండి. వారి తలలమీదుగానే విప్లవంవైపు పురోగమించండి."

రెండో ఇంటర్నేషల్ తాలూకు రివిజనిజం యూరప్‌లోని అనేక పార్టీలలో పాదుకుపోయినప్పుడు, ఫ్రెంచి కమ్యూనిస్టు పాల్‌గోలే దృక్పథాలకు లెనిన్ చాలా ప్రాముఖ్యత ఇచ్చాడు.

గోలే ఇలా చెప్పాడు-

"మన శత్రువులు సోషలిజం యొక్క దివాళాకోరుతనాన్ని గూర్చి నోరు చించుకొని మాట్లాడారు. అది చాలా తొందరపాటే అనిపించుకొంటుంది. అయినప్పటికీ వారు చెప్పినమాట పూర్తిగా తప్పు అని ఘంటాపథంగా చెప్పడానికి ఎవరు సాహసిస్తారు? ప్రస్తుతం చచ్చిపోతున్నది సోషలిజం కానేకాదు. అది వేరే విధమైన సోషలిజం-సిద్ధాంత బలంలేని, సాధనా వాంఛలేని తియ్యని సోషలిజం, బొజ్జ దిగిన అధికార పద్ధతులలో, పుట్టెడు సంతానం గల తండ్రి పద్ధతులతో ఉన్న సోషలిజం. ధైర్యంకాని, ప్రగాఢమైన ఉత్సాహంగాని లేని సోషలిజం. పెట్టుబడిదారీ విధానంతో స్నేహపూర్వక వాదనలలో మునిగితేలుతూ లెక్కలు వల్లించే సోషలిజం. సంస్కరణలతో ముందే పూర్తిగా నిమగ్నమై గుక్కెడు గంజికోసం తన జన్మహక్కును అమ్ముకొన్న సోషలిజం. బూర్జువాల దృష్టిలో ప్రజలను జోకొట్టే శ్రామికవర్గ సాహసానికి బ్రేకువేసే సోషలిజం.

ఎంత అద్భుతమైన వర్ణన ఇది, ఫ్రెంచి కమ్యూనిస్టు యొక్క చిత్తశుద్ధితో కూడిన వాణి అని లెనిన్ చెప్పాడు. ఆధునిక రివిజనిజం చచ్చిపోతున్న "సోషలిజం వంటిదే" కాదా? అని ప్రజలు ఇప్పుడు అడుగుతారు. రివిజనిజం ఆధిక్యత వహించిన పార్టీల లోపల అసంఖ్యాక కమ్యూనిస్టుల చిత్తశుద్ధితో కూడిన కంఠాలు మారుమ్రోగడం వారు త్వరలోనే వింటారు.

దగాకోరు సోషలిజం నశించుతుంది. శాస్త్రీయ సోషలిజం జవసత్వాలతో ముందుకు చీల్చుకుంటూ గతంలో ఎన్నడూ లేనంత విస్తృతంగా పురోగమిస్తుంది. శక్తివంతమైన విప్లవకర సోషలిజం అన్ని ఇబ్బందులనూ, ఆటంకాలనూ అధిగమించి, ప్రపంచమంతటా విజయం సాధించేవరకూ అడుగు అడుగు ముందుకువేస్తూ నడక సాగిస్తుంది.

మార్క్స్, ఎంగెల్సు రచించిన 'కమ్యూనిస్టు ప్రణాళిక'లోని చివరి వాక్యాలతో ఈ వ్యాసాన్ని ముగిద్దాం.

''కమ్యూనిస్టులు తమ అభిప్రాయాలనూ, లక్ష్యాలనూ దాచుకోనవసరం లేదు. నేడున్నటువంటి సాంఘిక పరిస్థితులనన్నింటినీ బలవంతాన కూలద్రోయడం ద్వారానే తమ లక్ష్యాల సాధన జరుగుతుందని వారు బహిరంగంగా ప్రకటిస్తారు. కమ్యూనిస్టు విప్లవాన్ని చూసి పాలకవర్గాలను వణకనివ్వండి. కార్మికవర్గానికి పోయేదేమి లేదు. సంకెళ్ళు తప్ప. వారు జయించడానికి ప్రపంచమే ఉంది."

"ప్రపంచ శ్రామికులారా ఐక్యం కండి." ●

పత్రికా ప్రకటన

# భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు)

# కేంద్ర కమిటీ

**పత్రికా ప్రకటన**

**సెప్టెంబర్ 24, 2018**

**విశాఖ మన్యంలో మైనింగ్ మాఫియా నాయకులు, అధికార పార్టీ టి.డి.పి ఎమ్.ఎల్.ఎ. కిడారి సర్వేశ్వర్రావును, టి.డి.పి. మాజీ ఎమ్.ఎల్.ఎ. సీవేరి సోమాలను ప్రజల తీర్పుకనుగుణంగా ఖతం చేసిన మా పి.ఎల్.జి.ఎ.కు జేజేలు!**

**బహుళజాతి సంస్థలకు దళారులుగా పని చేస్తూ, ప్రజలకు, పర్యావరణానికి శత్రువులుగా మారిన వారికి ఇదే గతి పడుతుంది!**

విశాఖ మన్యంలోని ఖనిజ సంపదపై కన్నేసిన బహుళజాతి సంస్థలు, తమకు దళారీలైన ఈ దేశ పాలక వర్గాల దన్నుతో విచ్చలవిడిగా తవ్వకాలు చేస్తూ, విధ్వంసం సృష్టిస్తూ, లక్షలాది మంది ఆదివాసీ ప్రజలను, పీడిత ప్రజలను విస్థాపితులను గావిస్తున్నారు. విశాఖ మన్యంలో బాక్సైట్, లాటరైట్, చైనాక్లే తదితర ఖనిజ సంపదను సామ్రాజ్యవాదులకు దోచిపెట్టేందుకు గతం నుండి అధికారంలో వున్న దోపిడీ ప్రభుత్వాలు అనేక ఎమ్.ఒ.యులు కుదుర్చుకుంటూ వచ్చాయి. ఈ ఒప్పందాలను వ్యతిరేకిస్తూ, మా పార్టీ, సి.పి.ఐ మావోయిస్టు నాయకత్వంలో ఆదివాసులు, పీడిత ప్రజలు జల్, జంగల్, జమీన్, అధికారం కోసం పోరాడుతున్నారు. కార్పొరేట్ సంస్థల ప్రవేశాన్ని అడ్డుకుంటూ, మిలిటెంట్ ప్రజా ఉద్యమాలను నిర్మిస్తున్నారు. గతంలో చంద్రబాబు ప్రభుత్వం మన్యంలో బాక్సైట్ తవ్వకాలకు అనుమతినిస్తూ, ఆన్‌రాక్ కార్పొరేట్ సంస్థతో ఒప్పందం కుదుర్చుకుంది. ఈ ఒప్పందానికి వ్యతిరేకంగా మా పార్టీ నాయకత్వంలో ప్రజలు నిర్వహించిన మిలిటెంట్ పోరాటానికి తలొగ్గిన టి.డి.పి ప్రభుత్వం, ఆ ఒప్పందాన్ని రద్దు చేసుకున్నది. ఈ పరిస్థితులలో ప్రభుత్వం తాత్కాలికంగా జి.ఒ 97ను వెనక్కి తీసుకోక తప్పలేదు.

చంద్రబాబు ప్రభుత్వం మా పార్టీని దెబ్బతీసి, ఆదివాసీ ప్రజలకు నాయకత్వం అందకుండా చేయడానికీ, మన్యంలో 100 పోలీస్ ఔట్‌పోస్టుల స్థాపనకు కేంద్రానికి ప్రతిపాదనలు పంపింది. దాడిని మరింత తీవ్రతరం చేసింది. ఆదివాసీ ప్రజల పోరాట ఐక్యతను, సంఘటిత శక్తిని విచ్ఛిన్నం చేసే కుట్రలకు తెర లేపింది. అందుకు ఆదివాసీ ప్రజలలో కొందరు తెగ పెద్దలను, పెటీ బూర్జువాలో ఒక సెక్షన్‌ను ఆర్థిక ప్రలోభాలకు గురి చేసి, తమకు దళారులుగా మార్చుకున్నది. వీరు దోపిడీ ప్రభుత్వాల నుండీ, కార్పొరేట్ సంస్థల నుండి రకరకాలుగా లబ్ది పొందుతూ, కార్పొరేట్ సంస్థల ప్రయోజనాలకనుగుణంగా అసత్య ప్రచారంతో ప్రజలను పక్కదారి పట్టిస్తున్నారు. ఇటువంటి దళారీ గుంపుకు చెందినవారే కిడారి సర్వేశ్వర్రావు, సీవేరి సోమాలు.

కిడారి సర్వేశ్వర్రావు ఆదివాసీ వాల్మికి తెగలో మధ్యతరగతికి చెందినవాడు. ఇతను ఉత్పత్తి కార్యకలాపాలకు దూరంగా వుంటూ, దళారీ పనులు చేయడంలో దిట్టగా గుర్తింపు పొందాడు. క్రమంగా ఇతను అగ్రకుల ఆదివాసేతర భూస్వామ్య, వ్యాపార, పారిశ్రామిక వర్గాలకు ఆదివాసీ బినామీగా మారి, వారి క్వారీలకు యజమానిగా అవతారమెత్తి లక్షల రూపాయలు సంపాదించాడు. పాలక వర్గాల దృష్టిని ఆకర్షించాడు. మొదట కాంగ్రెస్‌లో చేరాడు. ఆ తర్వాత వై.ఎస్.ఆర్.సి.పిలో ఎమ్.ఎల్.సిగా ఎదిగాడు. 2014లో అరకు నియోజకవర్గం నుండి వై.ఎస్.ఆర్.సి.పి తరపున ఎమ్.ఎల్.ఎగా పోటీ చేసి గెలుపొందాడు. తనకొచ్చిన అధికారాన్ని అడ్డు పెట్టుకొని, క్రమంగా తన సొంత మైనింగ్ కార్యకలాపాలను మన్యంలో మరింత విస్తరింపజేసి కోట్లు గడించాడు. ఆ తర్వాత అక్రమంగా పోగేసుకున్న తన ఆస్తులను కాపాడుకోవడానికి ప్లేటు ఫిరాయించి అధికార టి.డి.పి పార్టీలో చేరాడు. ఈ సందర్భంగా చంద్రబాబుతో కుదిరిన ఒప్పందంలో మంత్రి పదవి కన్నా, మైనింగ్ విస్తరణకు ప్రభుత్వం ఇచ్చే మద్దతుకే ప్రాధాన్యతనిచ్చాడు. ఈ క్రమంలోనే చంద్రబాబుకు నమ్మకమైన ఏజెంటుగా మారి, బాక్సైట్ తవ్వకాలకు మద్దతునందించాడు. చంద్రబాబు కూడా మన్యంలో సర్వేశ్వర్రావుపై ఆధారపడుతూ, తనకు వ్యతిరేకంగా మారుతున్న ఆదివాసీ ప్రజల సంఘటిత ఉద్యమాన్ని దెబ్బతీసేందుకు సర్వేశ్వర్రావు ద్వారా తన సామాజిక గ్రూపు అయిన వాల్మికి తెగ ప్రజలను, మొత్తం ఆదివాసీ సమూహం నుండి విడదీసేందుకు కుట్రలు చేయించాడు. ఈ విధంగా సర్వేశ్వర్రావు పాలకవర్గాలకు నమ్మకమైన, సమర్థుడైన సేవకుడుగానే కాకుండా, ప్రజా వ్యతిరేకిగా మారి, తన మైనింగ్‌ను విస్తరించుకుంటూ, అనేక మంది లుంపెన్ యువకులకు జీతాలిస్తూ, వారిని తమ ప్రైవేటు సేనగా మలుచుకొని, తన అక్రమ తవ్వకాలకు

అడ్డు వచ్చిన ప్రజలపై దుర్మార్గంగా దాడులు చేస్తూ, ప్రభుత్వ మద్దతుతో మైనింగ్ మాఫియాగా అవతారమెత్తాడు. ఇతడి మైనింగ్ మాఫియా కార్యకలాపాలను ఖండిస్తూ, మా పార్టీ గతంలో కూడా హెచ్చరికలు చేసింది. అయినా అతడు తన మాఫియా కార్యకలాపాలను ఏ మాత్రం తగ్గించుకోకుండా, మరింత తీవ్రతరం చేసాడు.

సివేరి సోమ డుంబ్రిగూడ మండలానికి చెందిన ఆదివాసీ కొండదొర తెగకు చెందినవాడు. ఇతను కూడా పాలకవర్గ దళారీగా ఎదిగి, 2009లో టి.డి.పి ఎమ్.ఎల్.ఎగా గెలుపొందాడు. 2014 అసెంబ్లీ ఎన్నికలలో అరకు నుండి పోటీ చేసి, సర్వేశ్వర్రావు (వై.ఎస్.ఆర్.సి.పి) చేతిలో ఓడిపోయాడు. అయినప్పటికీ, ఇతడికి చంద్రబాబు ప్రభుత్వం అధికార టి.డి.పి ఎస్.టి.సెల్ రాష్ట్ర నాయకుడిగా, అరకు నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జ్‌గా బాధ్యతలిచ్చాడు. ఈ క్రమంలోనే ఇతడు కూడా అనేక క్వారీలకు యజమానిగా మారాడు. మన్యంలో బాక్సైట్ తవ్వకాలకు వ్యతిరేకంగా జరుగుతున్న విశాల ప్రజా పోరాటాన్ని వ్యతిరేకిస్తూ, బహుళజాతి సంస్థకు గట్టి మద్దతుదారుడిగా నిలబడ్డాడు. డుంబ్రిగూడ మండలంలో 'చైనాక్లే' తవ్వకాలకు అనుకూలంగా దళారీగా వ్యవహరించడంతో, ఆ ప్రాంత ప్రజలు సోమాను రాళ్ళు, చెప్పులతో తన్ని తరిమారు. ప్రజల ప్రతిఘటనతో చైనాక్లే తవ్వకాలు నిలిచిపోయాయి. అప్పటినుండి ప్రభుత్వం కల్పించిన పోలీసు రక్షణలో తిరుగుతున్నాడు.

సర్వేశ్వర్రావు వై.ఎస్.ఆర్.సి.పి నుండి, టి.డి.పిలో చేరినప్పటినుండి ఈ ఇద్దరు తోడు దొంగలుగా మారి, కార్పొరేట్ సంస్థలకూ, గిరిజనేతర దోపిడీ వర్గాలకు నమ్మకమైన ఏజెంట్లుగా మారారు. వీరు తమ సామాజిక సెక్షన్ ప్రజలలో కొందరిని మొత్తం ఆదివాసీ సమాజం నుండి విడదీసి, ఆదివాసీ ఐక్యతను దెబ్బ తీసేందుకు ప్రయత్నించారు. తాము విడదీస్తున్న ప్రజలను మొత్తం ఆదివాసీ ప్రజానీకానికి వ్యతిరేకంగానూ, దోపిడీ పాలకవర్గాలకు, అక్రమ మైనింగ్‌కు అనుకూలంగానూ మలిచేందుకు వారిని రకరకాల ప్రలోభాలకు గురి చేశారు. దోపిడీ వర్గాలకు పీడిత ప్రజల నుండి ఒక బలమైన సామాజిక పునాదిని ఏర్పాటు చేసేందుకు ప్రయత్నించారు. టి.డి.పి ప్రభుత్వం బోయ వాల్మీకి (మైదాన ప్రాంత బి.సి)లను ఆదివాసీల్లో చేర్చాలని చేసిన ప్రతిపాదనను ఆదివాసీ సమాజమంతా ముక్తకంఠంతో వ్యతిరేకిస్తుంటే, వీరు మాత్రం తమ ప్రభుత్వ వైఖరిని సమర్థించుకుంటూ, మొత్తం ఆదివాసీ ప్రజలకు వ్యతిరేకంగా నిలబడ్డారు. వీరు మరోవైపు మన్యంలో విప్లవోద్యమాన్ని దెబ్బ తీసేందుకు చంద్రబాబు ప్రభుత్వం అమలు చేస్తున్న కుట్రలలో భాగంగా, సాయుధ పోలీసుల రక్షణలో ఉద్యమం బలంగా వున్న గ్రామాలలో ప్రభుత్వ బూటకపు సంస్కరణలను అమలు పరుస్తూ, ప్రజలను పోరాటాల నుండి పక్కదారి పట్టించడం, భయోత్పాతానికి గురి చేయడం వంటి ప్రతిఘాతుక చర్యలకు పూనుకుంటున్నారు.

గత కొంత కాలంగా వీరి మైనింగ్ మాఫియా కార్యకలాపాలకు వ్యతిరేకంగా పార్టీ ప్రజలలో ప్రచారం చేస్తూ వచ్చింది. వీరికి వ్యతిరేకంగా ప్రజలు చేస్తున్న పోరాటానికి మద్దతునిస్తూ వచ్చింది. కొన్ని చోట్ల తమ ప్రజా సంఘాల ద్వారా నాయకత్వం వహించింది. అయినప్పటికీ ప్రభుత్వ సాయుధ బలగాల అండదండలతో వీరి కార్యకలాపాలు విస్తరిస్తూ వచ్చాయి. ఈ పరిస్థితుల్లో మన్యంలోని ఆదివాసీ ప్రజల మనుగడ కోసం, ప్రయోజనాల కోసం, వారి తీర్పుకనుగుణంగా మా పి.ఎల్.జి.ఎ వీరిద్దరిని మట్టుపెట్టింది. వారికి రక్షణగా వున్న పోలీసులు లొంగిరావడంతో, వారికి ఎటువంటి హాని కలిగించకుండా తుపాకులు స్వాధీనం చేసుకొని వదిలివేసింది.

నేడు ప్రజావ్యతిరేకులైన ఇటువంటి దళారీల, భూస్వాముల, బడా పెట్టుబడిదారుల సంపద పెరగటాన్నే దేశ అభివృద్ధిగా, జి.డి.పి అభివృద్ధిగా పాలకపార్టీలు ఊదరగొడ్తున్నాయి. 'దేశమంటే ప్రజలు' అనే నానుడి పోయి నేడు 'దేశమంటే భూస్వాములు, దళారీ నిరంకుశ పెట్టుబడిదారులు, భూ మాఫియా, లిక్కర్ మాఫియా, మైనింగ్ మాఫియా, రౌడీలు, చీటర్లు'గా మారారు. వీళ్ళే పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికలలో నెగ్గి, 'ప్రజా ప్రతినిధులు'గా 'అభివృద్ధి కాముకులు'గా 'దేశ రక్షకులు'గా అవతారమెత్తుతున్నారు. వాస్తవంగా వీళ్ళు దేశ ప్రయోజనాలను సామ్రాజ్యవాదులకు తాకట్టు పెడ్తూ, తమ బొక్కసాలు నింపుకుంటూ, ప్రజా శత్రువులుగా, దేశ ద్రోహులుగా ఈ దేశ అభివృద్ధిని కుంటుపరుస్తున్నారు. దేశంలో ప్రజాస్వామిక విప్లవాన్ని అడ్డుకుంటున్నారు.

వీరు నేడు తెలంగాణలో ముఖ్యంగా టి.ఆర్.ఎస్ ముసుగులోనూ, బి.జె.పి, కాంగ్రెస్, టి.డి.పి ముసుగులలోనూ, ఎన్నికల బరిలోకి దిగి, ప్రజల ముందుకు వస్తున్నారు. ఈ సందర్భంగానే, ఎన్నికల గోదాలోకి దిగిన వామపక్షాలు, దేశంలో యధాతథ స్థితిని నిలబెట్టేందుకు శక్తి వంచన లేకుండా కృషి చేస్తున్నాయి. ఈ పార్లమెంటరీ పార్టీల ముసుగులో వుంటున్న ఈ దోపిడీదారుల, దేశద్రోహుల, ప్రజా వ్యతిరేకుల అసలు అవతారాన్ని ప్రజలు తప్పకుండా గ్రహించి, ఎ.ఒ.బిలో సర్వేశ్వర్రావు, సోమాలకు పట్టిన గతినే పట్టిస్తారు. నేడు దేశంలో ముఖ్యంగా తెలంగాణ రాష్ట్రంలో సర్వ సంపదలను సామ్రాజ్యవాదులకు ధారాదత్తం చేస్తూ, ప్రజలపై బ్రాహ్మణీయ హిందూ ఫాసిజాన్ని అమలు చేస్తున్న కీలకమైన టి.ఆర్.ఎస్, బి.జె.పి నేతలకు మా పార్టీ నేతృత్వంలో ప్రజలు తప్పక తగిన శాస్తి చేస్తారు.

నేడు తెలంగాణలో తిరిగి అసెంబ్లీ ఎన్నికలు ముందుకు వచ్చాయి. ఈ సందర్భంగా ఈ దోపిడీదారులంతా, ప్రజలపై దోపిడీ, పీడనలను కొనసాగించే సాధికారతను పొందేందుకు ప్రజల ముందుకు వస్తున్నారు. ప్రజల తీర్పును కోరుతున్నారు. కనుక నేడు ప్రజల ముందుకు వచ్చిన బూటకపు ఎన్నికలను బహిష్కరిస్తూ, దేశంలో నూతన ప్రజాస్వామిక విప్లవాన్ని విజయవంతం చేసేందుకు ప్రజాయుద్ధంలోకి రావలసిందిగా ప్రజలకు పిలుపునిస్తున్నాం. ఈ

సందర్భంగా ఎన్నికల ప్రచారానికి వచ్చే టి.ఆర్.ఎస్, బి.జె.పి నాయకులను తన్ని తరమండి. కాంగ్రెస్, టి.డి.పి వామపక్షాలు తదితర పార్టీలను వారి ప్రజా వ్యతిరేక స్వభావాన్ని ఎత్తి చూపుతూ నిలేయండి.

సర్వేశ్వర్రావు, సోమలాంటి దుష్ట ప్రజా వ్యతిరేక పార్లమెంటరీ వ్యవస్థ ప్రతినిధులు ఎ.పి., తెలంగాణలలోనే కాదు, నేడు దేశ వ్యాప్తంగా అనేక మంది వున్నారు. నానా మోసాలు చేసి విధానసభ, లోక్‌సభలకు ఎన్నికవుతూ దేశ వనరులను కొల్లగొట్టడంలో, ఘరానా కార్పొరేట్ వర్గాలకు దళారీలుగా వ్యవహరించడంలో దేశ ద్రోహ, ప్రజా వ్యతిరేక శక్తులుగా ముందుకు వస్తూ 'ఖద్దర్-కాషాయ' నాయకులుగా అవతారమెత్తుతున్నారు. ఇలాంటి శక్తులకు ప్రజలు ఎన్నికలలో గట్టి బుద్ధి చెప్పాలి. ప్రజా తీర్పునను సరించి ఇలాంటి శక్తులను కఠినంగా శిక్షించాలి.

గత 15 ఏళ్ళలో దళారీ పాలకవర్గాలు దేశంలో ఆంధ్రప్రదేశ్, ఝార్ఖండ్, ఛత్తీస్‌గఢ్, ఒడిశా, మహారాష్ట్ర, తెలంగాణ, పశ్చిమ బంగ్, తమిళనాడు, కేరళ తదితర రాష్ట్రాలలో ప్రకృతి వనరులను, అడవులను భారీ కార్పొరేట్ వర్గాలకు ఎలా ధారాదత్తం చేస్తూ వచ్చాయో అందరికీ తెలిసిందే. విధానసభ, లోక్‌సభలకు ఆదివాసీ ప్రాంత ప్రతినిధులుగా అవతారమెత్తిన లేదా ఆ పరుగుపందెంలో నిల్చిన వారెవరైనా వాస్తవంగా ప్రజా వ్యతిరేకులే. అలాంటి వారినెవరినీ ప్రజలు, ప్రజాసైన్యం-పి.ఎల్.జి.ఎ ఎప్పటికీ క్షమించదని సర్వేశ్వర్రావు, సోమల శిక్షలు మరోసారి స్పష్టం చేస్తున్నవి. సామ్రాజ్యవాద బహుళజాతి కంపెనీల ప్రయోజనాలను ఈడేర్చే దళారీ పాలకవర్గాలకు ప్రాతినిధ్యం వహించే పార్లమెంటరీ పార్టీలు, వాటి నాయకులు దేశవ్యాప్తంగా ఆదివాసుల అస్తిత్వానికి, జీవికకు పెనుముప్పుగా పరిణమించారు. మా పార్టీ సిపిఐ (మావోయిస్టు) ఇటువంటి దళారీ పార్టీలను, నాయకులను తన్ని తరమాల్సిందిగా, ఆ పార్టీల నాయకత్వంలోని దళారీ ప్రభుత్వాలకు వ్యతిరేకంగా మిలిటెంటు ప్రజా ఉద్యమాలు నిర్మించాల్సిందిగా దేశ పీడిత ప్రజలకు పిలుపునిస్తుంది.



**అభయ్**
**అధికార ప్రతినిధి**
**కేంద్ర కమిటీ**
**భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు)**

---

**11వ పేజీ తరువాయి భాగం...**

ఒక విధాన నిర్ణయం చేసింది. దాని అమలులో భాగంగానే ఎ.ఒ.బి ప్రాంతంలో అధికార పార్టీలో ఉంటూ, ప్రజలకు అత్యంత పీడకులుగా, ద్రోహులుగా ఎవరెవరు ఉన్నరనేది పరిశీలించి, దానిలో ముఖ్యులైన కిడారి సర్వేశ్వరరావు, సివేరి సోమలను ఎన్నుకోవటమైంది. అవకాశాన్ని చూసి వీరిని దెబ్బతీయాలనే ప్రయత్నంలో పార్టీ వీరి కదలికలు, కార్యక్రమాలపై నిఘా పెట్టింది. గ్రామదర్శిని - గ్రామవికాసం పేరుతో వీరు నిర్వహిస్తున్న మోసపూరిత కార్యకలాపాలు మాకు ఈ సందర్భంగా కలిసి వచ్చాయి. గత 2 నెలలుగా వీరిని టార్గెట్ చేయడంకోసం జరిగిన మా ప్రయత్నం చిట్టచివరికి సెప్టెంబర్ 23న విజయవంతమైంది.

ఈ ఘటనతో ఖంగుతిన్న రాష్ట్ర ప్రభుత్వం కల్లు తాగిన కోతిలా కదంతొక్కింది. లివిటిపుట్ ఘటన ప్రభుత్వానికి ఒక హెచ్చరిక. "దీన్ని తీవ్రంగా పరిగణిస్తున్నాం. ఇది చిన్న విషయం కాదు. మవోయిస్టులపై ప్రతీకారం తీర్చుకుంటాం. దెబ్బకు దెబ్బ తీసి, గట్టి సమాధానం చెబుతాం'' అంటూ కిరాయి సాయుధ బలగాల్నంతా ఉసిగొల్పి, అనువణువున జల్లెడ పట్టారు. ఇప్పటికీ పడుతున్నారు.

ఇక్కడ ముఖ్యంగా ప్రస్తావించాల్సిన విషయం ఏమిటంటే, దేశంలో అత్యంత తక్కువ శాతంగా వున్న దోపిడీ పాలక వర్గాలూ, వారి రాజ్యాంగయంత్రం మెజారిటీగా వున్నా, పీడిత ప్రజలకు వ్యతిరేకమైనవే. ప్రజల మద్దతును పొందడం వారికి అసాధ్యం. పి.ఎల్.జి.ఎ చేతుల్లో మట్టి కరిచిన ప్రజా శతృవులంతా ప్రజలకు వ్యతిరేకులు కాబట్టి, వారి బలహీనతల్ని, కదలికల్ని ఆఖరి నిమిషం వరకూ పార్టీకి, పి.ఎల్.జి.ఎకి తెలియజేస్తూ, వాళ్ళని నిర్మూలించడంలో ప్రజలు అన్ని విధాల సహకరించారు.

ఆపరేషన్ కిడారి మునుపుగానీ, తదుపరిగానీ ఈ దోపిడీ ప్రభుత్వం వారి కిరాయి బలగాలు ఎన్ని మాయోపాయాలు పన్నినా, ఎన్ని కూంబింగ్‌లు నిర్వహించినా పార్టీని, ప్రజాసైన్యాన్ని ప్రజలు కంటికి రెప్పలా కాపాడారు. అది నేటి వార్తమానమే కాదు. రేపటి వాస్తవం కూడా అనేది ఇప్పటికే అనేకమార్లు చరిత్ర ఋజువు చేసింది. దోపిడీ వర్గాలు సామ్రాజ్యవాదులతో సహా, వాళ్ళు ఎంత భీకరంగా కనిపించినా వాస్తవానికి కాగితపు పులులే.

ఆపరేషన్ కిడారి విజయానికి ఆ ప్రాంతం అన్ని విధాలా ప్రత్యక్షంగానూ, పరోక్షంగానూ సహకరించిన శ్రేణులకూ, ప్రజలకూ ఈ సందర్భంగా మావోయిస్టు పార్టీ ఎ.ఒ.బి,ఎస్.జడ్.సి తరపున విప్లవాభివందనాలు తెలియజేస్తున్నాం.

రాబోయే ఎన్నికలలో మరోమారు ప్రజల్ని మోసగించడానికి ఓట్లపార్టీలన్ని ప్రజల వద్దకు వస్తాయి. భాతర పార్లమెంటరీ ప్రజాస్వామ్యం పచ్చి బూటకం. ఓట్లద్వారా ప్రజల బ్రతుకు మారదు. రాజ్యాధికార సాధనకై సాయుధులు కండి. ప్రజావిముక్తి గెరిల్లా సైన్యంలో చేరండి. ఓట్లకోసం వచ్చే టి.డి.పి, బి.జె.పి పార్టీలను తన్ని తరమండి. మిగిలిన పార్టీల ఓట్ల గారడీని నిలదీయండి. భూమి, భుక్తి, విముక్తి సాధనకోసం కొనసాగుతున్న ప్రజాయుద్ధంలో సమైక్యం కండి. ●



## వాళ్ళిప్పుడు హుందాగా తమ తలలు పైకెత్తి నిఠారుగా నిల్చున్నారు

# వాళ్ళే ప్రజా గెరిల్లాలు

అప్పుడప్పుడే ఊహ తెలుస్తున్న నాకు, నేను మేపే గొర్లతో అనుబంధం బాగా పెరిగిందని అర్థమవుతున్నది. గొర్ల కాపుకు ఇంట్లోవాళ్ళు చెబితే గానీ వెళ్ళేదాన్నికాదు. ఇప్పుడు మాత్రం పొద్దుఎక్కగానే నా పనులన్నీ ముగించుకొని, గొర్లను తోలుకుపోవడంలో నా తోటివాళ్ళలో నేనే ముందుంటున్న. ఎప్పుడూ ఆలస్యంగా వచ్చే నన్ను చూసి, నా తోటివాళ్ళు ఆటపట్టించేవాళ్ళు. ఇప్పుడు మాత్రం ఆశ్చర్యంగా చూస్తున్నారు. వాళ్ళ చూపులకు అర్థం నేను గమనించా. ఆ మరుసటి రోజు చెల్లికి బాగా జ్వరం. 10 రోజులు ఇంటిదగ్గరే ఉండాల్సివచ్చింది. గొర్లను ఇంటికి కూడా తేవడం లేదు. ఈ క్రమంలో ఇంట్లో వున్న కోళ్ళు, మల్లుపిట్టలు (నెమలిపిల్లలు), వారం రోజుల ముందు పుట్టిన మేక పిల్లలతో స్నేహం ఏర్పడింది. 10 రోజులు పది సంవత్సరాలుగా గడిచాయి. గొర్లను, తోటివాళ్ళను చూడాలనే ఆశ ఎక్కువైంది. ఆ తెల్లవారు కాపుకు వెళ్ళమని అమ్మ నోటి నుండి మాట రావడమే ఆలస్యం, ఇన్ని రోజులు బందీగా వున్న ఇంట్లో నుంచి గంతులేస్తూ పరుగెత్తా. అందరికన్నా ముందుగానే గొర్లతో కొండను చేరుకున్నా. తోటివాళ్ళు మాత్రం కొంత ఆలస్యంగా వచ్చారు. వచ్చినప్పటి నుండి దిగులుగా వుండటంతో పాటు, ఏమి మాట్లాడటం లేదు. కారణం అడిగా. "మన గుర్రం కాలుకి సీసం గుచ్చుకుని బాగా గాయమైంది" అని ఏడుస్తున్నట్లే చెప్పింది పూలే. క్షణ కాలంలో నా సంతోషమంతా ఆవిరైపోయింది. సాయంత్రానికి మేమే కాదు, దాని గాయాన్ని చూసి ఊరంతా బాధపడ్డారు. ప్రతిరోజు ఎవరో ఒకరు దానికి చెట్ల మందులతో కట్టుకడుతున్నారు. పూర్తిగా తగ్గడానికి 12 రోజులు పట్టింది. దాని గాయం నయమయ్యాక రంగులతో అలంకరించి, ఊరంతా తిప్పుతూ 'డాకా' (ఆదివాసీలు చేసే నృత్యం)తో సందడి చేశాం. అప్పుడప్పుడు పెద్దచెల్లి కోసం స్కూలుకి వెళ్ళి చూసి వస్తున్నా. నాకిష్టమైనప్పుడు నేనే వెళ్ళి మాస్టర్‌వాళ్ళని అడిగి కాసేపు చదువుకుంటున్నా. అయితే మాస్టర్లు రాని రోజులే ఎక్కువ కావడంతో అదే అదునుగా ఆడుకునేవాళ్ళం.

పొద్దుపోయాక పిల్లలందరం ఊరి మధ్యలో ఆడుకుంటుంటే నాకు మాత్రం వెళ్ళాలనిపించేదు. ఎందుకంటే వెళ్ళిన ప్రతిసారి ఎవరో ఒకరు నేను బాధపడేలా మాట్లాడేవారు. "అది మీ ఇల్లు కాదు, వాళ్ళు మీ అమ్మ, నాన్న కారు" అనేవాళ్ళు. కొన్నిసార్లు ఆటలోకి రానివ్వకుండా పక్కకుపెట్టేవాళ్ళు. రోజులు గడుస్తున్న కొద్ది వీళ్ళు నా వాళ్ళు కాదనీ, నేను మేపే గొర్లు కూడా నావి కావని .....ఈ విషయాలన్నీ నా మనస్సును మరింత వేదనకు గురిచేస్తున్నాయి. వీటికి తోడు ఇంట్లో కూడా తేడా గమనించసాగాను. చెల్లివాళ్ళను, నన్ను చూడటంలో బాగా తేడా వుంది. తినే తిండిలో, కట్టే బట్టలో వ్యత్యాసం. గొర్ల వెనక వెళ్ళినా కూడా ఈ విషయాలన్నీ వెంబడిస్తున్నాయి. రానన్నా బలవంతంగా ఓసారి ఆడుకోవడానికి తీసుకెళ్ళింది పూలే. నా రాకను గమనించిన మిత్రులు కొందరు జట్టుగా ఏకమై "రావద్దని నీకు ఎన్నిసార్లు చెప్పినా అర్థంకాదా! ఆటలో నీవైనా వుండాలి, మేమైనా వుండాలి" అంటూ కోపంగా మాట్లాడుతుంటే ఒక్క నిమిషం అక్కడ నిలబడలేదు. ఇంటికెళ్ళా, కోళ్ళగూడు దగ్గర ఏడుస్తూ కూర్చొని ఎప్పుడు నిద్రపోయానో తెల్లావారాక నాపైనుండి కోళ్ళు పరుగెత్తగానే మేల్కొన్నా. ఏం పని చేయలేదు, గొర్లను తీసుకెళ్ళే సమయం అవుతుంది. అలాగే కూర్చుండిపోయా. ఈ రోజు ఎలాగైనా నా గురించి తెలుసుకోవాల్సిందే అని నిర్ణయించుకున్న. అప్పటికీ 3, 4 సార్లు నా ముందు నుండి తిరుగుతూ "ఏం, పనిలోకి వెల్లడం లేదు, గొర్లకాపుకు టైం అవుతుంది, తొందరగా వెళ్ళు" అని వారు చెప్పాల్సింది చెబుతూ వెలుతున్నారు. నన్ను మాత్రం సమాధానం అడగటం లేదు. నేను ఏం మాట్లాడలేదు. అమ్మ, నాన్న పనుల్లోకి వెళ్ళడానికి సిద్ధమయ్యారు. ఎక్కడ పడుకున్నానో అక్కడ నుండి లేచా. వెలుతున్న వాళ్ళకు దగ్గరగా వెళ్ళా. వారి నడక ఆగింది. మాట్లాడటం ప్రారంభించా. 'నేను మీ బిడ్డను కానా, అసలు నేను ఎవరిని? ఊర్లో పిల్లలందరూ నన్నెందుకు మీ బిడ్డ కాదంటున్నారు?' నాకు చెప్పాకే వెళ్ళాలని మొండికేసా. నాన్న నోరు విప్పాడు. "నీకప్పుడు 2 సంవత్సరాలు. పక్కనే వున్న పై విధి మీది. మీ అమ్మ, నాన్న దూరపు బంధువులవుతారు, మాకు పనుల్లో సహకారంగా వుంటావనీ, చిన్నతనంలో అయితే ఇంటివాళ్ళను గుర్తుపెట్టుకోవనీ, నీకు ఊహ తెలియనప్పుడు మీ అమ్మ, నాన్నకు ధాన్యం ఇచ్చి తెచ్చుకున్నాం" అంటూ ముగించాడు. ఇక నాకు అక్కడ ఉండాలనిపించలేదు. 3, 4 అడుగులు వేసానో లేదో చిన్న చెల్లి అప్పుడప్పుడే వేస్తున్న అడుగులతో ఏడుస్తూ ముందుకు రాసాగింది. వెంటనే తనను తీసుకుంది అమ్మ.

ఏడుస్తూ ఊర్లో నడుస్తున్న. నన్ను గుర్తించిన ఓ ముసలాయన మా ఇంటికి తీసుకెళ్ళాడు. ఇంటి ముందు ఉన్న అమ్మను చూపిస్తూ వెనుదిరిగాడు. ఆందోళనతో నా దగ్గరకు వచ్చి వాటేసుకోవడంతో తనే అమ్మ అని అర్థమైంది. ఆకలితో ఎదురుచూస్తున్న నా కడుపుకు

అన్నం పెట్టింది. "అక్కడ ఏమైన తప్పు పని చేశావా, వాళ్ళేమైన కొట్టారా" అని ప్రశ్నించింది అమ్మ. అన్నింటికి సమాధానం లేదనే చెప్పా. కాసేపు నన్ను ఒంటరిగా వదిలేసింది. సూర్యుడు అస్తమిమించే సమయానికి ఇంట్లో 5 మంది కనబడేసరికి నాకేం అర్థం కాలేదు. ఇద్దరు చెల్లెళ్ళు, అక్క, అన్న, నాన్న అని అమ్మ నాకు పరిచయం చేసింది. ఇంట్లోవాళ్ళందరూ నాకు కొత్తగా అనిపిస్తున్నారు కానీ, వాళ్ళకు నేను ముందే పరిచయమని అక్క నాతో అంది. వాళ్ళంతా తరచు నన్ను చూసేవాళ్ళంట. తెల్లవారి అక్కతో కాసేపు ముచ్చడించా. 'అక్కా, మనది పై విధీ అంటున్నారు కదా! మన ఊరుపేరే పైవీధి అంటారా?' అని నేనడిగిన ప్రశ్నకు "మన ఊరు పేరు కొర్రాబు, బొడిగట్ట పంచాయితీ, కలిమెల బ్లాక్, మల్కనగిరి జిల్లా" అని చెప్పింది. ఆ తర్వాత నాకు గుర్తున్నది ఊరు పేరు మాత్రమే. అలా రోజులు గడిచిపోతున్నాయి. జ్ఞాపకాలు మాత్రం నా బుర్రలో తిరుగుతున్నాయి. గొడ్లు, చెల్లెవాళ్ళు, మల్లుపిట్టలు, మేకపిల్లలు, పూలే ... నిరంతరం చూడలని మనసు తహతహలాడుతుంది. "ఇక్కడికి ఎందుకొచ్చావ్, అక్కడకన్నా ఇక్కడ నీకు ఏం దొరకదు, వాళ్ళకన్నా మేము నిన్ను ఏం బాగా చూసుకోలేం, అక్కడే వుండు, అప్పుడప్పుడు మేము వస్తుంటాం సరేనా!" అంటూ అమ్మ, నాన్న రోజుకు ఒక్కసారైనా చెబుతున్నారు. అందుకు నేను ససేమిరా అన్నా. నిజానికి కూడా వాళ్ళు మా ఐదుగురిని బ్రతికించడానికి ఎన్నో ఇబ్బందులు పడేవాళ్ళు. పూట గడవడం కష్టంగా వుండేది. నేనొచ్చి నెలలు గడుస్తున్నా, ఏ రోజు రెండు పూటలు కడుపునిండా తిన్నది లేదు. ఆకలితో చెల్లెళ్ళు బాగా ఏడిచేవాళ్ళు. నాన్న ఊర్లోవాళ్ళకి చెట్ల మందులిస్తే, అందుకు బదులుగా ఊర్లోవాళ్ళు ఇచ్చే కొద్దిపాటి నూక, మిగిలిన అన్నం, కూరలు ఇచ్చేవాళ్ళు. ఒక్కోసారి అన్ని కలిపిన అన్నం పాచిపోయేది. ఆ రోజు ఉపవాసం ఉండేవాళ్ళం. మా బాధ భరించలేని అమ్మ చుట్టుపక్కల ఇండ్లలో అడిగి ఏదో ఒకటి తెచ్చి పెట్టేది. తను మాత్రం కల్లుచెట్లతో ఆకలి, దాహం తీర్చుకునేది. అనారోగ్యాలతో చెల్లెళ్ళు నిరంతరం బాధపడేవాళ్ళు. అప్పుడర్థమైంది నన్నెందుకు పదే పదే వాళ్ళ ఇంటికెళ్ళమన్నారో. అడపా దడపా ఆకలి చావులతో రోజులు ముందుకెలుతున్నాయి.

గతంలో అక్కడ వున్నప్పుడు గొడ్ల కాపుకు వెళ్ళేదాన్ని కానీ, అలాంటివేవి ఇక్కడ లేవు. కొందరు పిల్లలు స్కూలుకు వెలుతున్నారు. నాకు కూడా వెళ్ళాలని వుంది. చాలాసార్లు నాన్నని అడిగితే "రాసే పలక కూడా లేకుండా ఎలా వెలతావ్" అని కోప్పడేవాడు. కొనిపెట్టమని అడిన ప్రతిసారి తర్వాత  అని మాత్రం అనేవాడు. ఈ మాట ఎన్ని సార్లు చెప్పాడో లెక్కేలేదు. ఈ మధ్య నేను నాన్న వెనకాల అడవికి వెళ్ళడం బాగా పెరిగింది. ఈ క్రమంలో రెండు మైన పిట్టలు పట్టుకొచ్చా. వాటితో నాకు చెల్లెలకి బలే సందడిగా వుండేది. ఒక్కోరోజు అన్నం లేకపోయినప్పటికీ, పెద్దగా ఇబ్బంది పడేవాళ్ళు కాదు చెల్లెళ్ళు, అంతగా ఆడేవాళ్ళు మైనపిట్టలతో.

నేను లేచేసరికి అమ్మ, నాన్న ఎప్పుడు లేచారో తెలియదు కానీ, కోపంగా మాట్లాడుకుంటున్నారు. "ఆ ఊర్లో భూమి లేదని ఇక్కడికి వచ్చాం. ఇక్కడ ఆ సంఘమోళ్ళు ఇచ్చిన భూమి కూడా చేసుకోకుండా అట్లే ఉంచితిమి, ఎలాగైనా అప్పు చేసి రెండు గొడ్లు కొను, తర్వాత అప్పు తీర్చుదాం" అని నాన్నతో అమ్మ చెబుతుంది. "వర్షాకాలం పండిస్తున్నాం కదా, నీళ్ళు లేకుండా మిగతా రోజుల్లో ఎట్ల పని సాగుతుంది? అయినా గొడ్లకు పైసలెవరిస్తారు?" అంటూ మంటదగ్గరికెళ్ళాడు నాన్న. ఈ మాటలన్ని నా చెవిన పడుతూనే వున్నాయి. మాకు కూడా కొంత భూమి ఉందన్న విషయం అప్పుడర్థమైంది. వయసొచ్చిన పిల్లలందరూ పక్కనే ఉన్న బెంగాలీ క్యాంపుకు కూలీ పనులకు వెలుతున్నారు. వాళ్ళతోపాటు నేను వెలుతున్నా. ఈ క్రమంలో ఇంట్లో తిండికి కొంత ఊరట లభించింది. బెంగాలీ క్యాంపులో, బాతులతో వాళ్ళ పిల్లలు బాగా ఆడుకునేవాళ్ళు. నా మనసు వాటిపైకి మళ్ళింది. కూలీ డబ్బులతో ఓసారి రెండు బాతులు కొనేసా. వాటిని చూసి నాకన్నా ఎక్కువ చెల్లెళ్ళే సంతోషపడ్డారు. అక్క మాత్రం చదువుకుంటోంది. ఇంట్లో ఇబ్బంది అవుతుందని నన్ను పంపడం లేదు. అన్న దళంలో పని చేస్తున్నాడు అని అందరు అంటున్నారు కానీ, అదేమిటో, అక్కడ ఎందుకు పని చేస్తున్నాడో నాకు అర్థం కాలేదు. నేను వచ్చినప్పటి నుండి నా తోటి వాళ్ళ దగ్గరగానీ, పెద్దవాళ్ళదగ్గర గానీ ఒక విషయం బాగా వింటున్నా. సంఘం దాదా రాత్రి వచ్చాడనీ, మీటింగ్ పెట్టి పోయాడని ఒకరికొకరు చెప్పుకుంటున్నారు. ఎవరు ఆ సంఘం దాదా, మీటింగ్ అంటే ఏమిటి? మొన్న కూడా రాత్రి అమ్మ, నాన్న మీటింగ్ అని వెళ్ళారు. కూలీకి వెళ్ళిన దగ్గర ఎవరినైనా అడగాలి అని అనుకున్న. ఈ క్రమంలో ఊర్లోకి భీం దాదా వస్తున్నాడు, పోతున్నాడు. అప్పుడప్పుడు నాన్నతో కూడా మాట్లాడి వెలుతున్నాడు. ఓరోజు నేను నాన్నతో చదువుకోవడానికి వెలతానని ఏడుస్తుంటే భీం దాదా అదే సమయానికి మా ఇంట్లో ప్రత్యక్షమయ్యాడు. నా గోల గమనించిన భీం దాదా "మన జనతనసర్కార్ స్కూల్ వుందిగా, అక్కడికి పంపించు, మీకేమి ఇబ్బంది వుండదు. సమయానికి పిల్లలకు అన్నం కూడా పెడతారు. అభ్యంతరం లేకపోతే అక్కడే కూడా తనని వుంచొచ్చు. ఇంకేం ఆలోచించకు తర్వాత నేను గురూజీని కలిసి తన గురించి చెబుతా" అని నాన్నతో అరగంట మాట్లాడి వెళ్ళిపోయాడు. ఆ మరుక్షణమే నాన్న స్కూలుకు తీసుకెళ్ళాడు. అప్పుడప్పుడు ఇంటికి రావడం తప్ప, ఎక్కువ సమయం స్కూల్ దగ్గరే. ఇద్దరు గురూజీలు కూడా మమ్మల్ని బాగా చూసుకుంటున్నారు. పిల్లలందరితో ప్రతిరోజు హుషారే.

అనుకోకుండా ఒకరోజు భీం దాదా గురుజీవాళ్ళతో కలిసి ఏదో మాట్లాడుతున్నాడు. ఎప్పటినుండో భీం దాదాను కలవాలని నా ఆరాటం. తిరిగి వెలుతున్న క్రమంలో తనకు ఎదురు పరుగెత్తా. తనవైపే నా పరుగును చూసి ఆగిపోయాడు. "ఏంటి నందే బాగున్నావా, చదువు ఎలా కొనసాగుతుంది" అని పలకరించాడు. పలకరింపుకు సమాధానం చెబుతూ 'భీందాదా మా అన్న ఎలా వున్నాడు? అసలు ఎక్కడున్నాడు' అందరూ పార్టీలో వున్నాడు అంటున్నారు. పార్టీ స్కూల్ అంటారు? పార్టీ అంటే ఏమిటి? నాకు

వివరంగా చెప్పాలి, నాకేం అర్థం కావడం లేదు భీం దాదా' అన్న నా మాటకు నవ్వుతూ స్కూల్‌కి పక్కనే వున్న చింతచెట్టు కిందకు నడిచాడు. తన వెనకాలే నేను. అక్కడ కూర్చున్నాక నా మాటలకు బదులుగా "ప్రజల సమస్యలు ఎక్కడుంటే వాళ్ళు అక్కడుంటారు. అంటే ప్రజల కోసమే వారి జీవితం. అందుకోసం తమ ప్రాణాలను కూడా లెక్కచేయరు. ప్రజల కోసమే మేమున్నాం అని చెప్పుకుంటున్న బూర్జువా ప్రభుత్వాలు, మసి పూసి మారెడుకాయ చేసినట్లు ప్రజలను నిలువెల్లా మోసం చేస్తూ, వాళ్ళ జీవితాలతో ఆడుకుంటున్నాయి. నీకు ఈ తేడా అర్థం కావాలంటే ఇంతకు ముందు నీవు చదువుకున్న బూర్జువా సర్కార్ స్కూలుకీ, ఇప్పుడు చదువుకుంటున్న జనతనసర్కార్ స్కూలుకు తేడా గమనిస్తే అర్థమైపోతుంది. ఆ స్కూల్లో గురుజీలు ఒక్కరోజు వస్తే, 20 రోజులు రారు. పిల్లలకు చెప్పాల్సిన చదువు చెప్పరు, వాళ్ళకు పెట్టాల్సిన తిండి పెట్టరు. స్కూల్ పేరు మీద వచ్చే డబ్బులన్నీ మధ్యలోనే వాళ్ళే తినేస్తారు. అది ఒక్కటే కాదు అన్ని విషయాల్లో ప్రభుత్వ తీరు అదే. ఇక పార్టీ నిర్మించిన జనతనసర్కార్ స్కూల్‌నే అందరూ పార్టీ స్కూల్ అంటున్నారు. ఇప్పుడు నీకు కొంత అర్థమైందనుకుంటా. అలాంటివాళ్ళతోటే మీ అన్న వుండేది" అని చెబుతున్న క్రమంలోనే దాదాను కలవడానికి చాలా మంది వచ్చారు. "నందే నీకు అన్ని విషయాలు మన గురుజీలు చెబుతారు. ఏం భయపడకుండా వాళ్ళను అడుగు, నీకు క్లాస్ టైం కూడా అవుతుంది కదా! ఇంకోసారి కలిసినప్పుడు మాట్లాడుకుందాం" అంటూ వచ్చిన వాళ్ళతో మాటలు కలిపాడు. నిజమే, నేను వేరేవాళ్ళ ఇంట్లో వున్నప్పుడు గవర్నమెంట్ స్కూలుకు వెళ్ళేదాన్ని. అక్కడ దాదా చెప్పినట్లుగానే గురుజీలు రారు, ఎవరు పట్టించుకోరు, అసలు చదువే చెప్పరు. ఈ మాటలు ఆలోచిస్తూ క్లాసులోకి వెళ్ళిపోయా.

అప్పుడే నేనొచ్చి సంవత్సరం అయ్యింది. ఎన్నో కొత్త విషయాలు తెలుసుకున్నాను. స్కూలు, హాస్టల్ అదే కావడంతో బలేగా వుంది. చదువుతో పాటు చక్కటి క్రమశిక్షణ అలవడింది. ఉదయాన్నే స్కూల్ ఆవరణలో వున్న కూరగాయల మొక్కలకు, క్లాసుల వారిగా నీళ్ళు పోయడం, ఎక్సర్‌సైజులు చేయడం, సమిష్టి పనులు ముగియగానే, వ్యక్తిగత పనులు పూర్తి చేసుకొని టిఫిన్ చేయడం, క్లాస్‌కి వెళ్ళడం, క్లాసులు అయిపోగానే సాయంత్రం ఆటలాడటం, వీలునుబట్టి వంటకోసం అడవికి వెళ్ళి కర్రలు, దుంపలు, అడవిలో దొరికే ఆకుకూరలు తేవడం, రాత్రి పూట ఏ క్లాసుకి అక్కడే సెంట్రీలు చేయడం...ఇదంతా కొత్త ప్రపంచంలోకి వచ్చినట్లుగా అనిపిస్తోంది.

గురుజీలు తరగతిలో క్లాసు చెప్పిన తర్వాత సాధ్యమైన వాటిని ప్రత్యక్షంగా చూపిస్తున్నారు. వారం వారం ఒక ఊరికి వెలుతున్నాం. ఆయా ఊర్లలో వుండే మురికి కాలువలనూ, మంచినీటి చువ్వలనూ, ఇండ్లకు దగ్గరలో వున్న చెత్తను ఊరివాళ్ళతో పాటు మేము కలిసి శుభ్రం చేస్తున్నాం. కొన్ని ఊర్లలో భీం దాదా కూడా కనిపిస్తున్నాడు. ఈ క్రమంలో పార్టీ వాళ్ళను కూడా చూసా. రాత్రి పూట ఊర్లలో వున్నప్పుడు వాళ్ళు కూడా పనులలో భాగమవుతున్నారు. వెళ్ళేముందు ప్రజలందరిని సమావేశపరిచి మాట్లాడి, పాటలు కూడా పాడుతున్నారు. వాళ్ళ పాటలు వింటుటే ఎప్పుడెప్పుడు నేను నేర్చుకుంటానా అనే అలోచన మొదలైంది. ఈ జీవితం నాలో కొత్త బలాన్ని, ఉత్సాహాన్ని నింపుతున్నది.

ఎధావిధిగా తరగతులు జరుగుతున్నాయి. అంతలో ఫీల్డ్ పనులకు వెళ్ళాలని కాషన్, అన్ని తరగతులవాళ్ళం బయటకు చేరుకున్నాం. గ్రౌండ్‌లోకి వెళ్ళేసరికి గురుజీ మాటల శబ్దం "10 రోజులు మనం పంటపొలాలకు వెలుతున్నాం. ప్రజల పంటలు కూడా కోతకొచ్చాయ్, మనకు చేతనైనంత మనం పాల్గొందాం. మనకు తెలియని విషయాలను అక్కడి రైతులను అడిగి తెలుసుకుందాం. ఇది మన ప్రోగ్రాం. రేపు ఉదయం మన ప్రయాణం" అని చెప్పి కూరగాయల తోటవైపు వెళ్ళిపోయాడు. అనుకున్నట్లుగానే టిఫిన్ చేసి, ఒక జత బట్టలు, ప్లేటు, షాలువా బ్యాగులో సర్దుకొని, రోల్‌కాల్ కోసం ఎదురుచూస్తున్నాం. రోల్‌కాల్ పూర్తయింది. ఎవరి క్లాసు ఫార్మేషన్‌లో వాళ్ళం నడక ప్రారంభించాం. పంట పొలాల్లో కాపుకు వచ్చిన జొన్నలు, కందులు, రాగులు, వేరుశనగ, నువ్వులు... మొదలైన వాటిని ప్రజలతో పాటు కోస్తున్నాం. గురుజీలు అందరితో పాటు పని చేస్తునే అదనంగా రైతులతో పంటలకైన ఖర్చులు, గతేడాది లాభాలను అడుగుతున్నారు. రెస్టు సమయంలో మాకు ఆ పంటలతో ఏమేమి తయారవుతాయో, ఏది ఎక్కువ శక్తినిస్తుందో చక్కగా వివరిస్తున్నారు. అప్పుడే 6 రోజుల గడిచిపోయాయి. ఒక ఊరి నుండి మరొక ఊరికి వెలుతున్న క్రమంలో దారిలో అక్కడక్కడ భూములలో ఎర్రజెండాలు, స్థూపాలు, చెరువులు, చెక్ డ్యాంలు... తారాసపడుతున్నాయి. సాయంత్రం 7గం॥లవుతుంది. అడివంతా పున్నమి వెన్నెలతో ప్రకాశిస్తున్నది. చాలా మామిడిచెట్లు వున్న స్థలంలో ఫార్మేషన్ ఆగిపోయింది. "మనం ఈ రాత్రికి ఇక్కడే ఆగుతాం, 8 గం॥ లకు ఊరివాళ్ళు భోజనాలు తెస్తారు. అప్పుడు అందరు వచ్చి అన్నం తినాలి. ప్రస్తుతం కాళ్ళు కడుక్కొని అందరం ఇక్కడే కూర్చుని మాట్లాడుకుందాం" అని ముగించాడు గురుజీ. అరగంటలో కడగడం పూర్తి చేసుకొని, క్లాసుల వారిగా కూర్కొన్నాం. ''ఎవరికైనా డౌట్స్ ఉంటే అడగండి చర్చించుకుందాం'' అన్నాడు. ఎప్పుడెప్పుడు అడగాలా అని ఎదురుచూస్తోన్న నేను వెంటనే లేచా. 'భూముల్లో ఎర్రజెండాలు ఎందుకు పాతారు? అని అడిగా. దీనికి గురుజీ సమాధానంగా "ముఖ్యంగా 'దున్నేవారికే భూమి వుండాలి' అనేది మన పార్టీ నినాదం. ఎందుకుంటే మన దేశంలో నూటికి 70 శాతం మంది ప్రజలు వ్యవసాయంపైనే ఆధారపడి బ్రతుకుతున్నారు. మరి వ్యవసాయం చేయాలంటే భూమి ఉండాలిగా. ఆ భూములన్ని పెద్ద పెద్ద భూస్వాముల అక్రమ ఆక్రమణలో వున్నాయి. మన ఆదివాసీ గూడాలలో కూడా అంతే. ఆ జెండాలు పాతిన భూములన్నీ, మన పార్టీ నేతృత్వంలో అభివృద్ధి నిరోధక పెద్దాల్‌ల వద్ద, ఆదివాసేతర భూస్వాముల వద్ద స్వాధీనం చేసుకున్నవి. మన కలిమెల ఏరియాలో, మెజారిటీగా ఇప్పుడు మనం చూస్తున్న భూములన్నీ, పార్టీ నేతృత్వంలో స్వాధీనం చేసుకున్న భూములే. మనం పోరాడి సాధించుకున్నాం

కాబట్టి ఆ భూముల్లో మన పార్టీ జెండాలు పాతారు. అయితే ఈ విజయాలు అంత తేలికగా మనకు దక్కలేదు. ఈ పోరాటంలో ప్రభుత్వ సాయుధ బలగాలు దోపిడీ వర్గాల వైపు వుంటే, పార్టీ, పి.ఎల్.జి.ఎలు ప్రజలవైపు నిలబడ్డాయి. ఈ ఘర్షణలో అనేక మంది ప్రజల ముద్దుబిడ్డలు ప్రభుత్వ సాయుధ బలగాలతో వీరోచితంగా పోరాడి తమ ప్రాణాలను ఫణంగా పెట్టారు. ఈ అమరుల జీవితాలను ఆదర్శప్రాయంగా చేసుకొనేందుకే, మనం ఈ స్థూపాలను నిర్మించుకున్నాం. అవి మనకు గొప్ప పోరాట స్ఫూర్తి. పార్టీ ఈ ప్రాంతంలో ప్రజలను విప్లవంలోకి సంఘటిత పరిచేందుకు విప్లవ సంస్కరణలను కూడా చేపట్టింది. ఈ సంస్కరణలలో భాగంగా అనేక చెక్‌డ్యాంలు, కొత్త చెరువులు, నీటి కుండీలు ... ఇలా ఎన్నింటినో ప్రజాహిత కార్యక్రమాలు చేపట్టింది. భూస్వాముల ఆధీనంలో వున్న చెరువులను కూడా ప్రజలపరం చేశారు. పౌష్టికాహారానిచ్చే పంటలను పరిచయం చేశారు. ఇప్పుడు పొలాల్లో చూసిన వాళ్ళందరూ ఈ చుట్టుపక్కల 5 గ్రామలకు చెందినవారు. అన్ని ఊర్లలో సమిష్టి వ్యవసాయానికి అలవాటయ్యారు. మరోక ముఖ్యమైన విషయమేమిటంటే గతంలో మన గ్రామాలలో పౌష్టికాహారలోపం, మలేరియా, టి.బి, శిశు మరణాలు ... మొదలైన రోగాలతో అనేక మంది మరణించేవారు. పార్టీ వచ్చాక ప్రజలకు మందులిచ్చి కాపాడటమే కాకుండా, ఆర్.పి.సి గ్రామాలన్నింటిలో యువతకు డాక్టర్ ట్రైనింగ్ క్యాంపులు నెలకొల్పారు. ఇందులో ప్రావీణ్యత పొందినవారిని పాకెట్, ఏరియా డాక్టర్లుగా నియమించారు. అప్పటినుండే మన దగ్గర 90 శాతం మరణాలు తగ్గాయి. సరే ఊరి దాదలు అన్నం తెచ్చారు. తర్వాత మాట్లాడుకుందాం" అని దాదల దగ్గరకు వెళ్ళాడు గురూజీ. పార్టీకి ఇంతటి చరిత్ర వుందా అని చాలా ఆశ్చర్యం వేసింది. ఒక పాకెట్ ఊర్లు తిరుగుతుండగానే గిర్రుమని 10 రోజులు గడిచాయి. నాలో వున్న ఒక పెద్ద డౌట్ మాత్రం అలాగే మిగిలి పోయింది. ఈ విషయం తప్పకుండా తర్వాత ఎప్పుడైనా భీందాదానే అడగాలని నిర్ణయించుకున్నా. ఎందుకంటే భీందాదాకు తెలివొచ్చినప్పటినుండి పార్టీతోనే గడిపేవాడని ఊర్లోవాళ్ళందరంటారు. పెద్ద పెద్ద వయస్సు గల ముసలివాళ్ళు కూడా ఏ విషయమైనా భీం దాదానే అడుగుతుంటారు. జులైలో ప్రారంభమైన వర్షాలు సెప్టెంబర్‌లో కూడా ఎడతెరిపు లేకుండా కురుస్తున్నాయి. దీంతో ఇండ్లకు వెళ్ళమని సెలవులివ్వడంతో బాతులను, మైన పిట్టలను ఎప్పుడెప్పుడు చూస్తానా అనుకుంటూ ఉత్సాహంతో ఇంటికెళ్ళిపోయా.

పొడిపొడిగా కురిసే సన్నని వర్షానికి గంతులేస్తూ, మా బ్యాచీ వాళ్ళందరం కలిసి స్కూలు విషయాలు మాట్లాడుకుంటూ నవ్వుకుంటున్నాం. భీం దాదా ఊర్లోకి రావడం, మీటింగ్ చేయడం అయిపోయాయి. అటువైపుగా వెలుతున్న భీందాదాని అందరం చుట్టేసుకున్నాం. 'మాకు ఏదో ఒకటి చెప్పాకే వెళ్ళాలి, లేకుంటే మేం వదలం' అంటూ అందరం పట్టుబట్టాం. "సరే మీలాంటి కొత్తతరం తెలుసుకోవాల్సిన విషయం చెబుతా, ఎందుకుంటే రేపు మన పార్టీని ముందుండి నడిపించాల్సినవాళ్ళు మీరేగా, అందరు శ్రద్ధగా వినాలి" అన్నాడు. అందరం ఒ.కె అన్నాం. "పార్టీ రాకముందు మేము మన అడవిలోకి ధైర్యంగా పోయేవాళ్ళం కాదు. ప్రభుత్వం నియమించిన ఫారెస్టు అధికారులు వుండేవాళ్ళు. అడవిలో దొరికే దేన్నైనా అనుభవించే అవకాశం లేదు. దేన్ని ముట్టుకున్నా వాటికి రుసుం చెల్లించాల్సిందే. బాగా కొట్టేవాళ్ళు. ముఖ్యంగా మహిళల్ని అత్యాచారాలు చేయడానికి హద్దులే లేవు. ఊర్లమీద పడి ప్రజలను హింసించేవాళ్ళు. కానీ పార్టీ వచ్చాక వాళ్ళ ఆటలు సాగలేదు. వాళ్ళందరిని పార్టీ తన్ని తరిమింది. అప్పుడు మన ఆదివాసీలకు ఫారెస్టు అధికారుల నుండి విముక్తి లభించింది. ఇక నేను కల్లారా చూసిన మన కలిమెల పోరాటాల విషయానికొస్తే రోజంతా కష్టపడి వెదురు కర్రలు నరుక్కొని అమ్మడానికి పోతే తక్కువ డబ్బులిచ్చేవాళ్ళు. అవి దేనికి సరిపోయేవి కాదు. తూనికాకు 100 ఆకుల కట్టకు, 5 పైసలిచ్చేవాళ్ళు. పార్టీ ఆధ్వర్యంలో ప్రజలందరం సంఘలుగా ఏర్పడి, ఐక్యమై పోరాడి వ్యాపారుల మెడలు వంచి, ప్రస్తుతం 50 ఆకుల తూనికాకు కట్టకు రూపాయిన్నర సాధించుకున్నాం. వెదురుకు సరైన ధర వచ్చేంతవరకు పోరాడాము. ప్రభుత్వం రోడ్లు వేయించడానికి ప్రయత్నించినప్పుడు 'మాకు రోడ్లు కాదు, తాగడానికి మంచినీళ్ళు ఇవ్వండి, హస్పిటల్ కట్టించండి, డాక్టర్లను పంపించండి' అని పెద్దమొత్తంలో ధర్నాలు చేశాం. ఇంకా ధాన్యం ధరల పెంపు కోసం, సాగునీటి కోసం, ఐక్యకార్యాచరణ పోరాట కమిటిని ఏర్పాటు చేసి, కొరకటపల్లి నుండి మన్నెంకొండ వరకూ కెనాల్ తవ్వాలని వేలాది మందితో ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ, అనేక సార్లు ర్యాలీలు, సభలు, ధర్నాలు నిర్వహించాము. ఇలా మౌలిక సమస్యలపై అనేకసార్లు మల్కనగిరి కలక్టర్ ఆఫీసును ముట్టడించాం. ప్రభుత్వ నిర్బంధానికి వ్యతిరేకంగా బంద్‌కు పిలుపునివ్వడంతో పాటు, సంఘం, మిలీషియా కలిసి పోలీసులపై దాడులు చేపట్టాం. సరే కామ్రేడ్స్ బాగా చీకటి పడింది నాకు పక్క ఊరిలో పనుంది. మళ్ళీ కలిసినప్పుడు ఇదే చర్చ చేద్దాం. సరేనా ఉంటా మరీ, ముఖ్య విషయం ఏమిటంటే, ఈ నెల 21న పార్టీ పుట్టినరోజు, శత్రు కదలికలవల్ల ఆ తేదీకన్నా ముందుగానే వారోత్సవాలను వారం రోజులు జరుపుకుంటాం. ఈ క్యాంపెయిన్‌లో మీ బ్యాచ్ అందరూ పాల్గొనాలి. క్యాంపెయిన్‌లో కలుద్దాం మరీ" అంట భీం దాదా చీకట్లో కలిసిపోయాడు.

సెప్టెంబర్ 21 పార్టీ దివాస్ సందర్భంగా క్యాంపెయిన్స్ జరుగుతూనే వున్నాయి. ఈ క్యాంపెయిన్‌కి మా బ్యాచీలో 20 మందికి పైగా బయలుదేరాం. వెళ్ళే దారుల్లో మిలీషియా, సంఘం, జి.ఎన్.ఎస్ టీంల ప్రచారం జోరుగా సాగుతున్నది. డప్పుల దరువులు, అమరుల పాటలు వింటుంటే మనసు ఓ పట్టాన ఆగడం లేదు. వెళ్ళి వాళ్ళతో వెంటనే కలవాలనిపిస్తుంది. క్యాంపియన్ టీం దగ్గరకు చేరుకున్నాం. ఆ రాత్రికి ఒక ఊర్లో దళం వాళ్ళతో కలిసి ప్రచారంలో పాల్గొన్నాం. శత్రు నిర్బందం వలన మీటింగ్ ముందుగానే జరుపుతున్నారు. దాంతో మేము ఆ స్థలానికి

చేరుకున్నాం. అప్పుడే తెల్లారిపోయింది. సంఘాలు, మిలీషియా, ప్రజలతో పండగ వాతావరణం నెలకొంది. వీచే గాలులకు తోడు, పార్టీ పాటలతో మైకుసెట్ల శబ్దానికి చెట్లు నాట్యమాడినట్లు కదులుతున్నాయి. జెండా ఆవిష్కరణ, ఆ తర్వాత 2 నిమిషాలు అమరులకు నివాళి. అందరు కలిసి పాడే పాట. దీన్నే అంతర్జాతీయ గీతం అంటారని పక్కనే వున్న సంఘం దాదా మాకు చెబుతున్నాడు. అమరులకు జోహార్లర్పిస్తూ జి.ఎన్.ఎస్ వాళ్ళ పాట ముగిసాక, కె.ఎ.ఎమ్.ఎస్ అధ్యక్షురాలు రాజే మాట్లాడటం మొదలుపెట్టింది. తను మాట్లాడిన విషయాలు నాకు అంత లోతుగా అర్థం కాకపోయినప్పటికీ, ఒకటి మాత్రం బాగా అర్థమైంది. ఒక మహిళ చాలా ధైర్యంగా దాదాపు 8వేల మంది ముందు మాట్లాడటం ఎంతటి గొప్ప చైతన్యం! తను ఆ స్థాయికి ఎదగడానికి పార్టీ అందించిన రాజకీయాలు, ప్రోత్సాహమే కారణం. ఊర్లలో మహిళలు ఇప్పటికీ ఇంట్లో కూడా ధైర్యంగా నోరెత్తరు. నా వయస్సు వాళ్ళయితే తమకు ఇష్టం లేకపోయినప్పటికీ, ఇంట్లోవాళ్ళు కల్లుతాగి నిర్ణయించే బలవంతపు పెళ్ళిళ్ళకు బలౌతున్నారు. ఇలాంటివి గ్రామాలలో లెక్కలేనన్ని. కానీ పార్టీ వచ్చాక వాటన్నింటికి తెర పడిందని మొన్నే భీం దాదా చెప్పాడు. అయితే దీనిని బట్టి "మహిళలు ఏం తక్కువ కాదు, పురుషులతో సమానంగా అన్నిట్లో రాణించాలి" అని గురూజీ చెప్పిన మాటలు గుర్తొచ్చాయి. ఈ మీటింగ్‌లే కాక సెప్టెంబర్ పార్టీ దివాస్‌ని పురస్కరించుకొని అనేక ప్రతిఘటన కార్యక్రమాలలో మా వంతు పాత్ర మేము నిర్వహించాము.

ఆ రోజు 2013, సెప్టెంబర్ 13వ తేదీ. రోజు వారి పనులు పూర్తి చేసుకున్నాం. పాల్గొన్న ప్రతిఘటన కార్యక్రమాల గురించి అందరం మాట్లాడుకుంటుండగానే పొద్దు పోయింది. అడివంతా నలువురంగు సంతరించుకుంది. మబ్బులు ఆకాశాన్ని చుట్టేస్తున్నాయి. అరగంట తేడాతో వర్షం జోరుగా కురుస్తున్నది. సెంట్రీలు తప్ప ఎక్కడివాళ్ళు అక్కడ తమ తమ టెంట్లలో నిద్రిస్తున్నారు. గ్రామంలోని ఇద్దరు విప్లవ ద్రోహులు నేరుగా పోలీసులకు ఎప్పుడు సమాచారమిచ్చారో తెలియదు. వందలాది మంది పోలీసు బలగాలతో రాత్రికి రాత్రే మకాంను అన్ని వైపులనుండి చుట్టుముట్టారు. సరిగ్గా ఉదయం 5.30 గం॥ల సమయంలో అతిసమీపం నుండి టెంట్‌లో నిద్రిస్తున్న మాపైకి పోలీసులు ఆటోమేటిక్ ఆయుధాలతో విచ్చలవిడిగా కాల్పులు జరపడం ప్రారంభించారు. ఆ కాల్పులలో 13 మంది నా సహచర మిత్రులను కోల్పోయాను. పోలీసులు వారివద్ద ఎకె – 47, 9 యమ్.యమ్ పిస్టల్స్, లాంటి ఆయుధాలు పెట్టి, నిజమైన ఎన్‌కౌంటర్‌గా చిత్రీకరించి ప్రచారం చేశారు. వాస్తవాలు బయటకు రాకుండా చేయడానికి ఆదరాబాదరాగా శవాలను గుడ్డల్లో చుట్టి, మూటలు కట్టి జిల్లా కేంద్రానికి తరలించారు. శవాలను కుటుంబ సభ్యులకు కూడా ఇవ్వకుండా పూడ్చిపెట్టారు. ప్రజలు వాస్తవాలను బయట పెట్టడంతో పోలీసు ఉన్నతాధికారులు నోరు మెదపలేదు. ఈ సంఘటనలో అమరులైన నా సహచర కామ్రేడ్స్‌కు పార్టీ, పి.యల్.జి.ఎ, ప్రజానిర్మాణాలు, ప్రజలు వినమ్రంగా తలవంచి జోహార్లు అర్పిస్తూ, వారి ఆశయాలను ముందుకు తీసుకుపోతామని పిడికిళ్ళు బిగించి శపథం చేశారు.

ఆ ఎన్‌కౌంటర్ నుండి నేను ఎలా తప్పించుకున్నానో ఆ విషయం గుర్తొస్తే చాలు నేను నేనేనా? అనే సందేహం కలుగుతుంది. అమరులైన 13 మంది జ్ఞాపకాలు మనసును కలవరపెడుతున్నాయి. అందరికన్నా అతి చిన్న వయస్సుగల గంగిని పోలీసులు పట్టుకొని బాయ్‌నెట్‌తో పొడిచి, హింసించి చంపేసారు. తనది మా ఊరే కావడంతో నాకు సన్నిహితురాలు. గంగివాళ్ళ అమ్మ పార్టీలోనే అమరురాలయ్యిందనీ, అప్పుడు గంగికి 2 సంవత్సరాలని ఊర్లోవాళ్ళు అంటుంటే విన్నాను. గంగిని అందరు కూడా గారాబంగా చూసేవారు. ఎన్‌కౌంటర్ విషయాలన్ని బుర్రలో తిరుగుతున్నాయి. ఇంటికి వెళ్ళాలా? ఉండిపోవాలా? ఒకటే ఘర్షణ, భీం దాదా నుండి కబురు రావడంతో తనదగ్గరకు చేరుకున్న. "వచ్చి చాలా రోజులవుతుంది. ఇంట్లోవాళ్ళు ఎదురుచూస్తారు. ఈ రోజు సాయంత్రం మీ ఊరి వాళ్ళు పనిమీద వస్తున్నారు. వాళ్ళ వెనక నీవు వెళ్ళాల్సి ఉంటుంది. జరిగిన సంఘటన పదే పదే ఆలోచించకు. మనం యుద్ధంలో వున్నాం. పీడిత ప్రజల అధికారం కోసం జరిగే ఈ యుద్ధంలో మరణాలు సహజం. శత్రువు బలమైనవాడు. వాడిని అణిచివేయడానికి మనం మరింత ధైర్యంగా మన పనికి పదును పెట్టాలి. మన సైన్యాన్ని పెంచుకోవాలి. మన జ్ఞానాన్ని అభివృద్ధి చేసుకోవాలి" అని మనోస్థైర్యాన్ని పెంచే భీం దాదా మాటలు నాకు మరింత ఊరటనిచ్చాయి.

సాయంత్రం అయ్యింది. మా ఊరివాళ్ళు రానే వచ్చారు. నా ఆలోచనలు, నా మనసు వడే ఘర్షణ మాత్రం నన్ను తేల్చుకోమంటున్నాయి. గురూజీ చెప్పిన పార్టీ అమరుల చరిత్ర, వారిని స్మరిస్తూ ప్రజలు నిర్మించుకున్న స్థూపాలు, అన్నింటికన్నా నా జీవితంలో గుర్తిండిపోయే శీలకోటలో నా సహచరుల త్యాగాలు, వారికి స్ఫూర్తిగా నిర్మించిన స్థూపాలు ... ఇవన్నీ నన్ను ప్రజాయుద్ధంవైపు నడవమనీ ఆజ్ఞాపిస్తున్నాయి. క్షణం ఆలస్యం చేయకుండా ఊరి మిత్రులను ఆలింగనం చేసుకున్నా. వారితో ఇంటిదారి పట్టి, కుటుంబ పరివారంతో రెండు రోజులు గడిపి, వారి నుండి వీడ్కోలు తీసుకున్న. పడమర అస్తమిస్తున్న సూర్యున్ని చూస్తూ, అనివార్యమైన మరో వేకువకోసం, ఆలీవ్‌గ్రీన్ దుస్తులతో లాంగ్‌మార్చ్ కవాతు చేస్తూ, కదులుతున్న ఎర్రదండులో షరీకయ్యాను. ●

**"ప్రజల తిరుగుబాటు, ప్రజా విప్లవం సహజమైనవి మాత్రమే కావు, అవి అనివార్యమైనవి కూడా"**

**(ప్రజలు-విప్లవం అనే వ్యాసంలోనిది -కామ్రేడ్ లెనిన్)**

# సమస్త శ్రామిక ప్రజానీకం విముక్తికోసం వర్గపోరాటంలో తుదిశ్వాస వరకు దృఢంగా నిలబడి, వజ్రసంకల్పంతో పోరాడిన

# కామ్రేడ్ ప్రమీల (మీనా)కు అరుణారుణ జోహార్లు!



కామ్రేడ్ ప్రమీల అక్టోబర్ 12, 2018న, నరహంతక ఎ.పి గ్రేహౌండ్స్ పోలీసులు మల్కనగిరి జిల్లా, కటాఫ్ ఏరియా, ఒంద్రుపల్లి గ్రామం వద్ద అకస్మాత్తుగా చేసిన దాడిలో నేలకొరిగింది. ఆమె అమరత్వం పార్టీకి తీవ్రమైన నష్టాన్ని కల్గించింది. పార్టీ, పి.ఎల్.జి.ఎ శ్రేణులకు, విప్లవ ప్రజానీకానికి శోకాన్ని కలిగించింది. అయితే ఆమె విప్లవ జీవితం విప్లవ శ్రేణులకు ప్రేరణగా వుంటుంది. వారు తమ నెత్తుటి బాకీని తీర్చుకొనేందుకు మునుపటికన్నా మరింత పట్టుదలతో, కసితో తప్పకుండా శత్రువుపై గట్టిదెబ్బలు తీస్తారు.

కామ్రేడ్ ప్రమీల తెలంగాణ రాష్ట్రం, పాత ఉమ్మడి వరంగల్ జిల్లాలోని బచ్చన్నపేట మండలం, పోచన్నపేట గ్రామంలో దిగువ మధ్యతరగతి కుటుంబంలో రాములమ్మ, పోచయ్యలకు ఐదుగురిలో చివరి సంతానంగా 41 సంవత్సరాల క్రితం జన్మించింది. బచ్చన్నపేట గ్రామం భూస్వామ్య ఆధిపత్యానికి పెట్టని కోటగా ఉండేది. ఆ గ్రామం తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో ఒక ముఖ్యమైన భూమికనే పోషించింది. అక్కడి రైతాంగం భూస్వామ్య వ్యతిరేక పోరాటంలో గొప్ప చైతన్యాన్ని పొందారు. అయితే ఆ పోరాటం నాయకత్వ ద్రోహానికి గురి కావడం వలన, భూస్వామ్య ఆధిపత్యం ఆ గ్రామంలో తిరిగి నిలదొక్కుకున్నది. అయితే 1970ల చివరలో, సి.పి.ఐ(ఎమ్.ఎల్) పీపుల్స్‌వార్ నాయకత్వంలో ప్రారంభమైన సాయుధ రైతాంగ తిరుగుబాటులో, ఆ గ్రామ రైతాంగం తిరిగి భాగస్వాములయ్యారు. దీంతో పేద రైతాంగంగా వున్న ప్రమీల కుటుంబం కూడా విప్లవోద్యమంలో భాగస్వామి అయ్యింది. ఈ పరిస్థితి ప్రమీలను చిన్ననాటి నుండే విప్లవోద్యమంవైపు ఆకర్షించేలా చేసింది. ప్రమీల విప్లవ కార్యకలాపాలలో పాలువంచుకునేందుకు కుటుంబం నుండి ప్రోత్సాహం లభించింది. ఈ క్రమంలోనే 1993 ప్రారంభంలో కామ్రేడ్ ప్రమీల పూర్తికాలం కార్యకర్తగా పని చేసేందుకు నిర్ణయించుకొని, పార్టీలోకి వచ్చింది.

మొదట స్థానిక చేర్యాల ఏరియా దళంలో సభ్యురాలిగా చేరి, ఒక సంవత్సర కాలం, శారద పేరుతో ఆ దళంలో పనిచేసింది. ఆ తర్వాత ఉద్యమ అవసరాల రీత్యా కామ్రేడ్ ప్రమీలను, పార్టీ నెక్కొండ ఏరియా దళంలోకి బదిలీచేసింది. అక్కడే 1997 మధ్య వరకు పనిచేసింది. ఈ కాలంలోనే చదువు నేర్చుకొని, పార్టీ అందించిన రాజకీయాలతో తన విప్లవ చైతన్యాన్ని మెరుగు పర్చుకుంది. ప్రజలలో పనిచేసే అనుభవం సంపాదించుకుంది. ఆనాటికి జిల్లాలో ఉద్యమంపై అమలు జరుగుతున్న శత్రువు దాడిలో మొక్కవోని ధైర్యంతో, అనేక కష్టాలను ఎదుర్కొంటూ, అమరుల త్యాగాల స్ఫూర్తిని మదిలో నిలుపుకుంది. మిలటరీ రంగంలో చురుకుగా ఉంటూ దళానికి పైలట్‌గా పనిచేసింది. ఇదే కాలంలో, అంటే 1996లో ఉత్తర తెలంగాణ ఫారెస్టు డివిజన్ (వరంగల్, కరీంనగర్, ఖమ్మం అటవీ ప్రాంతం) కేంద్రంగా, మొదటి కంబాట్ ప్లాటూన్ ఏర్పడి పని చేయడం ప్రారంభించింది. కామ్రేడ్ ప్రమీలలో ఉన్న మిలటరీ రంగ సమర్థతలను గుర్తించిన పార్టీ, 1997లో ఆమెను కంబాట్ ప్లటూన్‌లోకి బదిలీ చేసింది. ఆమె ఆ నిర్ణయాన్ని మనస్ఫూర్తిగా స్వీకరించి అమలుచేసింది. ప్లటూన్‌లో ఒక సంవత్సరం పనిచేసిన తర్వాత 1998 మధ్యలో అనారోగ్యానికి గురైతే, వైద్యం కోసం ఒక సానుభూతిపరునితో కలిసి ప్రయాణిస్తుండగా ఒక ద్రోహి ఇచ్చిన సమాచారం ఆధారంగా పోలీసులు అరెస్టు చేసారు. శత్రువు చేజిక్కినపుడు పార్టీ రహస్యాలను రాబట్టడానికి ఎన్ని చిత్రహింసలకు గురిచేసినా, ప్రాణం కన్నా మిన్నగా పార్టీ రహస్యాలను కాపాడింది. తప్పుడు కేసులు బనాయించి వరంగల్ సెంట్రల్ జైలులో పెట్టారు. 8 నెలలు జైలు జీవితం గడిపి, బెయిలుపై విడుదలై నేరుగా పార్టీని వెతుక్కుంటూ వచ్చి ఉద్యమంలో భాగస్వామి అయింది. 1999లో ఉద్యమ అవసరాల రీత్యా, ఏటూరునాగారం దళంలోకి బదిలీ అయ్యింది. ఆ దళంలో పనిచేస్తున్నపుడే తాను ఇష్టపడిన కామ్రేడ్‌ను పార్టీ అనుమతితో పెళ్లి చేసుకుంది.

2000 సంవత్సరంలో, ఏరియా కమిటీ సభ్యురాలిగా పదవోన్నతిని పొందింది. తన పేరును జిలానిబేగం (సింగరేణి అమరురాలు)గా మార్చుకుంది. ఆ ప్రాంత ప్రజలతో, క్యాడర్‌తో

చొరవగా కలిసిపోతూ పనిచేసి, అందరి విశ్వాసాన్ని, అభిమానాన్ని చూరగొన్నది. అదే ఏరియాలో 2001లో ప్రత్యేక మహిళా దళానికి కమాండర్‌గా, ఆర్గనైజర్‌గా నియమిస్తూ, పార్టీ బాధ్యతలు ఇచ్చినపుడు సంతోషంగా స్వీకరించింది. ఈ దళం మహిళలలో పితృస్వామ్యానికి వ్యతిరేకంగానూ, వర్గదోపిడీ పీడనలకు వ్యతిరేకంగానూ చైతన్యం నింపుతూ, వారిని మిలిటెంట్ పోరాటాలలోకి సమీకరించి, విప్లవకర మహిళా సంఘంలోకి సంఘటితపర్చింది. ఈ క్రమంలోనే అనేక మంది మహిళలను పార్టీలోకి భర్తీ చేసి, పార్టీకి ఒక మంచి అనుభవాన్ని అందించింది.

2003 నాటికి ఉత్తర తెలంగాణ విప్లవోద్యమంపై శత్రువు ఎల్.ఐ.సి వ్యూహంలో భాగంగా బహుముఖ దాడిని మరింత తీవ్రతరం చేయడంతో, ఆ ప్రాంత ఉద్యమం ఆటు స్థితికి చేరింది. ఈ బహుముఖ దాడిలో పార్టీ నాయకత్వ నష్టాలు, ప్రజా పునాది బలహీనపడటం, ఉద్యమ ప్రాంతాలు కుదించుకుపోయి, అత్యంత కఠిన పరిస్థితులు ఎదురైనపుడు పార్టీ పంథాపైన, ప్రజలపైన, విప్లవ సిద్ధాంతంపైన ఎనలేని విశ్వాసాన్ని ప్రదర్శిస్తూ, దృఢమైన పట్టుదలతో విప్లవ ఆచరణను కొనసాగించిన అనేక మంది కామ్రేడ్స్‌లో తాను ఒకరై నిలిచి పనిచేసింది. ఈ క్రమంలోనే 2003లో మహదేవ్‌పూర్ ఎల్.ఒ.ఎస్‌కు కమాండర్‌గా బాధ్యతలు చేపట్టి ప్రజలకు నాయకత్వం వహించింది. ఈ కాలంలో పార్టీ చేపట్టిన సరైన రాజకీయ ఎత్తుగడల వలన ఎ.పిలో రాష్ట్ర ప్రభుత్వం పార్టీని చర్చలకు ఆహ్వానించవలసిన తప్పనిసరి పరిస్థితి ఏర్పడింది. ఈ పరిస్థితిని విప్లవోద్యమ పురోగమనానికి మంచి అవకాశంగా తీసుకొని, కామ్రేడ్ ప్రమీల తన దళంతో ప్రజలను పెద్దయెత్తున రాజకీయ పోరాటాలలోకి సమీకరించి, సాయుధ వ్యవసాయిక విప్లవ కార్యక్రమాన్ని చురుకుగా అమలుచేస్తూ, ప్రజాపునాదిని పునర్నిర్మించి తిరిగి పార్టీలోకి అనేక మంది యువతీయువకులను భర్తీ చేసింది.

కామ్రేడ్ జిలానీ 2003లో గర్భసంచిలో గడ్డలు ఏర్పడి తీవ్రమైన అనారోగ్యానికి గురైంది. ఆపరేషన్ చేసి గర్భసంచి తొలగించారు. ఆ అనారోగ్యంతో గెరిల్లా జీవితం గడపడం మరింత సమస్యగా మారింది. ఈ క్రమంలో 2005లో మరోమారు వైద్య పరీక్షలకు హాస్పటల్‌కు వెళ్లినపుడు విజయవాడలో ఎ.పి ఎస్.ఐ.బివాళ్లు అరెస్టుచేసి, తీవ్రమైన చిత్రహింసలకు గురిచేసారు. ఈ సందర్భంగా పోలీసులు కామ్రేడ్ ప్రమీలపై అనేక జిల్లాలకు సంబంధించిన పదుల సంఖ్యలో కేసులను మోపి, మరోమారు వరంగల్ సెంట్రల్ జైలుకు పంపారు. అక్కడ జైలులో ఉన్న నాయకత్వ కామ్రేడ్స్‌తో కలిసి, రాజకీయ ఖైదీల హక్కుల కోసమూ, జైళ్లలోని సాధారణ ఖైదీల హక్కుల కోసమూ, పోరాటాలు చేపట్టి ప్రభుత్వ మెడలు వంచి అనేక సమస్యలను పరిష్కరించుకున్నారు. ఒక సంవత్సరం 4 నెలలు జైలు జీవితం తర్వాత కండిషన్ బెయిల్‌పై 2006లో విడుదలయింది. కానీ ఆనాటికి ఆరోగ్యం మరింత క్షీణించింది. విప్లవ దృఢసంకల్పం ముందు ఆరోగ్య సమస్య అప్రధానమని, పార్టీ ఇచ్చే ఏ పని అయినా చేపట్టి, తుదిశ్వాస వరకు విప్లవ లక్ష్యసాధన కోసం అంకితమై పనిచేయాలని నిర్ణయించుకొని, విడుదలయిన కొద్ది రోజులకే విప్లవోద్యమంలో భాగమైంది. కానీ ఉత్తర తెలంగాణలో, ఈ కాలం విప్లవోద్యమానికి, పార్టీకి అత్యంత కఠిన పరీక్షా కాలం. ఆ పరిస్థితులలో అనారోగ్యాన్ని అధిగమిస్తూ, ప్రజల మధ్యే ఉండి పనిచేసింది. శత్రువు చేపట్టే అనేక చుట్టివేత దాడులను ధైర్యంగా ఎదుర్కొంటూ, ప్రతిఘటిస్తూ, ప్రజల మద్దతుతో 2008 వరకు కె.కె.డబ్ల్యు డివిజన్‌లో పనిచేసింది.

ఉత్తర తెలంగాణలో మరింత తీవ్రతరమైన శత్రువు దాడి నేపథ్యంలో, మన డిఫెన్స్ ఎత్తుగడలలో భాగంగా, స్వీయాత్మక శక్తులను కాపాడుకోవడానికి కొద్ది మంది నాయకత్వ కామ్రేడ్స్‌ను అక్కడి నుండి బదిలీ చేయాలని నాయకత్వ కమిటీలు చేసిన నిర్ణయంలో భాగంగా, 2008 చివర్లో తన సహచరుడితో కలిసి ఎ.ఒ.బి ఉద్యమంలో చేరింది. అయితే తన కఠినమైన, ఎ.ఒ.బి టెర్రెయిన్‌లో పని చేసేందుకు అనారోగ్యంతో వున్న తనకు కష్టమని తెలిసినప్పటికీ, మరింత కష్టభరితం అయిందే. అయినా పార్టీ నిర్ణయానికి కట్టుబడి, విప్లవ ప్రయోజనాలకే మొదటి ప్రాధాన్యతనిస్తూ, ఎలాంటి శషభిషలు లేకుండా ఎ.ఒ.బిలో కర్తవ్య నిర్వహణను చేపట్టింది.

2009 ప్రారంభంలో పార్టీ నిర్ణయం మేరకు మల్కన్‌గిరి డివిజన్‌లోని, పాడియా ఏరియా కమిటీలో భాగమైంది. మీనాగా పేరు మార్చుకొని, ఆ ప్రాంతంలోని పరిస్థితులపై పట్టు సంపాదించి, విప్లవాన్ని పురోగమింప చేసేందుకు దృఢసంకల్పంతో పనిచేసింది. 2009లో జరిగిన జిల్లా ప్లీనంలో ఆల్టర్‌నేటివ్ జిల్లా కమిటీ సభ్యురాలిగా ఎన్నుకోబడి, తర్వాత జిల్లా కమిటీలోకి కో ఆప్ట్ అయ్యింది. 2009 నుండి 2015 చివరి వరకు పాడియా ఏరియా కార్యదర్శిగా, డివిసి సభ్యురాలిగా ఆ ప్రాంత ఉద్యమానికి ప్రత్యక్షంగా నాయకత్వం వహించింది. 2009లోనే దేశవ్యాప్త విప్లవోద్యమంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా ఆపరేషన్ గ్రీన్‌హంట్ పేరుతో బహుముఖ దాడిని తీవ్రతరం చేసాయి. కార్పెట్ సెక్యూరిటీ, అనేక చుట్టివేత, అణచివేతల మధ్య నూతన సవాళ్లను ఎదుర్కొంటూ, ప్రజల మధ్య నీళ్లలో చేపలా కలిసిపోయి పనిచేసింది. దున్నేవారికే భూమి, విస్థాపన, సాగునీరు, గిట్టుబాటు ధరలు వగైరా సమస్యలపై వేలాది మంది ప్రజలను కదిలించి పోరాటాలు నిర్మించి, ప్రజలను విప్లవకర వర్గ సంఘాలలోకి సంఘటితపరిచింది. గ్రామ స్థాయిలో తెగ ఆధిపత్య రాజకీయ అధికారాన్ని కూలదోస్తూ, ప్రజల ప్రజాస్వామిక అధికారాన్ని నెలకొల్పే కృషిని సాగించింది. అనేక మంది యువతీ యువకులను పి.ఎల్.జి.ఎలోకి భర్తీ చేసింది. స్థానిక శత్రువు ఏజెంట్లను శిక్షించి, శత్రువు దాడుల నుండి ప్రజలను, ప్రజా నిర్మాణాలను రక్షించుకోవడానికి నాయకత్వం అందించింది. ప్రజలలో గొప్ప విశ్వాసాన్ని చూరగొన్నది. అదే సమయంలో శత్రువుకు ముఖ్య టార్గెట్‌గా మారింది. శతృవు ఆమెను టార్గెట్‌చేస్తూ చేసిన అనేక దాడుల నుండి ప్రజల మద్దతుతో తోటి కామ్రేడ్స్ సహకారంతో ప్రతిఘటిస్తూ, సురక్షితంగా తప్పుకొని, ప్రజలకు నాయకత్వం అందించింది.

2016లో మల్కన్‌గిరి-కోరాపుట్-విశాఖ సరిహద్దు (ఎమ్.కె.వి.బి) డివిజన్‌కు పార్టీ బదిలీచేసింది. 2017 వరకు పెదబయలు ఏరియాలో పనిచేసింది. కొండలు, గుట్టలకు తోడు నిరంతర గ్రేహౌండ్స్ బలగాల కూంబింగ్‌ల మధ్య ఆరోగ్యం సహకరించకపోయినా, విప్లవ దృఢసంకల్పంతో ప్రజల మధ్య పనిచేసి, అనతి కాలంలోనే ప్రజలలో మరిచిపోలేని ముద్రవేసింది. 2017లో డి.వి.సి సెక్రటేరియట్ సభ్యురాలిగా ఉంటూ, డివిజన్ ప్రజారంగం బాధ్యతలను స్వీకరించి పనిచేసింది. ఆరోగ్యం క్రమంగా క్షీణిస్తూ వచ్చింది. తన అనారోగ్య సమస్యలను పార్టీ

ముందుంచుతూనే, తనకు అప్పగించిన పనులను బాధ్యతాయుతంగా అమలు చేసింది.

విప్లవకారుల జీవితం నుండి మనం గ్రహించవలసిన, అనుసరించవలసిన పాజిటివ్స్‌ను భవిష్యత్తు తరాలకు అందిపుచ్చుకొని అభివృద్ధి పర్చుకోవాల్సినవి, ఆచరించాల్సినవి ఉంటాయి. కామ్రేడ్ ప్రమీల తన విప్లవ జీవితంలో ఇటువంటి పలు విప్లవకర విలువలను నిలిపింది.

పీడితవర్గంలో, అణచివేతకు గురౌతున్న కులంలో పుట్టి, పితృస్వామిక సమాజంలో మహిళగా వివక్షతకుగురై, విప్లవం ఒక అవసరంగా భావించి, వ్యవస్థ సమూల మార్పుకోసం, సాయుధ పోరాట మార్గం ఎంచుకొని, నమ్మిన ఆశయం కోసం చివరి నెత్తుటిబొట్టు వరకు అంకితమై పనిచేసింది.

విప్లవం కోసం చదువు నేర్చుకొని, విప్లవ సిద్ధాంతాన్ని అధ్యయనం చేసింది. యుద్ధం కోసం శరీరాన్ని తీర్చిదిద్దుకొని, మిలటరీ రంగంలో శిక్షణపొంది, ప్రత్యక్షంగా యుద్ధంలో పాల్గొని నాయకత్వాన్ని కూడా అందించింది.

వ్యూహం-ఎత్తుగడలకు అనుగుణంగా నిజమైన శత్రువులకు వ్యతిరేకంగా, నిజమైన మిత్రులను కూడగట్టి ఎలా పోరాడి అధికారం హస్తగతం చేసుకోవాలో నేర్చుకొని, మంచి ఆర్గనైజర్‌గా ఎదిగింది. ప్రజలే చరిత్ర నిర్మాతలనే సిద్ధాంతాన్ని నమ్మింది. అందుకు ప్రజలను అమితంగా ప్రేమించింది. వర్గశత్రువులంటే ఎనలేని కసిని ప్రదర్శించింది.

పార్టీలో తప్పులకు వ్యతిరేకంగా అంతర్గత పోరాటంలో నిర్మోహమాటంగా, సూటిగా విమర్శలు చేయడం, సూత్రబద్ధమైన ఐక్యత-పోరాటం-ఐక్యత పద్ధతి అనుసరించేది. వైవాహిక జీవితాన్ని విప్లవ ప్రయోజనాలకు లోబడి కొనసాగించింది. ఏ రూపంలో ఉన్న పితృస్వామ్యాన్ని అయినా ప్రశ్నించేది. విప్లవ ప్రజాస్వామిక సంస్కృతిని, విలువలను ఆచరించాలని నమ్మింది.

ప్రమాదవశాత్తు రెండు సందర్భాల్లో శత్రువు చేజిక్కినపుడు ఎన్ని చిత్రహింసలు పెట్టినా, అనేక తప్పుడు కేసులు బనాయించి జైళ్లలో నిర్బంధించినా, మొక్కవోని ధైర్యంతో అంతటా పోరాటాన్నే కొనసాగించింది తప్ప, రాజీ పడలేదు. అవకాశం రాగానే ఎలాంటి తటపటాయింపులు లేకుండా విప్లవంలో భాగస్వామి అయి రెట్టించిన పట్టుదలతో పనిచేసింది. తన కోసం కుటుంబ సభ్యులను జైళ్లలో పెట్టినా, ప్రజలలో ఒకరిగానే భావించి వారికి రాజకీయాలు బోధించి ధైర్యం చెప్పింది తప్ప, స్వార్థంతో ఏనాడు ఆలోచించలేదు.

దీర్ఘకాల ప్రజాయుద్ధ నియమాలకు లోబడి, ఉద్యమంలోని ఆటు-పోటులు, గెలుపు-ఓటములు, కష్ట-నష్టాలను శాస్త్రీయంగా అర్థం చేసుకునేది. ఉత్తర తెలంగాణలో ప్రజాయుద్ధంపై ప్రతీఘాతుక విప్లవం పైచేయి సాధించినప్పుడు గుండె జారిపోలేదు. ఆ కష్టకాలంలో పార్టీ ఇచ్చిన పిలుపులను, ఎత్తుగడలను నిర్దిష్ట పరిస్థితులకు అన్వయించి, అమలుచేయడంలో అనుభవాన్ని పొందింది. సెట్‌బ్యాక్ స్థితిలో వున్న ఎ.ఒ.బి ఉద్యమంలో కూడా ఎంతో నిబ్బరంగా, అచంచల విశ్వాసంతో శక్తివంచన లేకుండా ఉద్యమ పురోగమనానికి కృషి చేసింది. కొందరు సీనియర్ కామ్రేడ్స్ ఈ దాడిలో పిరికితనంతో బద్మాష్‌లుగా మారి, శత్రువు పాదాల చెంతచేరి విప్లవ ద్రోహులుగా మారినా ప్రజలను, క్యాడర్‌లను విప్లవంవైపు నిలబెడుతూ, శత్రువు కుట్రలను బహిర్గతపర్చింది.

తన 23 ఏళ్ళ సుదీర్ఘ విప్లవ జీవన ప్రయాణంలో ఉద్యమ డిమాండుకు అనుగుణంగా తనను తాను మలచుకుంటూ ఏ ప్రాంతానికైనా, ఏ రంగానికైనా పార్టీ ఎంపికచేసి పంపినపుడు మనస్ఫూర్తిగా ఆమోదించి పనిచేసింది. విప్లవకారులకు ప్రాంతాలుండవు, భాషపరిమితులుండవని అంతర్జాతీయ కార్మికవర్గ దృక్పథం ప్రదర్శించి పనిచేసింది. తీవ్రమైన అనారోగ్యం వలన వైద్యం సకాలంలో అందకపోయినా, శత్రువు దాడిచేస్తే నష్టపోతానని అంచనా వున్నా, శక్తినంతా కూడదీసుకొని అమరుల ఆశయాన్ని ముందుకు తీసుకుపోతూ, వారి బాటలో నమ్మిన ఆశయం కోసం తన ప్రాణాలను ఫణంగా పెట్టి, పోరాడి అమరురాలై ఆదర్శప్రాయురాలయింది. నీ త్యాగం ఫలిస్తుంది. ఈ విప్లవం జయిస్తుంది. ఈ స్ఫూర్తితోనే మేము పని చేస్తాం. ఇదే మేము నీకిచ్చే నివాళి! ●

---

గోర్కీ రచనలలో నాకు ప్రియతమమైన వాక్యమిది

**"నువ్వు చనిపోవు, కానీ జడుపు ఎరగని దిటవు గుండెల నుండి వెడలే పాటలో,**

**నువ్వు ఎల్లప్పుడూ సజీవమైన ఉదాహరణగా, స్వాతంత్ర్యానికీ,**

**వెలుగుకూ సగర్వమైన పిలుపుగా వుంటావు!"**

**దీనిని మన యువత మరింత తరుచుగా పఠింతురు గాక**

మీ కుజ్నెత్సోవ్

*(2వ ప్రపంచ యుద్ధకాలంలో సోవియట్ గెరిల్లాల వీరగాథ 'దిటవు గుండెలు' నవల నుండి)*

రచయిత -దిమిత్రియ్ మెద్వేవ్

# బాలల సంఘం నుండి ఎల్.ఒ.ఎస్ కమాండర్‌దాక
# తన విప్లవ ప్రస్థానంలో మడమతిప్పనియోధుడు
# కామ్రేడ్ ఉంగాసోడి (కీర్తి)కి అరుణారుణ జోహార్లు!



కామ్రేడ్ కీర్తిది ఒడిశా రాష్ట్రంలోని మల్కనగిరి జిల్లా, కలిమెల బ్లాక్, తెల్లరాయి పంచాయితీలోని రాజులకొండ గ్రామం. ఇతని వయస్సు 25 సంవత్సరాలు. కామ్రేడ్ కీర్తి కుటుంబం గతంలో పొడియా ప్రాంతంలో నివసించేవారు. అయితే అక్కడ వారు జీవించడానికి అవసరమైన భూమి లభించకపోవడంతో, 40-50 సంవత్సరాల క్రితమే కుటుంబంతో సహా కలిమెల ప్రాంతానికి వచ్చి, రాజులకొండ గ్రామంలో నివాసం ఏర్పర్చుకున్నారు. కీర్తి జన్మించడానికి ముందు నుండే ఈ ప్రాంతంలో విప్లవోద్యమం కొనసాగుతున్నది. దీనియొక్క ప్రభావంతో కీర్తి 12 సంవత్సరాల వయస్సులో బాలలసంఘంలో చేరాడు. అనంతరం జి.ఆర్.డిలో చేరి, పార్టీ అప్పజెప్పిన ప్రతి పనిలో క్రియాశీలంగా పాల్గొన్నాడు. 2009లో పార్టీ పూర్తికాలం కార్యకర్తగా రిక్రూట్ అయ్యాడు. ప్రారంభంలో డివిజన్ సాయుధ జి.ఎన్.ఎస్‌లో పని చేశాడు. గ్రామాలలో అనేక ప్రదర్శనలు యిచ్చి, ప్రజలలో విప్లవ రాజకీయాలు ప్రచారం చేశాడు. సాంస్కృతిక రంగం అభివృద్ధికి జరిగిన కృషిలో తనవంతు పాత్రను చురుకుగా మనస్ఫూర్తిగా, పట్టుదలగా పోషించాడు. గ్రామస్థాయిలో నూతనంగా అనేక మంది విప్లవ సంస్కృతిక కార్యకర్తలను తీర్చిదిద్దాడు. ఈ రంగంలో తనకు బాధ్యుడుగా పని చేసిన నాయకత్వ కామ్రేడ్‌లో తలెత్తుతున్న కార్మికవర్గేతర ధోరణులను సూటిగా విమర్శించేవాడు. 2010 నాటికి దళంలో తలెత్తిన డీవియోషన్స్‌తో, బాధ్యత వహిస్తున్న కామ్రేడ్‌ను బదిలీ చేయడంతోపాటు, దళాన్ని కూడా రద్దు చేసుకోవలసి వచ్చింది. ఆ తర్వాత పొడియా దళంలోకి సభ్యుడిగా బదిలీ చేయబడ్డాడు. మితభాషి అయినా కీర్తి ప్రతి విషయాన్ని లోతుగా పరిశీలిస్తూ, సరైన భావాలను అభివృద్ధి పర్చుకునేవాడు. శ్రద్ధగా చదువు నేర్చుకొని, విప్లవ సిద్ధాంత, రాజకీయాలను ఒక క్రమపద్ధతిలో అధ్యయనం చేస్తూ, తన చైతన్యాన్ని పెంచుకున్నాడు. 2010 నాటికి మల్కనగిరి జిల్లాలోని జి.ఎన్.ఎస్ దళం రద్దుయిన తర్వాత పొడియా దళంలోకి సభ్యుడిగా బదిలీ అయ్యాడు. అక్కడ అందరితో కామ్రేడ్ కీర్తి తొందరగా కలిసిపోవడం, ప్రజలతో ఐక్యం కావడం చేస్తూ, తను నేర్చుకున్న విప్లవ రాజకీయాలను ఎంతో ఓపిగ్గా ప్రజలకు అర్థం చేయించేవాడు. ఇలా చేస్తూనే అక్కడి ఏరియా కమిటీలో ఆధారపడదగ్గ వ్యక్తిగా కామ్రేడ్ కీర్తి అభివృద్ధి చెందాడు. దీంతో కామ్రేడ్ కీర్తి యొక్క ఎదుగుదల, సమర్ధతలను పరిగణలోకి తీసుకున్న పార్టీ, అతనిని 2011లో పొడియా ఏరియా కమిటీ సభ్యుడిగా బాధ్యతలు అప్పజెప్పింది.

ఎ.సి సభ్యుడిగా పొడియా ప్రాంత ఉద్యమాన్ని ముందుకు తీసుకుపోవడానికి తీవ్రంగా కృషి చేశాడు. ఈ ప్రాంత ప్రజల తమ మౌలిక సమస్యల పరిష్కారానికి జరుగుతున్న ఉద్యమంలో దున్నేవారికే భూమి-విప్లవ రైతుకూలీ సంఘాలకే అధికారం' అనే నినాదం కేంద్రంగా చురుకైన సాయుధ వ్యవసాయక విప్లవ కార్యక్రమాన్ని అమలు జరుపుతూ, పోరాటాలలో చురుకుగా కదులుతున్న ప్రజలను, వివిధ ప్రజా నిర్మాణాలలోకి సంఘటితపరిచే కృషిలో క్రియాశీలకంగా పాల్గొన్నాడు. వర్గ పోరాటాన్ని ముందుకు తీసుకుపోవడంలో భాగంగా, గ్రామపెద్దలు, పెత్తందార్లు, పూజారులు, ప్రజావ్యతిరేకులపై చేసిన అనేక పోరాటాలలో ముఖ్యమైన పాత్ర పోషించాడు.

సెప్టెంబర్‌లో 2013లో శీలకోట గ్రామం సమీప అడవిలో పక్క సమాచారంతో ఎస్.పి నాయకత్వంలో ప్రత్యేక బలగాలు దాడి జరిపి, నిరాయుధులైన 13 మంది మిలీషియా సభ్యులను అత్యంత క్రూరంగా హత్య చేశారు. ఈ సంఘటన తర్వాత శత్రువు ప్రజలను, ప్రజా నిర్మాణాలను లొంగదీసుకోవాలనే ప్రయత్నం చేశాడు. కానీ, ఈ సంఘటనకు కారకులైన ద్రోహులను ప్రజల సహకారంతో గుర్తించి, వారి ఆమోదంతో వెంటనే శిక్షలు విధించడం జరిగింది.

**తరువాయి భాగం 36వ పేజీలో...**

# నారాయణపట్నా భూమి పుత్రిక కామ్రేడ్ సిమ్మో (రుప్పి, సుశీల) అమర్ రహే!



భారతదేశంలో పశ్చిమబెంగాల్, లాల్‌గఢ్ తర్వాత ఒడిశాలోని కోరాపుట్ జిల్లా, నారాయణపట్నా ఆదివాసీ రైతాంగం చేసిన భూపోరాటం దేశవ్యాప్తంగా గొప్ప ప్రభావాన్ని వేసింది. అది నారాయణపట్నా ప్రాంతంలోని యువతీ, యువకులను కూడా గొప్ప ఉత్తేజితులను చేసింది. సాయుధ పోరాట మార్గంలోకి ఆకర్షితులను చేసింది. అలాంటి వర్గ పోరాటంలో వికసించిన ఒక ఎర్రమందారం కామ్రేడ్ సుశీల. తల్లిదండ్రులు పెట్టిన పేరు వాడిక సిమ్మో. కామ్రేడ్ సిమ్మో నారాయణపట్నా భూపోరాటానికి కేంద్రమైన పొడపొదర్ గ్రామంలో జన్మించింది. నారాయణపట్నా భూపోరాటాన్ని గొప్ప మిలిటెంట్‌గా నడిపించడంలో, ధైర్యసాహసాలకు మారు పేరుగా నిలిచి, 2009 అక్టోబర్ 20 వ తేదీన నారాయణపట్నా స్టేషన్ వద్ద ఆందోళన చేస్తున్న ప్రజలపై విచ్చలవిడిగా జరిపిన పోలీసుకాల్పుల్లో ప్రజలకు ముందు వరసలో వుండి అమరత్వం చెందిన కామ్రేడ్ సింగన్నకు సుశీల స్వయాన ముద్దుల చెల్లెలు. కుటుంబంలో ఆఖరి సంతానంగా ఆడపిల్లగా పుట్టిన సుశీలను అల్లారు ముద్దుగా పెంచారు. సింగన్నకు కూడా చిన్న చెల్లెలు సిమ్మో అంటే ఎంతో అభిమానం వుండేది. భూపోరాటం ఉవ్వెత్తున ఎగసిన ఆ కాలంలో యువతీ, యువకులను పి.ఎల్.జి.ఎలో చేరాలని పార్టీ పిలుపునివ్వడంతో, సంఘ నాయకులు తమ తమ గ్రామాల నుండి యువతీ, యువకులను పంపారు. పొడపొదర్ గ్రామం నుండి మరికొంత మందితోపాటు, కామ్రేడ్ సింగన్న స్వయాన తన చెల్లెలు సిమ్మోను కూడా పార్టీలోకి పంపించాడు. అలా 2009 మధ్యలో పార్టీలోకి వచ్చిన కొంత కాలానికి తనకు అత్యంత ప్రియమైన అన్న కామ్రేడ్ సింగన్న అమరత్వం సిమ్మోను ఎంతో కలచివేసినప్పటికీ, మరింత వర్గకసితో, దృఢంగా ఉద్యమంలో నిలబడింది. కొంతకాలం స్థానికంగా పని చేసిన తర్వాత 2010లో నాయకత్వ రక్షణ కోసం ఏర్పాటు చేసిన పి.ఎస్ (ప్రొటక్షన్ దళం)లోకి పంపాలని పార్టీ నిర్ణయించింది. పి.ఎస్. అంటే ఎక్కడైనా వెళ్ళాల్సి ఉంటుంది. స్థానికంగానే ఉండటం సాధ్యం కాదు అని పార్టీ నిర్ణయాన్ని తనకు తెలియజేసినప్పుడు ఎటువంటి శషభిషలు లేకుండా, పార్టీ నిర్ణయాన్ని ఆమోదించి ఉన్నత చైతన్యాన్ని ప్రదర్శించింది. 2010లో కామ్రేడ్ రుప్పి పేరుతో పి.ఎస్‌లో భాగమైంది. అక్కడ నాయకత్వ కామ్రేడ్స్ రక్షణ విషయంలోనూ, వారి బాగోగులను పట్టించుకోవడంలోనూ, అవసరమైన సహకారాన్ని అందించడంలో ఎంతో బాధ్యతగా, సేవాదృక్పథాన్ని కలిగి వుంటూ, తనకు అప్పజెప్పిన పనులను చేసేది. రోజువారి కార్యక్రమాల్లో చురుగ్గా వుంటూ, పార్టీ విద్యను, పార్టీ చెప్పే సిద్ధాంత, రాజకీయాలను అర్థం చేసుకుంటూ, తన రాజకీయ అవగాహనను, చైతన్యాన్ని పెంచుకోవడానికి కృషి చేసింది. ఈ క్రమంలో అదే దళంలో పని చేసే మరో కామ్రేడ్‌తో పెళ్ళి అవగాహనకు వచ్చి, స్వేచ్ఛగా తన అభిప్రాయాన్ని పార్టీకి తెలియజేయడంతో పార్టీ కూడా ఆమోదించింది. అలా 2014 అక్టోబర్‌లో పార్టీ వారికి వివాహం జరిపి, పి.ఎస్ నుండి రిలీవ్ చేసింది. ఆ తర్వాత తనను పార్టీ మల్కన్‌గిరి జిల్లా, కలిమెల ఏరియాకు బదిలీ చేయడంతో కామ్రేడ్ సుశీలగా ఆ ఉద్యమంలో భాగమయ్యింది. అక్కడి ఉద్యమాన్ని, ప్రజల భాషను, ఆచార సాంప్రదాయాలను అర్థం చేసుకుంటూ, నేర్చుకుంటూ ప్రజల్లో మమేకమయ్యింది. ఈ క్రమంలో కొంత అనారోగ్యానికి గురైనప్పటికీ, చైతన్యవంతంగా అధిగమించడానికి కృషి చేసింది. 2017 నుండి ఒక సంవత్సర కాలం పాటు, డాక్టర్‌గా దళంలోనూ, ఆ ఏరియా ప్రజలలోను తన సేవలను అందించి ప్రజల ఆదరాభిమానాలను చూరగొన్నది. ఏరియాలో ఇన్‌ఫార్మర్ నెట్‌వర్క్‌ను క్లియర్ చేసే చర్యలలో ఇచ్చిన బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించేది. అలా తన చైతన్యాన్ని, ఎదుగుదలను గుర్తించి పార్టీ తనకు 2018 ఆగస్టులో ఎ.సి సభ్యురాలిగా ప్రమోషన్ ఇచ్చింది. తను దాన్ని ఎంతో బాధ్యతగానే స్వీకరించి, ఏరియా ఉద్యమంలో మరింతగా తన సేవలు అందించడానికి కృషి చేస్తున్న క్రమంలో, అనతి కాలంలోనే 2018 నవంబర్ 5వ తేదీన పప్పులూరు ఏరియా చందురుపల్లి వద్ద దళం వుందన్న సమాచారంతో, పోలీసులు చుట్టుముట్టి జరిపిన కాల్పుల్లో రిట్రీట్ అవుతుండగా మరో పోలీసు బ్యాచీ దొంగచాటుగా జరిపిన కాల్పులలో ఎ.సి మెంబర్ కామ్రేడ్ కీర్తి, పార్టీ సభ్యురాలు కామ్రేడ్ సున్నిలతో పాటు కామ్రేడ్ సుశీల కూడా ఆఖరి శ్వాస విడిచింది. వీరి అమరత్వం ఆ ఏరియా ఉద్యమానికే కాక ఎ.ఒ.బి జోన్ ఉద్యమానికి కూడా తీవ్రమైన నష్టమే. ఈ అమరుల త్యాగాల స్ఫూర్తితో మరింత వర్గకసితో ప్రజాయుద్ధాన్ని తీవ్రతరం చేయడం ద్వారా అమరుల ఆశయాన్ని కొనసాగిద్దాం. అమరులకు నివాళు లర్పిద్దాం! ●

# శ్రామిక జీవన సౌందర్యానికి నమూనగా నిలిచిన

# కార్మికవర్గ పుత్రుడు కామ్రేడ్ అడ్మాల్

## ఆదర్శాలను, ఆశయాన్ని ఎత్తిపడుదాం! ముందుకు తీసుకుపోదాం!



చత్తీస్‌గఢ్ రాష్ట్రంలోనీ, బీజాపూర్ జిల్లా, జేగురుగొండ ఏరియాలోని జొన్నగూడెం గ్రామంలో 23 సంవత్సరాల క్రితం నిరుపేద ఆదివాసీ కుటుంబంలో కామ్రేడ్ అడ్మాల్ జన్మించాడు. దండకారణ్య ఉద్యమ నెలబాలుడుగా ఎదిగాడు. అతని బాల్యమంతా ఆటపాటలతో ప్రశాంతంగా సాగలేదు. ఆ ప్రాంతంలో పురుడుపోసుకుంటున్న జనతనసర్కార్‌లను చూసి, భీతిల్లిన శత్రువు ప్రజలపై అమానవీయమైన యుద్ధాన్ని కొనసాగించాడు. సల్వాజుడుం పేరుతో సామూహిక మానవ హననం, అమానవీయమైన అత్యాచారాలు, హత్యలు, గృహదహనాలు, ఆస్తుల విధ్వంసాన్ని అత్యంత క్రూరంగా అమలు జరిపాడు. యుద్ధం చేస్తూనే తమని తాము రక్షించుకోవాల్సి వచ్చింది. 2005లో జొన్నగూడ గ్రామం అనేకసార్లు దాడులకు గురయ్యింది. అయినా ప్రజలు పోరాటం వదులుకొని లొంగిపోలేదు. గ్రామాన్ని ఖాళీ చేసి, శత్రువుకు అంతుచిక్కని పద్ధతిలో రహస్యంగా అడవిలో కొత్త గ్రామాన్ని నిర్మించుకొని శత్రువుతో గెరిల్లా యుద్ధాన్ని చేశారు. చివరకు సల్వాజుడుంని ఓడించి విజయం సాధించారు. యుద్ధమే తనను ముద్దాడుతూ పెంచింది. చిన్న తనంలోనే తల్లిదండ్రులకు తోడుగా, వారి శ్రమలో భాగం అవుతూ, పశువుల కాపరిగా మారాడు. గ్రామ బాలల సంఘంలో సభ్యుడుగా చేరాడు. చిన్ననాటి నుండే ఉద్యమ అమరుల పాటల పట్ల ఆసక్తిని కనబర్చేవాడు. పాటలపట్ల తనకున్న ఇష్టాన్ని గమనించిన సి.ఎన్.ఎమ్ కామ్రేడ్స్, పి.ఆర్‌గా వచ్చేందుకు అడ్మాల్‌ను దానిలో సభ్యుడిగా చేర్చుకున్నారు. విప్లవ రాజకీయాలనూ, ప్రజాస్వామిక సంస్కృతిని ప్రజల్లోకి తీసుకుపోయి, వారి చైతన్య స్థాయిని పెంచే కృషిలో చురుకుగా పాల్గొన్నాడు. పూర్తికాలం ప్రజలకోసం పని చేసే సంసిద్ధతను పెంచుకొని, పార్టీ ముందు ప్రతిపాదన చేశాడు. 2010లో పార్టీ కామ్రేడ్ అడ్మాల్‌ను పి.ఎల్.జి.ఎలోకి రిక్రూట్ చేసుకున్నది. ప్రజాయుద్ధానికి యుద్ధ సామాగ్రి అవసరాలు పెరిగాయి. సప్లైల కొరతను పరిష్కరించుకోవాల్సిన కర్తవ్యం పార్టీ ముందుకు వచ్చింది. అందుకు సి.ఆర్.సి క్రింద ఏర్పాటైన సప్లై విభాగంలో సభ్యుడిగా ఎ.ఒ.లో పని చేసే సి.ఆర్.సి సప్లైదళానికి 2011లో సభ్యుడిగా నిర్ణయించింది. ఎ.ఒ.బి జోన్ తనకి కొత్త ప్రాంతం, భూభాగంతో పరిచయం లేదు. తెలియని భాష అయినప్పటికీ, పార్టీ అప్పగించిన కర్తవ్యాన్ని మనస్ఫూర్తిగా స్వీకరించి ఎ.ఒ.బికి వచ్చాడు. అనతికాలంలోనే ఈ ప్రాంత ప్రజల భాషను పట్టుదలగా నేర్చుకున్నాడు. వారితో మమేకం అయ్యాడు. చదువు నేర్చుకొని క్రమంగా ఆ దళానికి టీచర్‌గా పని చేసే స్థాయికి ఎదిగాడు. ఎ.ఒ.బిలోని అన్ని ప్రాంతాలను కలియ తిరిగాడు. దేనినైనా ఒకసారి చూస్తే అట్టే గుర్తు పెట్టుకునేవాడు. ఆ దళానికి పయిలెట్‌గా మారి, జోన్‌లోని ఏ ప్రాంతానికైనా, శత్రువు ఆటంకాలు కల్పించినా, నూతన మార్గాలలో దళాన్ని గమ్యానికి చేర్చేవాడు. ఒడియా, తెలుగు భాషలను నేర్చుకొని ఆ ప్రాంతానికి వెళ్ళినప్పుడు స్థానికులతో ఆ ప్రాంత ప్రజలతో ఒకడుగా మారిపోయి, వారి ఆదరాభిమానాలను చూరగొనడంలో తన ప్రత్యేకతను చాటుకొని అందరు గుర్తుపెట్టుకునేలా ముద్ర వేసేవాడు.

సి.ఆర్.సి తనకు అప్పగించిన కర్తవ్యాల నిర్వహణలో అనేక కష్టాలకు ఓర్చి, జోన్‌ల మధ్య సమన్వయం, యుద్ధ అవసరాలను తీర్చడానికి సప్లైలు అందించడంలో అవిశ్రాంతంగా పని చేశాడు. సప్లైలతో పాటు, పార్టీ తనకు ఏ పని అప్పగించినా అందులో ఒదిగిపోతూ, పట్టుదలగా, సమయస్ఫూర్తితో నిర్వహించుకొని రాగలిగేవాడు. ఎంతటికష్టమైనా, ఎంతదూరముతో కూడిన ప్రయాణాలైనా, ఎన్నిసార్లైనా విశ్రాంతి కోరుకోకుండా, శక్తి వంచన లేకుండా అవిశ్రాంతంగా పీడిత ప్రజల విముక్తి లక్ష్యంగా పని చేసిన నిజమైన కార్మికవర్గ పుత్రుడు. పార్టీ ఆధారపడిన, నమ్మదగిన, క్రమశిక్షణాయుతమైన కామ్రేడ్‌గా ఎదిగాడు. అన్ని విషయాలను నిశితంగా, విమర్శనాత్మక దృష్టితో పరిశీలించేవాడు. పార్టీ పద్ధతులనూ, నియమాలనూ, క్రమశిక్షణనూ ఎవరు ఉల్లంఘించినా, వాటి యెడల ఉదారంగా వున్నా సూటిగా విమర్శలు చేసేవాడు.

పార్టీ చేపట్టిన బోల్షివీకరణ కార్యక్రమంలో తనను తాను ఉద్యమ అవసరాలకు తగిన విధంగా తీర్చి మలుచుకోవడంలో అందరికి ఆదర్శంగా నిలిచాడు. 2018 జూన్‌లో పార్టీ తనను ఎ.సి.ఎమ్‌గా ప్రమోట్ చేసింది. కమిటీ సభ్యుడిగా తనకు అప్పగించిన బాధ్యతను విప్లవ స్ఫూర్తితో, పట్టుదలగా మరింత బాధ్యతాయుతంగా అమలు చేస్తూ, కమిటీ ఫంక్షనింగ్‌లో ఐక్యత–ఘర్షణ అనే సూత్రబద్ధతను పాటిస్తూ పని చేశాడు. సప్లై పనులలో భాగంగా 2018 డిసెంబర్ ఉదయం 5 గంటల 30నిమిషాల వరకు ప్రయాణం చేసి, మల్కనగిరి జిల్లా, కొయిరిపుట్ బ్లాక్ (మాచ్‌ఖండ్ ఏరియా)లోని బాల్‌బడి గ్రామం పరిసరాలకు చేరుకొని మసక చీకటిలోనే అక్కడే ఆగి, కాలకృత్యాలు తీర్చుకుంటున్న సమయంలో ఆ గ్రామ రైతులు పంటకాపలా, జంతువుల వేట కోసం పెట్టిన కరెంటు తీగకు ప్రమాదవశాత్తు ఒక మహిళా కామ్రేడ్ తగలడంతో, పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి. అప్పటికే నీళ్ళకోసం వెళ్ళిన కామ్రేడ్ అద్మాల్ ప్రమాదం జరగడాన్ని గమనించి, ఆమెను రక్షించడానికి పరుగెత్తుకొని వచ్చి, అనుకోని విధంగా తానే ఆ కరెంట్ వైర్‌కు తగిలి, తీవ్రంగా గాయపడి, అందరూ చూస్తుండగానే క్షణాల్లో ప్రాణాలు కోల్పోయాడు. ఊహించని దుర్ఘటన నుండి కామ్రేడ్ అద్మాల్‌ను కాపాడుకోలేకపోయినందుకు అక్కడున్న కామ్రేడ్స్ తీవ్రమైన దిగ్భ్రాంతికి, విషాదానికి, దుఃఖానికి గురయ్యారు. వెంటనే ఈ సంఘటన శత్రువుకు అర్థం కాకుండా వుండటానికి మన కామ్రేడ్స్ అక్కడి స్థానిక ప్రజలతో కలిసి జోహార్లు అర్పిస్తూ ఖననం చేశారు. ఈ వార్త కొంత ఆలస్యంగా అందుకున్న పార్టీ, పి.ఎల్.జి.ఎ శ్రేణులు, ప్రజలు తీవ్రమైన దుఃఖానికి గురైనప్పటికీ, అద్మాల్ విప్లవ జీవితాన్ని ఆదర్శంగా తీసుకుంటూ, ఆయన ఆశయ సాధన కోసం, తుది రక్తపు బొట్టు వరకు పోరాడతామని ప్రతిజ్ఞ చేశారు. ●

# కలిమెల వర్గ పోరాటంలో ఉద్భవించిన నిప్పురవ్వ కామ్రేడ్ సున్ని విప్లవ జోహార్లు!

నవంబర్ 5, 2018న చందురుపల్లి గ్రామంలో పాలకవర్గాల కావలి కుక్కలైన ఎస్.ఒ.జి, డి.బి.ఎఫ్‌లు చేసిన ఎన్‌కౌంటర్ హత్యాకాండలో అమరులైన వారిలో కామ్రేడ్ సున్ని (మాసెమాడి) కూడా ఒకరు. కామ్రేడ్ సున్నిది మల్కనగిరి జిల్లా, కలిమెల బ్లాక్, తెల్లరాయి పంచాయితీ సుద్దకొండ గ్రామం. గత మూడు దశాబ్దాలకుపైగా ఈ ప్రాంతంలో విప్లవ రాజకీయాలు నడుస్తూ వస్తున్నాయి. పార్టీ నాయకత్వంలో విప్లవ ప్రజా సంఘాలు, మిలీషియా, జి.ఎన్.ఎస్, ఆర్.పి.సి వంటి నిర్మాణాలు ప్రచార, ఆందోళన కార్యక్రమాలతో ప్రజల రాజ్యాధికారానికి కృషి చేస్తూ వస్తున్నాయి. ఈ కార్యక్రమాలలో వందల, వేల సంఖ్యలో ప్రజలు భాగస్వాములవుతున్నారు. విప్లవకర వాతావరణంలో పెరిగిన కామ్రేడ్ సున్ని కూడా అన్ని కార్యక్రమాలోనూ పాల్గొనేది. గ్రామానికి దళం వచ్చినప్పుడు దళ కామ్రేడ్స్ వద్ద రాజకీయాలు నేర్చుకోవడంతో పాటు, దళ రక్షణలో భాగంగా సెంట్రీలు చేసేది.

2013 సెప్టెంబర్‌లో పార్టీ ఇచ్చిన ప్రతిఘటన కార్యక్రమం పిలుపుకు పదుల సంఖ్యలో మిలీషియా హాజరయ్యారు. వారిలో కామ్రేడ్ సున్ని కూడా ఉంది. వీరంతా డివిజన్‌కు చెందిన ఎల్.జి.ఎస్ కామ్రేడ్స్‌తో పొడియా ఏరియాకు వెళ్ళారు. కొద్దిరోజుల అనంతరం మిలీషియా కామ్రేడ్స్‌కు శిక్షణనిచ్చేందుకు శీలకోట గ్రామ పరిసరాలలో మకాం వేశారు. ఇన్‌ఫార్మర్ ఇచ్చిన సమాచారంతో ఎస్.ఒ.జి, డి.బి.ఎఫ్ బలగాలు రాత్రికిరాత్రే పి.ఎల్.జి.ఎ పడుకున్న ప్రాంతాన్ని గేరావ్ చేసి, గుళ్ళవర్షం కురిపించారు. ఈ ఘటనలో కలిమెల ఏరియాకు చెందిన 13 మంది మిలీషియా కామ్రేడ్స్ అమరులయ్యారు. వీరిలో 12 సంవత్సరాల మైనర్ బాలిక కూడా ఉంది. ఈ ఘటన నుండి కామ్రేడ్ సున్ని తృటిలో తప్పించుకుంది. అమరులైన 13 మంది మిలీషియా కామ్రేడ్స్‌కి కామ్రేడ్ సున్ని అత్యంత సన్నిహితురాలు. వీరందరి జ్ఞాపకాలు ఆమెను కలిచివేశాయి. అంతులేని దుఃఖంలో ముంచి వేశాయి. అయినప్పటికీ, కొద్దికాలంలోనే ఆ దుఃఖం నుండి తేరుకుని శత్రువుపై అంతులేని కసితో 2014లో కలిమెల దళంలోకి పూర్తికాలం సభ్యురాలిగా భర్తీ అయ్యింది.

పార్టీలోకి రిక్రూట్ అయిన తర్వాత విద్య నేర్చుకుంది. కలిమెల, పప్పులూరు ఏరియాలోని ప్రజలతో ఆమె ఉద్యమంలోని భాగస్వామి అయిన తర్వాత శత్రు నిర్బంధం మునుపెన్నడూ లేనంత తీవ్రస్థాయికి చేరింది. ఈ నిర్బంధంలో అనేక మంది గుండెజారి శత్రువుముందు మోకరిల్లుతున్నా, కామ్రేడ్ సున్ని ఏ మాత్రం ఊగిసలాట లేకుండా పీడిత ప్రజల విముక్తి కోసం దృఢంగా నిలబడింది. ఉద్యమంలో ఎదురవుతున్న అనేక కష్టాలను అమరులిచ్చిన గొప్ప విప్లవ స్ఫూర్తితో అధిగమించింది. ప్రజల్లోకి వెళ్ళినప్పుడు వారితో దోపిడీ పాలకుల మోసాల్ని వివరిస్తూ, వర్గ పోరాట ఆవశ్యకతను అర్థం చేయించేది. దోపిడీ వ్యవస్థను కూలదోసి, నూతన ప్రజాస్వామిక విప్లవాన్ని విజయవంతం చేయాలని పట్టుదలగా శ్రమించేది. ఈ క్రమంలోనే చందురుపల్లి ఎన్‌కౌంటర్‌లో అమరురాలైంది. ఆమె అమరత్వం ఆ ప్రాంత ప్రజలకు, పార్టీకి ఎంతో నష్టం. కామ్రేడ్ సున్ని ఆదర్శాలను, కలలను నిజం చేసేందుకు దృఢ సంకల్పంతో పోరాడుదామని ప్రతిజ్ఞ చేద్దాం. ●

# ప్రతిఘటన ద్వారానే పురోగమనం సాధ్యమని

# స్వీయ అనుభవం ద్వారా చాటిచెబుతున్న ఎ.ఒ.బి విప్లవ ప్రజానీకం

మే 2018లో, కేంద్రప్రభుత్వం, వ్యూహంలో నూతన మార్పులంటూ, 'సమాధాన్' పేరుతో తన ఫాసిస్టు దాడిని తీవ్రతరం చేసింది. ఈ వ్యూహాత్మక దాడిలో భాగంగానే ఎ.ఒ.బి ప్రాంతంలో కూడా ఆంధ్రప్రదేశ్, ఒడిశా ప్రభుత్వాలు విప్లవోద్యమంపై తమ దాడిని ఉధృతం చేశాయి. పెరుగుతున్న ఈ దాడిని 'ప్రతిఘటించడం ద్వారానే తిప్పి కొట్టగలమనే' నియమాన్ని పార్టీ ప్రజలకు అర్థం చేయించి, వారిని కార్యరంగంలోకి దింపింది. ఈ నేపథ్యంలోనే పార్టీ, పి.ఎల్.జి.ఎల నేతృత్వంలో ప్రజా నిర్మాణాలు, ప్రజలు కలిసి ఉమ్మడిగా శత్రుదాడిని ఎదుర్కొంటూ, విప్లవోద్యమాన్ని కాపాడుకొంటూ పురోగమింపచేస్తున్నాయి.

## పెరుగుతున్న శత్రుదాడి

ఈ కాలంలో, శత్రువు ఎ.ఒ.బిలోని విప్లవోద్యమంపై అన్ని రకాల నిర్బంధ రూపాలను తీవ్రతరం చేశాడు. ముఖ్యంగా కార్పెట్ సెక్యూరిటీ విస్తరణలో భాగంగా, నిరంతరం కొత్త క్యాంపులు నిర్మాణం చేస్తూనే వున్నాడు. మల్కనగిరి జిల్లాలో పిప్పలపొద్దూర్ వద్ద మరో బి.ఎస్.ఎఫ్ క్యాంపును ఏర్పాటు చేశాడు. వందలకోట్ల రూపాయల ప్రజాధనాన్ని వెచ్చించి, అణిచివేత పథకంలో భాగంగా భారీ ఎత్తున రోడ్లు, బ్రిడ్జిలు, సెల్ టవర్లు నిర్మిస్తున్నాడు. ఇంటలిజెన్సీని బలోపేతం చేసుకొని, నిరంతరం ఏరియా డామినేషన్స్ కొనసాగిస్తున్నాడు. ఒకేసారి 2, 3 ఏరియాలను దిగ్బందించి, 5 నుండి 10 రోజుల వరకు ఏరియా డామినేషన్ చేపడుతున్నాడు. వెసులుబాటు లేకుండా చేపట్టే ఈ డామినేషన్స్ ద్వారా మాస్‌వర్క్, మిలటరీ వర్క్‌కు అనేక ఆటంకాలు కల్పిస్తున్నాడు. సమాచార ఆధారిత దాడులకు ప్లాన్ చేసి, నష్టాలు కలగజేయాలని చూస్తున్నాడు. ఈ సమాధాన్ దాడి పట్టణాలలో సైతం తీవ్రరూపం దాల్చింది. పట్టణాలలో పని చేస్తున్న ప్రజాసంఘాల కార్యకర్తలపై తప్పుడు ఆరోపణలతో అక్రమ కేసులు బనాయించి, జైళ్ళలో నిర్బంధిస్తున్నాడు. చివరకు శ్రీకాకుళం జిల్లాలో తిత్లి తుఫాను సృష్టించిన ప్రకృతి బీభత్సంలో కొబ్బరి, జీడిమామిడి, అరటి తోటలు, పంటలు, ఇళ్లు తీవ్రంగా నష్టపోయి, బాధితులుగా మారిన ప్రజల సహాయార్థం, స్వచ్ఛందంగా ముందుకు వచ్చి వారి తరపున విరాళాలు సేకరించి, సహాయం చేయడానికి సిద్ధపడిన ప్రజలపై, ప్రజా సంఘాలపై కూడా తప్పుడు కేసులు మోపారంటే రాజ్యం ఎంత దుర్మార్గమైన పద్ధతులను అనుసరిస్తున్నాడో అర్థం చేసుకోవచ్చు. పెరుగుతున్న ఈ ఫాసిస్టు నిర్బంధాన్ని ఎదుర్కోవడంలో భాగంగానే పార్టీ, పి.ఎల్.జి.ఎ, విప్లవ ప్రజానీకం సమాయత్తం అయినారు.

---

32వ పేజీ తరువాయి భాగం...

అదే ద్రోహుల ద్వారా శత్రువుకు ఎరవేసి, రప్పించి ఆంబుష్‌లో ఇరికించి, దాడిచేసి, ముగ్గురు పోలీసులను గాయపర్చిన దాంట్లో కీర్తి కూడా పాల్గొన్నాడు. ప్రజల్లో విశ్వాసం కలిగించి శత్రువు కుట్రలను ఓడించి, ప్రజల్ని మరింత దృఢంగా విప్లవోద్యమంలో నిలబెట్టడంలో ముఖ్య భూమికను పోషించాడు. మిలీషియా బాధ్యుడుగా వారిని రాజకీయంగా, మిలటరీ పరంగా తర్ఫీదు చేస్తూ, ప్రజా శత్రువులను, శత్రువు ఏజెంట్లను శిక్షించి విప్లవోద్యమాన్ని రక్షించడంలో చురుకైన పాత్ర పోషించాడు. మిలీషియా సభ్యులను పూర్తికాలం కార్యకర్తలుగా తయారు చేసి, దళంలోకి రిక్రూట్ చేశాడు.

విప్లవోద్యమంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు జరుపుతున్న నిర్బంధానికి తోడు, రాజకీయంగా ఎదుగుదల లేక, అనేక అన్యవర్గ ధోరణులతో సీనియర్ కామ్రేడ్స్ కొందరు ఉద్యమం నుండి దిగజారిపోయినా, గుండె నిబ్బరం కోల్పోకుండ ప్రజలే చరిత్ర నిర్మాతలని నమ్మి, తనకు ఎలాంటి బాధ్యతలు ఇచ్చినా, పట్టుదలగా వాటికి న్యాయం చేసే ప్రయత్నం చేశాడు. 2015 కొర్రుపాల్ ఎల్.ఒ.ఎస్ ఏరియాలో తొంటికిరి వద్ద జరిగిన ఎన్‌కౌంటర్ తర్వాత శత్రువు ఏరియాపై మరింత విరుచుకుపడ్డాడు. 2016లో దళాన్ని 1+2గా మార్చి, పొడియా ఎ.సికి కార్యదర్శిగా బాధ్యతలు అప్పగించినప్పుడు మనస్ఫూర్తిగా స్వీకరించి, కార్పెట్ సెక్యూరిటీ, పెరిగిన ఇన్‌ఫార్మర్ నెట్‌వర్క్ మధ్య శత్రువు కళ్ళుగప్పి ప్రజలతో సజీవ సంబంధాలను కొనసాగించాడు. స్వీయాత్మక శక్తులు తగ్గిపోవడంతో పప్పులూర్, కలిమెల, పొడియా ఏరియాలను కలిపి ఒకే ఎ.సిగా నిర్మాణం చేసినప్పుడు ఈ మూడు ప్రాంతాలలో ఉద్యమ నిర్మాణానికి ఎదురైన అనేక సవాళ్ళను ఎదుర్కొని పని చేశాడు. 'లొంగిపోతే మంచి భవిష్యత్‌ను కల్పిస్తామని, శత్రువు లొంగిపోయిన మాజీల ద్వారా అనేక ప్రయత్నాలు చేసినప్పుడు దాన్ని కొనగోటితో తన్ని, తాను నమ్మిన సిద్ధాంతం కోసం, అమరుల ఆశయాల సాధన కోసం, ప్రజావిముక్తి కోసం ప్రాణాలు ఇవ్వడానికి సిద్ధపడ్డాడు. ఈ క్రమంలో ఒక ద్రోహియిచ్చిన పక్క సమాచారంతో 2018, నవంబర్ 5న చందురుపల్లి గ్రామ సమీపంలో శత్రువు దళం మకాంపై దాడి చేశాడు. అక్కడి నుండి తప్పుకొని రిట్రీట్ అవుతున్నప్పుడు మరికొంత దూరంలో శత్రువు ఏర్పర్చిన ఆంబుష్‌లో చిక్కుకుని శత్రువును ప్రతిఘటిస్తూనే కామ్రేడ్ సుశీల, కామ్రేడ్ సున్నిలతో కలిసి అమరుడయ్యాడు. ఈ సంఘటనను శత్రువు సాధించిన గొప్ప విజయంగా ప్రచారం చేసుకున్నప్పటికీ, అమరుడైన కామ్రేడ్ కీర్తి శవాన్ని ప్రజలు గ్రామానికి తీసుకెళ్ళి, విప్లవ సాంప్రదాయాలతో అంతిమ సంస్కారాలు జరిపి, ఆయన ఆశయ సాధనకు అంకితం అవుతామని ప్రతినబూనారు. శత్రువు పూచిన పూలన్నింటిని చిదిమివేయవచ్చు కానీ, రాబోయే వసంతాన్ని ఆపలేడని మరోసారి ఋజువు చేస్తూ, ప్రజలు ఉద్యమిస్తూనే ఉన్నారు. ●

# పార్టీ నేతృత్వంలో పి.ఎల్.జి.ఎ, ప్రజల ప్రతిఘటన

## అరకు ఎమ్.ఎల్.ఎ కిడార్ని సర్వేశ్వరరావు, మాజీ ఎమ్.ఎల్.ఎ సీవేరి సోమాలను ఖతం చేసిన పి.ఎల్.జి.ఎ

వీరు సామ్రాజ్యవాదులకూ, దళారీ నిరంకుశ బూర్జువా వర్గాలకు విశాఖ మన్యంలోని ఖనిజ సంపదను దోచిపెడుతూ, గని మాఫియాగా మారారు. వీరి ప్రజా వ్యతిరేక, అక్రమ చర్యలను ప్రజలు పార్టీ నేతృత్వంలో వ్యతిరేకిస్తూ వచ్చారు. దీంతో ఈ దళారీ రాజకీయ నాయకులు, రాజ్యం అండతో పెరుగుతున్న ప్రజల నిరసనను దెబ్బతీసేందుకు ప్రయత్నించారు. ఈ నేపథ్యంలోనే ప్రజల సంపూర్ణ, క్రియాశీల మద్దతుతో ప్రజావిముక్తి గెరిల్లా యోధులు సెప్టెంబర్ 23న లివిటిపుట్ గ్రామ సమీపంలో వారిని కాల్చి చంపి, వారి గార్డుల వద్ద వున్న ఆయుధాలను స్వాధీనపర్చుకున్నారు. మిగిలిన దళారులను హెచ్చరించారు. ఈ సంఘటన అడవి మీద అధికారం కోసం పోరాడుతున్న ప్రజలకు గొప్ప ఉత్తేజాన్ని కల్గించగా, దోపిడీ వర్గాలకు వెన్నులో వణుకు పుట్టించింది. ముఖ్యంగా టి.డి.పి చంద్రబాబు ప్రభుత్వానికి చాలెంజ్‌గా మారింది. మావోయిస్టులను దెబ్బతీసామని పగటికలలు కంటున్న పోలీసు అధికారులకూ, చీమ కదిలిన గుర్తించగల్గేంత సత్తావుందని విర్రవీగే ఆంధ్రప్రదేశ్ ఇంటలిజెన్సీకి నోట మాటరాలేదు. అధికారులు తమ వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికి క్రింది అధికారులను, స్థానిక పోలీసులను బాధ్యులను చేస్తూ, వారిపై సస్పెన్షన్స్, బదిలీలు లాంటి చర్యలు తీసుకున్నారు. మరోవైపు ఈ గెరిల్లా చర్య వలన ప్రజలలో విప్లవోద్యమం పట్ల ఏర్పడిన సానుకూల ప్రభావాన్ని బలహీన పరిచేందుకు ప్రతీకారేచ్ఛతో రగిలిపోయారు. పోలీసులు బహిరంగంగానే ప్రతీకారం తీర్చుకుంటామని ప్రకటనలు గుప్పించారు. ఈ క్రమంలోనే ఆంధ్ర, ఒడిశా సరిహద్దులో వందలాది పారామిలటరీ, ప్రత్యేక బలగాలను మోహరించి, కూంబింగ్‌ల పేరుతో గ్రామాలు, అడవులు, మైదానాలు, రహదారులను దిగ్బంధించారు. అనేక గ్రామాలపై దాడులు నిర్వహించి, పదుల సంఖ్యల్లో ప్రజలను అక్రమంగా అరెస్టు చేశారు. విచారణ పేరుతో ఎన్.ఐ.ఎ (నేషనల్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ) ప్రజలను వారాల తరబడి రహస్య ప్రదేశాలలో దాచిపెట్టి, తీవ్రమైన చిత్రహింసలకు గురి చేసి, అక్రమ కేసులు బనాయించి జైళ్ళలో నిర్బంధించింది. అరకు, హుకుంపేట, డుమ్రిగూడ, పెదబయలు, ముంచింగ్‌పుట్, చింతపల్లి, గాలికొండ, గూడెం...తదితర ప్రాంతాలలో ఒక క్యాంపెయిన్‌గా అరెస్టులను కొనసాగించింది. మరొకవైపు అరెస్టు చేసిన వారి నుండి కొందరిని లొంగిపోయినట్టుగా బూటకపు ప్రచారం చేసింది. ఈ సందర్భంగా గతంలో ప్రజా సంఘాలలో పని చేసి, నిర్బంధంలో వెనక్కితగ్గి, సాధారణ జీవితం గడుపుతున్న మాజీలను కూడా వదిలిపెట్టలేదు. ప్రజలు వారపు సంతలకూ, వైద్యం కోసం పట్టణాలకూ, బంధువుల ఇళ్ళకూ, అడవిలోకి వేటకు వెళ్ళలేని భయానక యుద్ధ వాతావరణాన్ని సృష్టించింది. ఈ దాడి కొనసాగింపులో భాగంగానే దళసమాచారం తెలుసుకొని కటాఫ్ ఏరియాలోని డకడపొద్దూర్ గ్రామంపై దాడి చేశారు. అయితే ఈ దాడిని డకడపొద్దూర్ గ్రామ ప్రజలు వీరోచితంగా ప్రతిఘటించారు.

## మల్కనగిరి జిల్లా, కటాఫ్ ఏరియా, డకడపొద్దూర్ గ్రామ ప్రజల సాహసోపేత ప్రతిఘటన

ఎ.పి, ఒడిశా పోలీసులు అక్టోబర్ 10న డకడపొద్దూరు గ్రామంలో దళం వుందనే పక్క సమాచారంతో, రాత్రికి రాత్రే ఆ గ్రామాన్నీ, ఆ గ్రామం నుండి పక్క గ్రామాలకు వెళ్ళే దారులను మూసివేస్తూ చుట్టుముట్టారు. అనుకోకుండానే దళం తెల్లవారుజామున 4గం॥లకు నది దిశలో వెళ్ళి, మిషన్ పడవ ద్వారా ప్రయాణం ఎంచుకొని వెళ్ళిపోయింది. శత్రువు ఈ విషయం ముందే ఊహించలేకపోయాడు. పడవ బయలుదేరిన శబ్దం విని, అప్రమత్తమై దానిపై ఫైర్ చేయడానికి పరుగెత్తాడు. కాని అప్పటికే పడవ దూరంగా వెళ్ళిపోవడంతో, ఫైర్ చేయడం సాధ్యపడలేదు. మరుసటి రోజు ఉదయాన్నే గ్రామ పరిసరాలలో పోలీసులను గమనించిన మిలీషియా, అప్రమత్తమై దాడి చేయడానికి నిర్ణయించుకుంది. అయితే మిలీషియాలోని ఒక టీం, మాటువేసివున్న ఒక పోలీసు బ్యాచీ సమీపానికి వెళ్ళి వారి చేతికి చిక్కింది. ఈ విషయం ఎవరికి అర్థం కాకుండా పోలీసులు వీరిని పోలీసు క్యాంపుకు తరలించడానికి ప్రయత్నిస్తున్నప్పుడు, పక్క గ్రామంలో వున్న ప్రజలు పోలీసులను గమనించి, వెంటనే చుట్టుపక్కల గ్రామాలకు సమాచారం అందించి, అరెస్టు చేసిన పోలీసు బ్యాచీని వెంబడించారు. కొద్ది సమయంలోనే 5, 6 గ్రామాలకు చెందిన సుమారు 400 మంది ప్రజలు సాంప్రదాయక ఆయుధాలతో పోలీసులను వెంబడించి, పరుగెత్తించారు. పరుగెత్తలేక ఆగిపోయిన 10 మంది పోలీసులను అరెస్టు చేసి, సమీపంలోని పెద్ద కొండపైకి ఎక్కించి బంధించారు. అరెస్టు చేసిన 5గురు మిలీషియా సభ్యులను బేషరతుగా విడిచిపెడితేనే మా చేతిలో బందీలుగా వున్న 10 మంది పోలీసులను విడిచిపెడతామని కండిషన్ పెట్టి, వారి వాకీల ద్వారానే మిగిలిన బలగాలకు సమాచారం పంపారు. ఖంగుతిన్న పోలీసులకు ఏమి చేయాలో తోచలేదు. ఓటమిని అంగీకరించడానికి సిద్ధపడకుండా, ముందు పోలీసులను వదిలితే మిలీషియాను క్షేమంగా పంపిస్తామని సమాచారం పంపి వాపస్ వచ్చారు. కాని ప్రజలు అందుకు అంగీకరించలేదు. రాత్రి 10 గం॥ కావస్తున్నది. బందీలుగా వున్న పోలీసులకు ఆకలి, దాహంతోపాటు, ఆందోళన మొదలయ్యింది. తమను వదిలిపెట్టమని ప్రజలను బ్రతిమాలారు. ప్రజలు ఎట్టి పరిస్థితులలో రాజీ పడేది లేదని తెల్చి చెప్పారు. ఒక గంటలోపు తమవారిని వదిలివేయాకపోతే చర్చలుండవని ప్రజలు అనడంతో, తప్పనిసరి పరిస్థితులలో పోలీసులు ప్రజల ముందు ఓటమిని అంగీకరించి, అరెస్టు చేసిన 5గురు మిలీషియాను రాత్రి 11 గం॥లకు కొండపైకి తీసుకువచ్చి బేషరుతుగా ప్రజలకు అప్పగించి, బందీలుగా వున్న తమ 10 మంది పోలీసులను విడిపించుకొని వెను తిరిగి వెళ్ళిపోయారు. అదే రోజు మరిన్ని అదనపు బలగాలను పిలిపించుకొని, దళం ప్రయాణం చేసిన దిశను గుర్తించి 11న, రాత్రికి రాత్రే ఒంద్రపల్లి ప్రాంతంవైపు కదిలారు.

### పోలీసులతో హోరాహోరీగా తలపడి, 11 మందిని గాయపర్చిన ఒంద్రపల్లి ప్రజలు

పోలీసులు అక్టోబర్ 12న ఉదయం 5:30 గం॥లకు ఒంద్రుపల్లి గ్రామ సమీప కొండపైన వున్న దళం ఆచూకి తెలుసుకొని దాడి చేయడంతో, ఎమ్.కె.వి.బి డివిజన్ కమిటీ సభ్యురాలు కామ్రేడ్ మీన గాయపడగా, శతృవు సమీపానికి వచ్చి కౄరంగా హత్య చేశాడు. అదే గ్రామంలో విశ్రాంతి తీసుకుంటున్న ముగ్గురు మహిళా మిలీషియా సభ్యులనూ, ఒక గ్రామస్తుడిని కూడా పోలీసులు అరెస్టు చేశారు. ఈ వార్త కొద్ది సేపట్లోనే చుట్టు పక్కల వున్న అనేక గ్రామాలకు చేరి, మొదట వందలాది మంది ప్రజలు సంఘటన జరిగిన స్థలానికి చేరుకొని శవాన్ని అప్పగించాలనీ, అరెస్టు చేసిన వారిని విడుదల చేయాలని ఘర్షణకు దిగారు. పోలీసులు రకరకాల హామీల ద్వారా ప్రజలను మభ్యపెడుతూ, ముందుకు కదలడానికి ప్రయత్నించారు. ఈ లోపు ప్రజల సంఖ్య 3వేలకు పెరిగింది. దీంతో పోలీసులు తప్పనిసరి పరిస్థితులలో "ఘర్షణ వద్దు చర్చ చేద్దామని" ప్రతిపాదన ముందుకు తెచ్చారు. "చనిపోయిన మహిళా నక్సలైట్‌ది ఈ ప్రాంతం కాదు కనుక అప్పగించం, అరెస్టు చేసిన వారి ఆధార్ కార్డులు చూపితే విడిచిపెడతాం" అని సమస్యను పక్కదారి పట్టించడానికి ప్రయత్నించగా, అప్పటికే ఆవేశం, కసి, బాధతో రగులుతున్న ప్రజల నుండి ఒకరు ఎస్.ఐకి గురి చూసి 'గులివేరు'తో తలకు కొట్టాడు. దీంతో ఖంగుతిన్న పోలీసులు గందరగోళంతో ప్రజలపైకి ఫైరింగ్ ఓపెన్ చేశారు. మహిళలు, రాళ్ళు, కర్రలతో పోలీసులపై దాడికి దిగారు. ఈ ఘర్షణలో ఎస్.ఐతో పాటు, 11 మంది గ్రేహౌండ్స్ పోలీసులకు తీవ్రంగా గాయలయ్యాయి. దీంతో పోలీసులు ప్రజలపైకి, గాల్లోకి కాల్పులు జరుపుతూనే, తమ బలగాలను సమీకరించుకొని కామ్రేడ్ మీన శవాన్ని, అరెస్టు చేసిన వారిని అడ్డదారుల్లో తరలించుకొని వెళ్ళిపోయారు. అరెస్టు చేసిన వారిని విడిచి పెట్టాలని డిమాండ్‌తో మరుసటి రోజు ఆంధ్రప్రదేశ్‌లోని ముంచింగ్‌పుట్, ఒడిశాలోని చిత్రకొండ పోలీసుస్టేషన్‌ల ముందు వందలాది మంది ర్యాలీ నిర్వహించారు.

### పెదబయలు ఏరియాలో పోలీసుల ఏరియా డామినేషన్‌ను తిప్పికొట్టిన పి.ఎల్.జి.ఎ

అక్టోబర్ 8న పెదబయలు ఏరియాపై గ్రేహౌండ్స్ పోలీసులు ఏరియా డామినేషన్ దాడిని చేపట్టారు. ఈ దాడిని ఎదుర్కొనేందుకు పి.ఎల్.జి.ఎ సిద్ధమైంది. అదే రోజున జుమ్మ, చిట్టెంగరువు గ్రామాల మధ్య పోలీసుల రాకను పి.ఎల్.జి.ఎ గమనించి బూబిట్రాప్‌ను అమర్చారు. కూంబింగ్‌లో వున్న గ్రేహౌండ్స్ బలగాలకు ఆ స్థలానికి రాగానే అనుమానం కలిగి పై అధికారులకు బాంబు స్క్వాడ్‌ను పంపాలని సమాచారం యిచ్చారు. ఒకరోజు గడిచినా అధికారుల నుండి ఎలాంటి సమాధానం రాకపోవడంతో, దానిని వెతకడం ప్రారంభించారు. ఆ క్రమంలో మైన్ పేలి 6గురు పోలీసులు గాయపడ్డారు. వారిని వైద్య కోసం పంపడానికి హెలికాప్టర్ పంపాలని చేసిన విజ్ఞప్తిని కూడా పై అధికారులు పెడ చెవిన పెట్టారు. సాధారణ జవాను ప్రాణాలు వారికి గడ్డిపోచతో సమానం. చివరకు ప్రమాదంలో చిక్కుకున్న బలగాలు గాయపడిన వారిని సుమారు 25 కి.మీ మోసుకొనివెళ్ళి, హాస్పిటల్‌లో చేర్పించి వైద్యం అందించారు.

### మల్కనగిరి జిల్లా, కటాఫ్ ఏరియా ముకుడుపల్లి గ్రామ సంఘనాయకుడిని విడిపించుకునేందుకు పోలీసులతో ముఖాముఖి తలపడ్డ గ్రామ ప్రజలు

సెప్టెంబర్ 14న, 50, 60 మంది కోబ్రా బలగాలు ముకుడుపల్లి గ్రామం వద్ద కాపుకాసి, రాత్రి 12 గం॥ల సమయంలో దారిలో వస్తున్న సంఘ నాయకుడిని అరెస్టు చేశారు. ఈ వార్త తెలిసిన వెంటనే గ్రామంలోని ప్రజలంతా గుమ్మిగూడి, పోలీసులను అడ్డుకున్నారు. పోలీసులు ప్రజలపై దాడి చేసి, సంఘనాయకున్ని తీసుకెళ్ళేందుకు ప్రయత్నించారు. ఈ క్రమంలో పోలీసులు ఒక మహిళ చీరను లాగారు. దానితో మరింత రెచ్చిపోయిన మహిళలు, వృద్ధులు, పిల్లలు పోలీసులపై దాడికి దిగారు. ఇరువైపుల నుండి సుమారు 4గంటల పాటు ఘర్షణ జరిగింది. చాలా మంది పోలీసులకు, ప్రజలకు గాయాలయ్యాయి. ఒక జవాను మోకాలు చిప్ప పగిలిపోయింది. దీనితో అతను కదలలేని స్థితికి చేరాడు. ప్రజల ప్రతిఘటన ముందు సాయుధ పోలీసులు తలవంచక తప్పలేదు. సంఘ నాయకుడిని వదిలిపెట్టి, గాయపడిన జవాన్‌ను మోసుకుంటూ కాలికి బుద్ధి చెప్పి, పరాజయంతో వెనుతిరిగి వెళ్ళిపోయారు.

### విశాఖ జిల్లా, పెదబయలు మండలం నుర్మతి పోలీసు క్యాంపు సమీపంలో పి.ఎల్.జి.ఎ నిర్వహించిన ఆంబుష్

పెదబయలు ఏరియాలోని నుర్మతి గ్రామంలో కొత్తగా పోలీసు క్యాంపు ఏర్పాటు చేసి, పెట్రోలింగ్ పేరుతో గ్రామాలపై దాడులు, ప్రజలను చెకింగ్‌ల పేరుతో వేధించడం చేస్తున్నారు. నవంబర్ 29న యాక్షన్ టీం నుర్మతి సమీపంలో రోడ్డుపై వెలుతున్న పోలీసు బ్యాచీపై క్లేమోర్ మైన్ పేల్చగా, ఇద్దరు పోలీసులు తీవ్రంగా గాయపడ్డారు. అదే సమయంలో మోటరు సైకిల్‌పై వెలుతున్న సాధారణ యువకుడికి స్వల్పంగా గాయాలయ్యాయి. ఈ సంఘటనతో ఖంగుతిన్న పోలీసులు ఒక్క తూటా కూడా పేల్చకుండా కాలికి బుద్ధి చెప్పి క్యాంపు వరకు పరుగెత్తారు.

### ఒంద్రుపల్లి, చందురుపల్లి ఎన్‌కౌంటర్లకు నిరసనగా జోన్ బంద్‌ను విజయవంతం చేసిన ప్రజలు

అక్టోబర్ 12న ఒంద్రుపల్లిలో జరిగిన ఎన్‌కౌంటర్, నవంబర్ 5న చందురుపల్లి వద్ద జరిగిన ఎన్‌కౌంటర్ హత్యలకు నిరసనగా నవంబర్ 28న ఆంధ్ర, ఒడిశా రాష్ట్రాల బంద్‌కు ఎ.ఒ.బి, ఎస్.జడ్.సి పిలుపునిచ్చింది. ఈ ఎన్‌కౌంటర్‌లను నిరసిస్తూ, కటాఫ్ ఏరియాలో గురుశెట్టి గ్రామం వద్ద 750 మందితో, గొయిలికారి గ్రామం వద్ద 500 మంది ప్రజలతో, దర్లబెడలో 850 మంది ప్రజలతో, ఒరపొద్దూరు వద్ద 400 మందితో, దిశరిగూడ వద్ద 500 మందితో, నడిమంజరి వద్ద 450 మందితో, కాల్‌గూడ, అమ్లిబెడ గ్రామాల మధ్య 1000 మంది ప్రజలతో ఏరియాలోని మొత్తం గ్రామాల నుండి ప్రజలు కదిలి ఎన్‌కౌంటర్‌లను నిరసిస్తూ, ఊరేగింపులు నిర్వహించి, ప్రభుత్వ ఫాసిస్టు నిర్బంధాన్ని ప్రతిఘటించి ఓడిస్తామనీ, అమరుల ఆశయాలను ముందుకు తీసుకుపోతామని ప్రతిజ్ఞ చేశారు. బంద్‌ను విఫలం చేయడానికి శత్రువు జోన్ వ్యాప్తంగా పోలీసు బలగాలను మోహరించి బెదిరింపుకు పాల్పడినా, ప్రజలు బంద్‌ను పూర్తిగా విజయవంతం చేశారు.

## పిప్పల్‌పొద్దూర్ పోలీసు క్యాంపుకు వ్యతిరేకంగా కదం తొక్కిన ప్రజలు

కార్పెట్ సెక్యూరిటీ విస్తరణలో భాగంగా, మల్కనగిరి జిల్లా, గుమ్మ బ్లాక్‌లోని పిప్పల్‌పొద్దూరు గ్రామంలో కొత్తగా బి.ఎస్.ఎఫ్ క్యాంపును ఏర్పాటు చేశారు. ఈ క్యాంపును ఎత్తివేయాలనే డిమాండ్‌తో నక్కమామిడి, ముదిలిగూడ పంచాయితీలలోని సుమారు 25 గ్రామాలకు చెందిన 2వేల మంది ప్రజలు సాంప్రదాయక ఆయుధాలు ధరించి 'పోలీసు క్యాంపులు కాదు, స్కూళ్ళు, హాస్పిటల్స్ నిర్మించండి, రోడ్లు కాదు సాగునీటి కాలువలు తవ్వండి, త్రాగునీరివ్వండి, గ్రామాలపై దాడులు, అక్రమ అరెస్టులు ఆపాలి' అని తదితర డిమాండ్‌లతో క్యాంపు వరకు ఊరేగింపుగా వెళ్ళి రోడ్డుపై బైఠాయించారు. పోలీసు అధికారులు ప్రజల వద్దకు వచ్చి, మేం కేవలం రోడ్డు నిర్మాణ పనులకు రక్షణ కల్పించడానికే వచ్చామనీ, దాడులు, అరెస్టులు చేయమనీ, మీ సమస్యలను ప్రభుత్వానికి తెలియజేస్తామని మాట్లాడారు. దీంతో ప్రజలు పోలీసు క్యాంపుకు వ్యతిరేకంగా తమ ప్రతిఘటనను మరింత తీవ్రతరం చేయాలని నిర్ణయించుకున్నారు.

## బలిమెల రిజర్వాయర్ ముంపులో పంట పొలాలను నష్టపోయిన కట్‌ఆఫ్ ఏరియా ఆదివాసీ రైతాంగం – నవీన్ ప్రభుత్వంపై ఆగ్రహం

ఒడిశాలోని బలిమెల డ్యాం వద్ద కరెంట్ ఉత్పత్తికోసం నీటి నిల్వలు విపరీతంగా  పెంచడంతో, బ్యాక్ వాటర్ (రిజర్వాయర్) మున్నెన్నడు లేనంత స్థాయిలో విస్తరించింది. ంతో రిజర్వాయర్ చుట్టుపక్కల గ్రామాలలో నివసిస్తున్న ఆదివాసీ రైతాంగానికి చెందిన పంట పొలాలు మెజారిటీగా ముంపుకు గురైనాయి. ఈ సమస్య గతం నుండీ ఉన్నప్పటికీ, ఈ సారి చాలా తీవ్ర స్థాయికి చేరింది. రైతాంగం సర్వస్వం కోల్పోయారు. కొన్ని గ్రామాల మధ్య గల రహదారులు కూడా మునిగిపోవడంతో, ప్రజలకు ఎక్కడికి పోలేని పనిస్థితి ఏర్పడి, వారు అనేక ఇక్కట్ల పాలయ్యారు. ఈ సమస్య ఇప్పటిది కాదు. డ్యాం నిర్మాణ సమయంలోనే ఇక్కడి ఆదివాసీలు ప్రభుత్వ నిర్లక్ష్యానికి గురై, ఎటువంటి నష్టపరిహారం పొందకుండానే విస్తాపితులయ్యారు. డ్యాం నిర్మాణం తర్వాత, రిజర్వాయర్ పరిసర గ్రామాల ప్రజలకు ముంపు సమస్యలు తప్పడం లేదు. ఇప్పటికే ఈ దోపిడీ ప్రభుత్వాలు అనుసరిస్తున్న రకరకాల దోపిడీ విధానాలకూ, నిర్లక్ష్యపూరిత వైఖరికి అసహనంతో వున్న ప్రజలు, ఈ సారి ముంపు సమస్య ఎదురు కావడంతో తీవ్రమైన ఆగ్రహం వ్యక్తం చేశారు.

ప్రభుత్వ నిర్లక్ష్యానికి వ్యతిరేకంగా, సెప్టెంబర్ 29వ తేదీన జనతాబాయి పోలీసు క్యాంపుకు ఎదురుగా 7వేల మందితో ర్యాలీ, ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలు నవీన్ ప్రభుత్వంపై నిప్పులు కురిపించారు. నవీన్ ప్రజల నిత్యవసరాలైన విద్య, వైద్యం, సాగునీరు, తాగునీరు వంటి సమస్యలను పట్టించుకోకుండా దోపిడీ వర్గాల ప్రయోజనాలను ఈడేర్చే వ్యూహాత్మక నిర్మాణమైన గురుప్రియ బ్రిడ్జిని మాత్రం, సాయుధ బలగాల దన్నుతో నిర్మిస్తున్నాడని తమ కోపాన్ని, నిరసనను వ్యక్తం చేశారు. అలాగే కట్‌ఆఫ్ ఏరియాను 'స్వాభిమాన్' ప్రాంతంగా మాట్లాడుతూ, 'సంక్షేమ' కార్యక్రమాలకు 100 కోట్ల ప్యాకేజిని ప్రకటించిన నవీన్ మోసపూరిత స్వభావాన్ని, కుట్రను బహిర్గతం చేశారు.



ముంపుకు గురైన పంటలకు నష్టపరిహారం చెల్లించాలంటూ, నవీన్ ప్రభుత్వానికి వ్యతిరేఏకంగా భారీ భహిరంగ సభ జరుపుకొన్న కటాప్ ఏరియా ప్రజలు

# ప్రజల క్రియాశీలక భాగస్వామ్యంతో గాలికొండ, కలిమెల, పప్పులూరు, కటాఫ్ ఏరియాలలోని ఇన్‌ఫార్మర్‌లను శిక్షించిన పి.ఎల్.జి.ఎ

విశాఖ జిల్లా, గాలికొండ ఏరియా, గూడెం మండలంలోని సుక్కగొయ్యి గ్రామానికి చెందిన రాంచందర్ చాలా కాలంగా పోలీసు ఏజెంటుగా పని చేస్తున్నాడు. ప్రజలకు అనుమానం కలగని రీతిలో పని చేస్తూ, ఎప్పటికప్పుడు పోలీసుల నుండి డబ్బులు తీసుకుంటున్నాడు. ఈ ప్రాంతానికి దళం వెళ్ళిన వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వడం, సంఘనాయకుల అరెస్టులకు సహకరించడం, సంఘ కార్యకలాపాలను ఎప్పటికప్పుడు స్టేషన్‌కి చేరవేయడం...వగైరా పద్ధతుల్లో ఇన్‌ఫార్మర్ పని చేస్తూ వచ్చాడు. ఇతని కార్యకలాపాలను అనుమానించిన ప్రజలు వాటిని పార్టీ దృష్టికి తెచ్చారు. దీంతో పార్టీ అతన్ని పట్టుకొని ప్రజల్లో పెట్టి విచారించగా, తప్పును అంగీకరించక తప్పలేదు. ప్రజల ఆమోదంతో రాంచందర్‌ను పి.ఎల్.జి.ఎ ఖతం చేసింది.

మల్కనగిరి జిల్లా, కలిమెల ఏరియాలోని సుద్దకుంట గ్రామంలో గత కొంత కాలంగా పోలీసు ఏజెంట్‌గా పని చేస్తున్న గంగాలును ప్రజల్లో పెట్టి విచారించి, తన పద్ధతులు మార్చుకోమని నచ్చజెప్పి వదిలివేయడం జరిగింది. కాని ఆ తర్వాత కూడా తన ప్రవర్తనలో మార్పు లేకుండా డబ్బుల కోసం మరింత చురుకుగా తన ఇన్‌ఫార్మర్‌గిరిని కొనసాగిస్తూ వచ్చాడు. దళం సమాచారాన్ని అనేకమార్లు పోలీసులకు అందించాడు. గ్రామంలోని సంఘ నాయకుల సమాచారాన్ని పోలీసులకు రెగ్యులర్‌గా చేరవేస్తూ, అరెస్టులకు కారకుడుగా మారాడు. ప్రజలు గంగాలును శిక్షించాలని ప్రతిపాదించడంతో, జులైలో అతనిని గ్రామంలోనే ఖతం చేయడం జరిగింది.

పప్పులూరు ఏరియాలో గ్రామ పోస్ట్‌మెన్ నారాయణ పార్టీ సానుభూతిపరుడుగా కొంతకాలం పని చేశాడు. పోలీసులు డబ్బులు ఎరచూపి అతడిని ఇన్‌ఫార్మర్‌గా మార్చుకున్నారు. కలిమెల ఎ.సి.ఎమ్‌గా పని చేసిన చిన్నబ్బాయి పార్టీని వదిలి వెలుతూ, నారాయణ వద్దకు వెళ్ళగా, నారాయణ పోలీసులకు సమాచారం ఇవ్వడంతో, పోలీసులు చిన్నబ్బాయిని అరెస్టు చేసి, చిత్రహింసలు పెట్టి అనంతరం ఆయనను కాల్చి చంపారు. నారాయణ చేసిన ద్రోహాన్ని ప్రజలు పార్టీకి తెలియజేయడంతో, మన పి.ఎల్.జి.ఎ నారాయణను పట్టుకొని విచారించగా వాస్తవాలు అంగీకరించాడు. ప్రజల ఆమోదంతో నారాయణను పి.ఎల్.జి.ఎ ఖతం చేసింది.

మల్కనగిరి జిల్లా, కటాఫ్ ఏరియాలో, అర్లెంగిపడ గ్రామంలో పార్టీ సభ్యుడుగా పని చేస్తున్న సుక్ర రహస్యంగా ఆంధ్రప్రదేశ్, ముంచింగ్‌పుట్ పోలీసులకు లొంగిపోయి, పార్టీకి అనుమానం రాకుండా నటిస్తూ, సంఘాలలో బలహీనంగా వున్న శక్తులను ఎంచుకొని సరెండర్స్‌కు ప్రోత్సహించడం, పోలీసులతో ఫోన్ కాంటాక్టులో ఉంటూ, ఎప్పటికప్పుడు కర్యకర్తల, సంఘ కార్యకలాపాల సమాచారాన్ని పోలీసులకు అందజేస్తూ వచ్చాడు. ఈ విషయం మనకు ఒక పోలీస్ ఇన్‌ఫార్మర్‌ను విచారించే క్రమంలో అర్థమైంది. దీంతో మన పి.ఎల్.జి.ఎ సుక్రను విచారించి, అతని ద్రోహం అర్థమైన తర్వాత ఖతం చేసి, గ్రామ ప్రజలకు విషయాన్ని అర్థం చేయించింది. మొత్తంగా జోన్‌లో పెరుగుతున్న పోలీసు నెట్‌వర్క్‌ను ధ్వంసం చేయడంలో భాగంగా, కొందరిని విచారించి దేహశుద్ధి చేసి, వదిలివేశారు.

# సెప్టెంబర్ 21న, పార్టీ 15వ అవతరణ దినోత్సవాన్ని,

## గ్రామ గ్రామాన పార్టీ జెండాలు ఎగురవేసి గొప్ప విప్లవ స్ఫూర్తితో జరుపుకున్న కటాఫ్ ఏరియా ప్రజలు

సి.పి.ఐ (మావోయిస్టు) ఏర్పడి 2018 సెప్టెంబర్ 21 నాటికి 15 సంవత్సరాలు పూర్తి అయ్యింది. ఈ సందర్భంగా పార్టీ 15వ అవతరణ దినోత్సవం గ్రామ గ్రామాన జరుపుకుందామని పార్టీ పిలుపునిచ్చింది. ఈ పిలుపునందుకొని పార్టీ సభ్యులు, ప్రజా సంఘాలు, పి.ఎల్.జి.ఎ (మిలీషియా) కటాఫ్ ఏరియా వ్యాప్తంగా పోస్టర్స్, బ్యానర్స్ ద్వారా ప్రజల్లోకి ప్రచారాన్ని తీసుకుపోయారు. ఈ 15 సంవత్సరాల కాలంలో పార్టీ నాయకత్వంలో సైనికపరంగా, ఐక్యసంఘటనపరంగా సాధించిన విజయాలనూ, పొందిన నష్టాలను వివరిస్తూ, దీర్ఘకాలిక ప్రజాయుద్ధ మార్గంలో పయనిస్తున్న భారత విప్లవోద్యమ గమనం ఎలా వుంటుందో వివరించారు. "కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పార్టీపై, విప్లవోద్యమంపై కొనసాగిస్తున్న సమాధాన్ వ్యూహాత్మక దాడి లక్ష్యం, సంపూర్ణంగా విప్లవోద్యమాన్ని నిర్మూలించాలనే దుష్టతలంపుతో ప్రజలపై యుద్ధంగా ఎక్కు పెట్టబడింది. ఈ దాడిని ప్రతిఘటించి ఓడించడానికి విశాల ప్రజారాశులను ప్రజాయుద్ధంలోకి సమీకరించడం ద్వారానే సాధ్యపడుతుంది. పార్టీ లేకుండా ప్రజలకు ఉండేది ఏమిలేదు. అందుకు పార్టీని ప్రజలు కంటికి రెప్పలా కాపాడుకోవాలి. పార్టీ నాయకత్వంలో ప్రజా రాజ్యాధికారం సాధించుకోవాలి. అందుకు ప్రజలు సాయుధం కావాలి. యుద్ధం ద్వారానే సమస్యను పరిష్కారించుకోవాలని" పిలుపునిస్తూ, కొజ్జరిగూడ పాకెట్‌లో 500 మంది ప్రజలతో, పనసపుట్ పాకెట్‌లో 578 మందితో, ఒండ్రుపల్లి పాకెట్‌లో 450 మంది ప్రజలతో ఊరేగింపు జరిపి, సమావేశం జరుపుకున్నారు. అలాగే జొంత్రి పాకెట్‌లో 600 మంది ప్రజలతో, తాబేరు పాకెట్‌లో 500 మంది ప్రజలతో ముంచింగ్‌పుట్ మండలం, కొసంపుట్ పాకెట్‌లో 500 మంది ప్రజలతో, బొంగుపుట్ పాకెట్‌లో 300 మంది ప్రజలతో, కిమిడిపుట్ పాకెట్‌లో 400 మంది ప్రజలతో, గుమ్మ బ్లాక్ నక్కమామిడి పంచాయితీ, అమ్లిబెడ పాకెట్‌లో 800 మందితో, కొయిరిపుట్ బ్లాక్, కాల్‌పొద్దూర్ పాకెట్ 300 మంది ప్రజలతో విడివిడిగా ఈ సమావేశాలు జరుపుకున్నారు. ఈ అన్ని సమావేశాలలో కలిపి 4,900 మంది విప్లవ ప్రజానీకం ఎంతో విప్లవోత్సాహంతో పాల్గొన్నారు. రాబోయే శత్రువు దాడిని ప్రతిఘటించి, ఓడించి పోరాట విజయాలను సంఘటిత పర్చుకుంటూ ముందుకు సాగుతామని గొప్ప విశ్వాసాన్ని వ్యక్తపరిచారు.

# పి.ఎల్.జి.ఎ 19వ అవతరణ వార్షికోత్సవాలను డిశంబర్ 2 నుండి 8 వరకు శత్రువు దాడి మధ్యనే విజయవంతం చేసిన ఎమ్.కె.వి.బి డివిజన్ ప్రజలు

2000లో, అసలైన విప్లవకర పార్టీ, సి.పి.ఐ (ఎమ్.ఎల్) పీపుల్స్‌వార్ నాయకత్వం క్రింద, భారతవిప్లవోద్యమం చరిత్రలో మొదటిసారి ప్రజా విముక్తి గెరిల్లా సైన్యం ఆవిర్భవించింది. తదుపరి కాలంలో నిజమైన కార్మికవర్గ పార్టీలుగా ప్రజలలో కృషి చేస్తున్న సి.పి.ఐ (ఎమ్.ఎల్) [పీపుల్స్‌వార్], ఎమ్.సి.సి(ఐ) పార్టీలు విలీనమైన సి.పి.ఐ (మావోయిస్టు) పార్టీగా ఆవిర్భవించాయి. సి.పి.ఐ (మావోయిస్టు) పార్టీ అది దీర్ఘకాలిక ప్రజాయుద్ధ పంథాలో శత్రువు దాడిని తిప్పికొడుతూనే అనేక గొప్ప విజయాలను సాధించింది. అనన్యమైన త్యాగాలను చేసింది. ప్రజారాజ్యాధికారం దిశగా ముందుకు సాగుతున్నది. ప్రజాసైన్యం లేకుండా ప్రజలు ఏమి సాధించలేరనే సత్యాన్ని ప్రజలు గ్రహించేలా దాని ఆచరణ కొనసాగుతున్నది. ప్రజలు పి.ఎల్.జి.ఎను పీడిత ప్రజల సైన్యంగా స్వంతం చేసుకున్నారు. ప్రజలు యుద్ధంలో ప్రత్యక్షంగా, పరోక్షంగా, క్రియాశీలకంగా పాల్గొనడం దినదినం పెరుగుతున్నది.

మన పి.ఎల్.జి.ఎ ఏర్పడి 18 ఏళ్ళు పూర్తయి, 19వ సంవత్సరంలోకి ప్రవేశిస్తున్నది. ఈ సందర్భంగా పి.ఎల్.జి.ఎ సాధించిన విజయాలను ఎత్తిపడుతూ, 'పి.ఎల్.జి.ఎలో చేరండి, ఆపరేషన్ సమాధాన్ వ్యూహాత్మక దాడిని ఓడించండి' అని పిలుపునిస్తూ, గ్రామ గ్రామాన పి.ఎల్.జి.ఎ జెండాలు ఎగురవేసి, ఊరేగింపులు, సభలు జరుపుకోవాలని గుమ్మ ఏరియా కమిటి పిలుపునిచ్చింది. అదే సందర్భంగా పి.ఎల్.జి.ఎ వార్షికోత్సవాలను అడ్డుకోవడానికి శత్రువు ఏరియా డామినేషన్‌ను కూడా పెద్ద ఎత్తున చేపట్టాడు. గ్రామపార్టీ, మిలీషియా నాయకత్వంలో ప్రజలు పోస్టర్స్, బ్యానర్స్ ద్వారా ఏరియా వ్యాప్తంగా ప్రచారం నిర్వహించారు. డిసెంబర్ 2 నుండి 8 వరకు గ్రామ గ్రామాన సభలు జరుపుకుంటునే ఆంధ్రప్రదేశ్‌లోని ముంచింగ్‌పుట్ మండలం జోడిగుమ్మ పాకెట్‌లో 300 మందితో, కొండగాబులో 200 మందితో, ఒడిశాలోని కటాఫ్‌లో తాబేర్ పాకెట్‌లో 300 మందితో, కోడిగొంది పాకెట్‌లో 600 మందితో, ఒంద్రుపల్లి పాకెట్‌లో 400 మందితో, అమ్లిబెడ పాకెట్‌లో 400 మందితో పి.ఎల్.జి.ఎ, పార్టీ జెండాలు చేబూని ఊరేగింపులు జరిపి సభలు నిర్వహించుకున్నారు. శత్రువు ప్రజలపై తలపెట్టిన సమాధాన్ దాడిని ఓడించి తీరాలని ప్రతినబూనారు.

# కట్‌ఆఫ్ ఏరియలో అభివృద్ధి - సంక్షేమం

జొంత్రి పంచాయితీ, చదరం గ్రామంలో ప్రజలు చాలా సంవత్సరాల నుండి తాగునీటి సమస్యను తీవ్రంగా ఎదుర్కొంటున్నారు. స్వతంత్ర్యం వచ్చిందని చెప్పుకుంటున్న ఈ 72 సంవత్సరాల కాలంలో, అనేక పర్యాయాలు పార్లమెంటరీ, అసెంబ్లీ, స్థానిక ఎన్నికలు జరిగినప్పటికీ, పాలకవర్గ పార్టీలేవీ వారి తాగునీటి సమస్యతో పాటు, ఏ సమస్యనూ పరిష్కరించలేదు. ఈ ప్రాంతంలో విప్లవోద్యమం ప్రారంభమైన తర్వాతనే, ప్రజలు ప్రత్యామ్నాయ ప్రజల రాజ్యాధికారం కోసమూ, స్వావలంబనతో కూడిన అభివృద్ధికోసం పార్టీ నేతృత్వంలో పోరాడుతున్నారు. ఈ పోరాటంలో భాగంగానే పార్టీ నేతృత్వంలో చదరం గ్రామ ప్రజలంతా కలిసి, 20 రోజుల పాటు, సమిష్టిగా కృషి చేసి, నీటి వనరు (సెలిమె) నుండి 500 మీటర్ల పైపు వేసి, తాగునీటిని గ్రామానికి రప్పించారు. రెండు నీటి కుండీలను కూడా నిర్మించారు. ఈ మొత్తం నిర్మాణానికి అయిన ఖర్చును కొంత భాగం ప్రజలు స్వచ్ఛందంగా భరించగా, మిగిలినవి పార్టీ ప్రజా సంక్షేమ నిధుల నుండి కేటాయించింది. ఈ క్రమంలోనే, తోటగూడ గ్రామంలో, గతంలో నిర్మించిన రెండు నీటికుండీలవల్ల ప్రజల అవసరాలు తీరకపోవడంతో, మరో రెండు నీటి కుండీలు నిర్మించారు. ●

**"ప్రజా పోరాటాల, విప్లవ పద్ధతుల సహకారంలేని ఏ సంస్కరణ గూడ శాశ్వతంగా ఉండజాలదు. వాస్తవమైనది కాజాలదు ప్రాధాన్యతగలది కాజాలదు"**

**"కార్మికవర్గ పార్టీ సంస్కరణలకోసమై జరిగే పోరాటాన్ని కార్మికోద్యమ విప్లవ పద్ధతులతో జతచేయకపోతే అలాంటి పార్టీ ఒక ముఠాగా తయారౌతుంది. ప్రజల నుండి దూరమైపోతుంది. విప్లవ సోషలిజం విజయానికిది తీవ్ర ప్రమాదం"**

-కామ్రేడ్ మావో

# ప్రత్యేకహోదా, కాఫీతోటలు, బాక్సైట్, నిర్బంధం...తదితర సమస్యలపై భారీగా కదిలిన ప్రజలు

విశాఖ జిల్లా, గాలికొండ ఏరియాలో శత్రువు నిరంతర కూంబింగ్‌లు, గ్రామాలపై దాడులు, అక్రమ అరెస్టులు, బూటకపు సరెండర్‌లను ఒక క్యాంపెయిన్‌గా చేపట్టి, పార్టీపై దుష్ప్రచారం చేస్తూ, మానసిక యుద్ధాన్ని ఎడతెరిపి లేకుండా కొనసాగిస్తున్నాడు. ముఖ్యంగా ప్రజలు స్వాధీనం చేసుకున్న కాఫీ తోటలను తిరిగి ఆక్రమించడం, బాక్సైట్ వ్యతిరేక ఉద్యమాన్ని దెబ్బతీయడం, తాత్కాలికంగా దెబ్బతిన్న ఈ ప్రాంత ఉద్యమాన్ని పునర్నిర్మాణం కాకుండా అడ్డుకోవడం లక్ష్యంగా ఈ దాడి ఎక్కుపెట్టబడి కొనసాగుతున్నది. ఈ దాడి ప్రజలపై యుద్ధంగానే అమలు చేయబడుతున్నది. అంటే అన్ని పీడిత వర్గాల, పీడిత సెక్షన్‌లపై అమలవుతున్నది. ఈ దాడిని నిరసించడంతోపాటు, ప్రత్యేక హోదాను అమలు చేయాలనీ, కాఫీ ప్లాంటేషన్‌లపై తమకు హక్కుభుక్తం చేయాలనీ, జి.ఓ నెంబర్ 97ను పూర్తిగా ఉపసంహరించి, బాక్సైట్ గనుల తవ్వకాలను ఆపివేయాలనీ, పోలీసు క్యాంపులను ఎత్తివేయాలనీ, నూతన క్యాంపులను ఏర్పాటు చేయరాదని డిమాండ్ చేస్తూ, ఆ ప్రాంత ప్రజలు విశాల ఐక్యసంఘటనగా ఏర్పడి, పలకజీడిలో ర్యాలీ నిర్వహించి, సభ జరిపారు. అక్టోబర్ 19న తమ డిమాండ్‌ల పత్రాన్ని కొయ్యూరు మండలాధికారి వద్దకు పంపారు. ఇవే డిమాండ్‌లపై అక్టోబర్ 20న గూడెంలో 1000 మంది ప్రజలతో ర్యాలీ, సభ జరిగింది. నవంబర్ 4న రింతాడ గ్రామం వద్ద 500 మంది ప్రజలతో ఊరేగింపు, సభ జరిగింది. ప్రజలపై దాడులలో క్రూరంగా వ్యవహరిస్తున్న సీలేరు ఎస్.ఐపై చర్య తీసుకోవాలనీ, లేకుంటే ప్రజల ప్రతిఘటనను ఎదుర్కోవలసి వస్తుందని హెచ్చరించారు. ప్రజల డిమాండ్‌కు ప్రభుత్వం తలొగ్గి తప్పని పరిస్థితులలో సీలేరు ఎస్.ఐని అక్కడనుండి బదిలీ చేస్తున్నట్లు ప్రకటించక తప్పలేదు.

పెదబయలు ఏరియాలో కూడా ప్రజలు పై డిమాండ్‌లతో పాటు, జి.ఓ నెంబర్ 3 అమలు పరచాలనీ, జల్, జంగల్ జమీన్, ఇజ్జత్, అధికారం ఆదివాసీలకు, పీడిత ప్రజలకే వుండాలనీ, గ్రామాలపై పోలీసుల దాడులు, అక్రమ అరెస్టులు, చిత్రహింసలు, తప్పుడు కేసులు బనాయించడం నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ, అనేక గ్రామాల నుండి సుమారు 7వేల మంది కదిలి వెళ్ళి, మద్దిగరువులో భారీ ర్యాలీ నిర్వహించి, సభను జరిపి తమ డిమాండ్‌ల పత్రాన్ని ప్రభుత్వం ముందుంచారు. ●



## శత్రు నిర్బంధానికి వ్యతిరేకంగా సభలు జరుపుకున్న విప్లవ ప్రజానీకం

# పెదబయలు ఏరియాలోని వేలాది మంది విప్లవ ప్రజలతో జరిగిన అమరుల సంస్మరణ సభలు

వేలాది మంది ప్రజలు, ప్రతి సంవత్సరం జులై 28 నుండి ఆగస్టు 3 వరకు భారత విప్లవోద్యమంలో అసువులు బాసిన అమరులందరిని స్మరించుకుంటూ, వాళ్ళ ఆశయాలను ముందుకు తీసుకుపోతామని ప్రతినబూనుతూ, అమరుల సంస్మరణ వారోత్సవాలను జరుపుకుంటున్నారు. అలాగే ఈ సంవత్సరం పెదబయలు ఏరియాలో ఎ.వి.ఆర్.సి.ఎస్, ఎ.వి.ఎమ్.ఎస్, మిలీషియా సభ్యులు 8 క్యాంపెయిన్ టీంలుగా ఏర్పడి, వారం రోజులపాటు ఏరియా వ్యాప్తంగా మీటింగ్‌లు పెట్టారు. పోస్టర్స్, బ్యానర్స్ ద్వారా అన్ని గ్రామాలలో ప్రచారం చేశారు.

2016 అక్టోబర్ 24న రాంగూడ వద్ద జరిగిన భారీ ఎన్‌కౌంటర్‌లో అమరులైన 31 మంది కామ్రేడ్స్ జ్ఞాపకార్థం పెదబయలు ఏరియాలోని నానబరి గ్రామం వద్ద, అనేక గ్రామాల ప్రజలు పోలీసులను ఎదిరించి 31 అడుగుల స్థూపాన్ని నిర్మించారు. ఈ సంవత్సరం జులై 28న రాంగూడ అమరుల స్థూపావిష్కరణకు ఏరియాలోని అనేక గ్రామాల నుండి సుమారు 7 వేల మంది ప్రజలు నానాబరికి చేరుకున్నారు. ఈ సభనూ, మొత్తంగా సంస్మరణ సభలను విఫలం చేయడానికి చంద్రబాబు ప్రభుత్వం పెద్ద ఎత్తున పోలీసు బలగాలను ఏరియాలో మోహరించింది. అయినా మిలీషియా రక్షణలో సభను జరపాలని ప్రజలు నిర్ణయంచుకున్నారు. సభ సన్నాహాలు జరుగుతుండగానే పోలీసు బ్యాచీలు సభ స్థలానికి వెళ్ళి అడ్డుకోవడానికి ప్రయత్నించారు. అప్పటికే సభకు రక్షణ కల్పించడం కోసం మోహరించిన మిలిషియా క్లేమోర్ మైన్ కనెక్షన్ యిస్తున్నప్పుడు ప్రమాదవశాత్తు పేలిపోయింది. ఈ శబ్దానికి పోలీసు బలగాలు గందరగోళపడి వెనుతిరిగి వెళ్ళి కొంత దూరంలో ఆగిపోయాయి. పోలీసులు ఎన్ని ఆటంకాలు కల్పించినా, చివరకు కాల్పులు జరిపినా, అమరులకు శ్రద్ధాంజలి ఘటించే కార్యక్రమాన్ని నిలిపివేసేది లేదని ప్రజలు దృఢంగా నిర్ణయించుకున్నారు. అమరుల స్థూపం వద్దనే ఊరేగింపు నిర్వహించి, స్థూపావిష్కరణ జరిపి, భారీగా కురుస్తున్న వర్షాన్ని కూడా లెక్కచేయకుండా ఆ రోజు సాయంత్రం వరకు సభ జరుపుకున్నారు. పేరుపేరునా అమరుల చరిత్రను, వారి త్యాగాలను కొనియాడారు. వారి ఆశయసాధనకు పునరంకితం అవుతామని శపథం చేశారు. అమరుల కుటుంబాలకు అండగా వుంటామని హామి ఇచ్చారు. వారి కుటుంబాలను ఆర్థికంగా, ఆదుకోవడంలో భాగంగా ఆ మీటింగ్‌కు వచ్చిన ప్రజలు, అంతకు ముందే జమ చేసిన 10 క్వింటాళ్ళ ధాన్యంనూ, 35వేల రూపాయలను అక్కడే అమరుల కుటుంబాలకు పంపిణీ చేశారు. మీటింగ్ జరుగుతున్నంతసేపు పోలీసు బలగాలు ముందుకు రావడానికి సాహసించలేదు. తెల్లవారి సభ స్థలానికి వచ్చి చూసి, వెను తిరిగి పోయారు.

బలపం, రాళ్ళగడ్డ పంచాయితీలలోని అనేక గ్రామాలకు చెందిన 2వేల మంది ప్రజలు పోలీసుల కూంబింగ్‌లను లెక్క చేయకుండా దగుడుపల్లి గ్రామంలో గల స్థూపం వద్దకు చేరుకుని, ఊరేగింపు జరిపి, ఆ తర్వాత అమరులను స్మరించుకుంటూ సభ జరిపారు. ఈ సభలో వక్తలు మాట్లాడుతూ "పోరాటం వెంట త్యాగాలుంటాయి. త్యాగాలు లేకుండా ప్రజల విముక్తి జరుగదనీ, ఈ రోజు విప్లవోద్యమంపైన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 'సమాధాన్' పేరుతో కొనసాగిస్తున్న ఈ వ్యూహాత్మక దాడిని ఓడించడానికి అందరు సాయుధం కావాలనీ, అమరుల కలలను నిజం చేయాల"ని ప్రజలకు పిలుపునిచ్చారు.

గిన్నెలకోట పాకెట్‌లో 500 మంది ప్రజలతో సభ జరుపుకొని అమరులకు జోహార్లు అర్పించారు. ఇవే కాకుండా ఎక్కడికక్కడ గ్రామాలలో సభలు జరిపి అమరులను స్మరించుకున్నారు.

## కటాఫ్ ఏరియాలో గ్రామ గ్రామాన జరిపిన అమరుల సంస్మరణ సభలు

జులై 28 అమరుల సంస్మరణ వారోత్సవాలను పురస్కరించుకొని ఏరియాలోని యువతను సమీకరించి, వారిని 6 ప్రచార క్యాంపెయిన్ టీంలుగా విభజించి, సుమారు 100 గ్రామాలలో విప్లవ ప్రచారం చేపట్టాము. ఏరియాలోని 11 పాకెట్ల (జనతనసర్కార్ ఏర్పరిచేందుకు కేటాయించిన గ్రామాలను కలిపి పాకెట్ అంటారు)లో అమరుల సంస్మరణ సభలు జరిగాయి. ఈ సభలకు వందలాది మంది ప్రజలు హాజరైనారు. ఈ సభలలో పాల్గొన్న వక్తలు అమరుల ఆశయాలను నెరవేర్చేందుకు తుదివరకు పోరాడాలని ఉపన్యసించారు. ఈ సందర్భంగా నూతన స్థూపాలను నిర్మించడంతో పాటు, ఉన్న స్థూపాలకు ఎర్రరంగు వేయడం, పరిసరాలను శుభ్రం చేయడం... వగైరా పనులను అత్యంత బాధ్యతతోనూ, శ్రద్ధతోను చేపట్టారు. కొన్ని గ్రామాలలో ఇంటింటికి ఎర్రజెండాలు ఎగురవేశారు. సభలకు హాజరైన ప్రజలు అమరుల కుటుంబాలకు వంట సామాన్లు, ధాన్యం, బట్టలు, డబ్బులు అందజేసి, తమ సంఘీభావాన్ని తెలియజేశారు. కొన్ని గ్రామాలలో పండ్ల మొక్కలు తెప్పించి, అమరుల పేరుతో స్థూపాల వద్ద నాటారు. ఈ సారి నూతనంగా రాంగూడ ఎన్‌కౌంటర్‌లో 31లో భాగంగా అమరురాలైన కామ్రేడ్ సిందే స్మారక స్థూపాన్ని తమ స్వగ్రామమైన ముక్కుడుపల్లిలో నిర్మించగా, కామ్రేడ్ మీనా స్థూపాన్ని అంద్రపల్లి గ్రామంలో నిర్మించారు.

అక్టోబర్ 24, 2016న రాంగూడ ఎన్‌కౌంటర్‌లో అమరులైన 31 మంది కామ్రేడ్స్ స్మారకార్థం తోటగూడ, దర్లబెడ చౌక్‌ల వద్ద స్మారక భవనాలు నిర్మించారు. వీటిని ఈ సంవత్సరం అక్టోబర్ 24న వేలాది మంది ప్రజలతో గొప్పగా ఆవిష్కరించారు. ఈ ఆవిష్కరణ కార్యక్రమంలో అమరుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమాలన్నింటిలో ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొన్నారు. ఈ సభలు గొప్ప ఉత్తేజకరమైన వాతావరణంలో జరిగాయి. దోపిడీ వర్గాల యడల ప్రజలలో కసిని మరింతగా పెంచాయి. సంపదపై ప్రజల ఆధిపత్యాన్ని స్థిరీకరించడతో పాటు, అసమానతలు లేని, తమను తాము పరిపాలించుకొనే రాజ్యం సాధించుకొనే దిశగా వారి రాజకీయ దృఢత్వాన్ని పెంచాయి. ఈ మొత్తం కార్యక్రమాలలో ప్రజలకు రక్షణగా పి.ఎల్.జి.ఎ, ప్రధానంగా మిలీషియా బాధ్యతాయుతంగా, సమరశీలంగా తన కర్తవ్యాన్ని నిర్వహించింది. ●

# 2018,జూలై 28 అమరుల వారోత్సవాలు







